ఈనాడు ఆదివారం

21 ఆగసు 2016




గోవిందుడు అందరివాడేలే...

నాన్న దారిలో నడవం..!

వాళ్లంతా దేశంలోనే అత్యంత సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలు. తరాలు కూర్చొని తిన్నా తరగని ఆస్తి. అయినా చాలామంది వారసుల్లా కుటుంబ వ్యాపారాన్ని అందిపుచ్చుకొని సంపదను రెట్టింపు చేయాలనుకోలేదు. తమ తండ్రులకు సంబంధంలేని కొత్త రంగాల్లోకి వెళ్లి తమను తాము నిరూపించుకోవాలని కలలు కన్నారు. వాటిని నిజం చేసుకున్నారు కూడా...


హైక్ సీయీవోగానే...

దేశంలోని అతిపెద్ద టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ వ్యవస్థాపకుడు సునీల్ మిట్టల్. 20దేశాలకు పైగా విస్తరించిన ఆ సామ్రాజ్యానికి కాబోయే అధినేత ఆయన తనయుడు కవిన్ మిట్టలే అనుకున్నారంతా. కానీ కవిన్ మొదట్నుంచీ సొంతంగా పేరుతెచ్చుకోవాలన్న ఆలోచనతో ఉన్నాడు. దానికి తగ్గట్లే యాప్ స్పార్క్స్ అనే సంస్థను నెలకొల్పి వివిధ రకాల మొబైల్ యాప్స్ తయారు చేయడం మొదలుపెట్టాడు. అవేవీ సంతృప్తినివ్వక పోవడంతో చివరికి సోషల్ నెట్‌వర్కింగ్ యాప్ తయారీ పైన దృష్టి పెట్టాడు. దాని ఫలితమే 'హైక్ మెసెంజర్'. వాట్సాప్ తరవాత పదికోట్ల మందికి పైగా వినియోగదారులతో భారత్‌లో రెండో స్థానంలో ఉన్న హైక్, ప్రపంచంలోని మేటి మెసెంజర్ యాప్స్‌లో ఒకటి. మిట్టల్ తనయుడిగా కంటే హైక్ సీయీవోగానే కవిన్‌కు ఎక్కువ పేరుంది.



నాన్న ముద్ర లేకుండా!

సన్‌ఫార్మా వ్యవస్థాపకుడు దిలీప్ సంఘ్వీది దేశంలోని సంపన్నుల జాబితాలో రెండో స్థానం. ఆయన కొడుకు ఆలోక్ సంఘ్వీ తండ్రి కోరిక మేరకు మొదట ఫార్మా కంపెనీలోనే ఉద్యోగిగా చేరాడు. కానీ విదేశాల్లో చదువుకునే రోజుల్లోనే అతడు సౌర విద్యుత్ వ్యాపారంపైన మనసు పారేసుకున్నాడు. అందుకే 'పీవీ పవర్ టెక్' పేరుతో మరో స్నేహితుడితో కలిసి సోలార్ విద్యుత్ ప్యానెళ్లను తయారు చేసే కంపెనీ నెలకొల్పాడు. ఆసియాతో పాటు ఐరోపా, ఆఫ్రికాల్లోని అనేక దేశాల్లో గృహావసరాలతో పాటు భారీ ప్రాజెక్టులకూ ఆ సంస్థ సోలార్ ప్యానెళ్లు సమకూరుస్తూ ముందుకెళ్తోంది.



కళాకారులకు ఆసరాగా

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కుమార్తె అక్షతకు సంస్థలో ఉన్నత స్థాయికి చేరే అవకాశం ఉన్నా, ఆమె ఆసక్తి చూపించలేదు. మొదట్లో సిడీరియన్ అనే ఓ అంతర్జాతీయ వెంచర్ క్యాపిటల్ సంస్థలో పనిచేసిన అక్షత తరవాత సొంతంగా ఫ్యాషన్ బిజినెస్‌ను మొదలు పెట్టింది. దాని ద్వారా భారతీయ గ్రామీణ హస్త కళాకారుల నైపుణ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనేది ఆమె ఉద్దేశం. అందులో భాగంగా తన సంస్థ రూపొందించిన డిజైన్లకు తగ్గట్లుగా వస్త్రాలూ, యాక్సెసరీలను గ్రామీణ కళాకారులతో తయారు చేయించి వాటిని అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేస్తోంది. 'మన కళాకారుల నైపుణ్యానికీ, ఆ కళలకూ ప్రాచుర్యం కల్పించాలన్నదే నా సంస్థ ఉద్దేశం' అంటుంది అక్షత.



'స్వతంత్ర' మార్గంలో...

నాలుగు తరాల వ్యాపార చరిత్ర ఉన్న బిర్లా సామ్రాజ్యానికి ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా. ఆయన కుమార్తె అనన్య మాత్రం తండ్రి నడిచిన దారిలో వెళ్లాలనుకోలేదు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకునేప్పుడే భారత్‌లో అట్టడుగు వర్గ మహిళల అభివృద్ధి కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకున్న అనన్య, స్వదేశానికి రాగానే ఆ పనిలోనే నిమగ్నమైంది. 'స్వతంత్ర మైక్రో ఫైనాన్స్' అనే సంస్థను నెలకొల్పి గ్రామీణ మహిళలకు రుణాలిచ్చి వాళ్ల చిరు వ్యాపారాలను ప్రోత్సహించడం, కొత్త వ్యాపారాల్లోకి తీసుకురావడం మొదలుపెట్టింది. ఇప్పటిదాకా లక్షా పాతికవేల మందికి రూ.108కోట్లకు పైగా రుణాలందించిన సంస్థకు ఎగవేతదార్లు ఒక్కరు కూడా లేకపోవడం విశేషం.



ముఖేష్ మాటల వల్లే...

ఫార్మా దిగ్గజం అజయ్ పిరమల్ తనయుడు ఆనంద్ కొన్నేళ్ల క్రితం చదువు పూర్తిచేసుకుని భారత్‌కి వచ్చేప్పటికి తండ్రి పిరమల్ గ్రూప్‌లో కొంత భాగాన్ని ఓ విదేశీ కంపెనీకి అమ్మేశాడు. అప్పుడు ఆనంద్‌కి మూడు దార్లు కనిపించాయి. ఒకటి... ఉన్న ఆస్తిని అనుభవించడం. రెండు... తండ్రితో కలిసి పిరమల్ గ్రూప్ అభివృద్ధికి పనిచేయడం. మూడు... సొంతంగా కెరీర్ మొదలుపెట్టడం. ఆనంద్ మూడో దానికే ఓటేశాడు. మొదట గ్రామీణ వైద్య సేవలూ, టెలీ మెడిసిన్‌కు సంబంధించిన వ్యాపారం మొదలుపెట్టాడు. తరవాత ఓ రియల్ ఎస్టేట్ సంస్థను నెలకొల్పి విదేశీ పెట్టుబడిదార్లనూ ఆకర్షిస్తూ దూసుకెళ్తున్నాడు. 'సొంతంగా వ్యాపారం చేయడమంటే క్రికెట్ ఆడటం లాంటిది. తండ్రులు ఎలా సంపాదిస్తున్నారో చూస్తూ కూర్చొని బండి నడిపేయడం క్రికెట్ కామెంటరీ చేయడం లాంటిది. ఆడేవాడి నొప్పి కామెంటేటర్‌కి తెలీదు' అని ముఖేష్ అంబానీ ఓసారి నాతో అన్నారు. ఆ మాటలే నా సొంత ప్రయాణానికి స్ఫూర్తి' అంటాడు ఆనంద్



విత్తనం అక్కడ భద్రం

ఊహించని స్థాయిలో భారీ ప్రకృతి వైపరీత్యం, లేదా అణు యుద్ధం వచ్చి మానవ మనుగడను కకావికలం చేస్తే... పంటలే కాదు, తిండి గింజలూ, విత్తనాలూ ఆ విపత్తులో పోతే... అలాంటి పరిస్థితుల్లో కనీసం విత్తనాలైనా ఉంటే మనుగడ దుర్భరం కాకుండా ఉంటుందన్న ఆలోచనల్లోంచి పుట్టిందే 'ద స్వాల్బార్డ్ గ్లోబల్ సీడ్ వాల్ట్'. ఇదో విత్తన బ్యాంకు. నార్వే ప్రభుత్వంతో కలిసి కొన్ని ప్రపంచస్థాయి వ్యవసాయ పరిశోధక సంస్థలు ఈ ప్రాజెక్టుని 2008లో ప్రారంభించాయి. నార్వేలోని స్పిట్స్‌బెర్జెన్ దీవంలోని ఒక పర్వతంలోపల 120 మీటర్లు తొలిచి ఈ బ్యాంకుని ఏర్పాటుచేశారు. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. శాస్త్రవేత్తలూ, పరిశోధకులకు తప్ప సామాన్యులకు దీన్లో ప్రవేశం లేదు. ఇప్పటికే కొన్ని వేల రకాల వంగడాలకు సంబంధించిన లక్షల విత్తనాల ప్యాకెట్లను అన్ని వాతావరణాలకూ తట్టుకోగలిగేలా ప్రత్యేక పెట్టెల్లో నింపి ఇక్కడ దాచారు. ప్రకృతి వైపరీత్యాలనే కాదు, అనుకోని పరిస్థితుల్లో ఏదైనా పంటకు సంబంధించి విత్తనమంతా పోయినా ఇక్కడ నుంచి మళ్లీ సేకరించవచ్చు. ఈ ప్రాంతాన్నే ప్రత్యేకించి ఎంపిక చేయడానికి కారణాలున్నాయి. ఇక్కడ భూకంపాలు సంభవించవు, ఉత్తర ధ్రువానికి 1300కి.మీ. దూరంలో విత్తనాల నిల్వకు అనుకూలంగా మంచుతో కప్పి ఉన్న భూమి పొర ఉంది, సముద్రమట్టానికి 130 మీటర్ల ఎత్తులో ఉంది... కాబట్టి భూతాప ప్రభావమూ తక్కువే! ఎంతటి ముందు చూపో కదా!



లోపల...





మీ మాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

ఆకట్టుకుంది

'అందరి పాపాల్నీ ప్రక్షాళన చేసే గంగమ్మ తన మురికిని వదిలించుకోడానికి కృష్ణానదిలో స్నానమాడుతుంది' అంటూ కృష్ణమ్మ పిలుస్తోంది కథనాన్ని ప్రారంభించిన తీరు ఆకట్టుకుంది. కృష్ణలో పుష్కర స్నానం చేస్తే కలిగే సత్ఫలితాల గురించి చక్కగా వివరించారు.

– ఎస్.శ్రీనివాసరాజు, హైదరాబాద్

– రమ్య(ఈమెయిల్)

ఉపయుక్తం

'ఇల కైలాసం శ్రీశైలం' కథనం భూలోక కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహాక్షేత్రం గొప్పతనాన్ని చక్కగా వివరించింది. పుష్కర స్నానాలు చేయడానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ స్నాన ఘట్టాలు ఉన్నాయో తెలపడం ఉపయుక్తం.

– వి.కృష్ణయ్య, గుంటూరు

– అనుపమ(ఈమెయిల్)

ఆత్మానందం

'తీరం పొడవునా తీర్థాలే' కథనం ఆత్మానందాన్ని కలిగించింది. మహాబలేశ్వరం నుంచి హంసలదీవి వరకూ కృష్ణానది పొడవునా వెలసిన తీర్థాల వివరాలను ఒక్కచోటే పొందుపరిచిన విధానం బాగుంది. కృష్ణమ్మ ప్రయాణంలో అడుగడుగునా వెలసిన పుణ్య క్షేత్రాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తుతాయనడంలో సందేహంలేదు.

– ఎస్.మల్లికార్జునరావు, విజయవాడ

– శారద(ఈమెయిల్)

చాలా బాగుంది

'కృష్ణా క్షేమమా గోదా కుశలమా' కథనం చాలా బాగుంది. కృష్ణా, గోదావరులు తమ అనుబంధాన్ని లేఖలో పంచుకుంటున్నట్టు రాసిన తీరు ఆకట్టుకుంది. వరలక్ష్మీవ్రతం సందర్భంగా అందించిన వంటకాలు బాగున్నాయి.

– పి.వాసవి, నల్గొండ

– జి.రాజేష్(ఈమెయిల్)

భారతదేశ ధాన్యాగారం

కనకదుర్గమ్మ స్వయంభువుగా వెలిసిన ఆలయ విశేషాలు అలరించాయి. జలసిరితో కళకళలాడే శ్రీశైల జలాశయం తెలుగు ప్రజల దాహార్తిని తీరుస్తూ తెలుగునేలను సస్యశ్యామలం చేస్తోంది. శ్రీశైల జలాశయ విశేషాలు తెలియని విషయాలెన్నింటినో తెలియజేశాయి.

– డి.ప్రసాదరావు, కరీంనగర్

– భవాని(ఈమెయిల్)

కళ్లకు కట్టింది

కృష్ణా పుష్కరాల సందర్భంగా అందించిన ప్రత్యేక సంచిక పుష్కర వైభవాన్ని కళ్లకు కట్టింది. ఇల కైలాసం శ్రీశైలం, పుష్కర స్నానం ఎక్కడ, నల్లమల ప్రకృతి ఖిల్లా, తీరం పొడవునా తీర్థాలే, జలసిరి శైలం, ఆత్మీయ సాగరం, పేరు పేరునా కృష్ణమ్మే... ఇలా ప్రతి కథనమూ ఆకట్టుకోవడంతో పాటు ఉపయోగపడే సమాచారాన్నీ అందించింది.


– అరుణ, మిర్యాలగూడ


– వై.మురళీధర్(ఈమెయిల్)


మంచిమాట

శ్రమించడం అలవాటు చేసుకుంటే గెలవడం అలవాటవుతుంది.

చురుక్కు


కేజ్రీవాల్
ఎమ్మెల్యేలు
శ్రీధర్


ఎన్నికలు, పాటీదార్ల ఉద్యమం, ఆనందీబెన్ వర్గం
విజయ్ రూపాణి


రిపబ్లికన్ పార్టీ
ట్రంప్‌కు సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత

చమక్కు



సాధారణ బడ్జెట్
రైల్వే బడ్జెట్
ఇక సాధారణ బడ్జెట్‌లోనే రైల్వే బడ్జెట్

జై...జైనథ్ లక్ష్మీనారాయణ!



ఆ నారాయణుడు...లక్ష్మీనారాయణుడు, సూర్యనారాయణుడు, సత్యనారాయణుడూ! ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్‌లో వెలసిన నారాయణమూర్తిని భక్తులు సంతాన నారాయణుడిగా కూడా కొలుస్తారు. ఎనిమిది వందల ఏళ్ల నాటి ఆలయం ఇది.

భక్త వత్సలుడు జైనథ్‌లో వెలసిన లక్ష్మీ నారాయణుడు. ఆదిలాబాద్ జిల్లాలో ఉందీ క్షేత్రం. శంఖ, చక్ర, గదాయుధాలు ధరించిన స్వామి... మరొకచేతితో అభయాన్ని ప్రసాదిస్తాడు. ఇక, హృదయవాసిని అయిన లక్ష్మి సుఖసంతోషాల్నీ భోగభాగ్యాల్నీ అందిస్తుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయం చాలా ప్రాచీనం. ఎనిమిది వందల సంవత్సరాల నాటిదని అంటారు. మూలవిరాట్టు మూలాలు ఏ త్రేతా ద్వాపరయుగాల్లోనో ఉండి ఉండవచ్చని ఆస్తికుల నమ్మకం. సెప్టెంబరు 11 నుంచి నవంబరు 11 వరకూ... తరచూ సూర్య కిరణాలు నేరుగా స్వామి పాదాల్ని తాకుతూ ఉంటాయి. ఆ సమయంలో గర్భాలయం వైకుంఠంలా దివ్యతేజస్సుతో అలరారుతుంది. ఆ దృశ్యం సూర్యనారాయణుడు శ్రీమన్నారాయణుడికి కిరణాభిషేకం చేస్తున్న భావన కలిగిస్తుంది. ఆ అపురూప ఘట్టాన్ని దర్శించుకోడానికి ఎక్కడెక్కడి భక్తులో తరలి వస్తారు. జైనథ్ నారాయణుడిని... ఆరోగ్యానికి అధిపతి అయిన సూర్యనారాయణుడిగా, కోరిన వరాలిచ్చే సత్యనారాయణుడిగా, సంతాన భాగ్యాన్ని ప్రసాదించే లక్ష్మీనారాయణుడిగా అర్చించడం ఓ ప్రత్యేకత. కార్తిక పౌర్ణమికి పూర్తయ్యేలా... వరుసగా ఐదు పున్నముల్లో ఇక్కడ సత్యనారాయణ వ్రతాలు చేస్తే సకల శుభాలూ కలుగుతాయని భక్తుల విశ్వాసం. రంగనాథస్వామిని పూజించి, ప్రేమించి తరించిన గోదాదేవి మధురభక్తికి సాక్ష్యంగా... ధనుర్మాసంలో నెల రోజుల పాటూ స్వామిని పాశురాలతో అర్చిస్తారు.





ఘనంగా గోదాకల్యాణం నిర్వహిస్తారు.

ఆలయ ప్రశస్తి

తెలంగాణలోని ప్రాచీన క్షేత్రాల్లో జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఒకటి. ఆలయ నిర్మాణ శైలిలోనూ ఎంతో ప్రత్యేకత కనిపిస్తుంది. శిఖరానికి నలువైపులా మర్కటాలూ సింహాల ప్రతిమలు కనువిందు చేస్తాయి. ఆలయం పూర్వాభిముఖంగా, ఎనిమిది కోణాలతో అలరారుతుంది. గర్భగుడిలో లక్ష్మీనారాయణ స్వామి విగ్రహం తేజోవంతంగా దర్శనమిస్తుంది. లక్ష్మీదేవి, అళ్వారులూ, ఇతర దేవతల మూర్తులూ ఉన్నాయి. గర్భగుడి ద్వారం దగ్గర అందమైన శిల్ప తోరణం ఉంది. సన్నని గొలుసుల్లా చెక్కి వాటి చివర గంటలను అమర్చారు.

స్వామివారికి రెండు సింహాసనాలు ఉన్నాయి. అందులో ఒకటి చాలా ప్రాచీనమైందనీ ఉక్కు శిలతో చేశారనీ చెబుతారు. ఆలయం ముందు సువిశాలమైన కోనేరు ఉంది. పూర్వం బ్రహ్మోత్సవాల్లో భాగంగా డోలా హరణోత్సవం, తెప్పోత్సవం ఇక్కడే నిర్వహించేవారు. ఆలయానికి ఎడమ పక్కన శిథిల శివాలయం ఉంది. ఒకప్పుడు శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ ధర్మాల కూడలిగా భాసిల్లింది జైనథ్.

తొలి శాతవాహనులు జైనాన్ని అవలంబించారు. శ్రీముఖ శాతవాహనుడు కోటిలింగాల కేంద్రంగా పాలిస్తూ ఆదిలాబాద్ ప్రాంతాన్నంతా స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. కొంత మేర మహారాష్ట్ర భూభాగాన్నీ జయించాడు. జైనథ్‌లోని ఆలయం అప్పటి జైన క్షేత్రమని చరిత్ర చెబుతోంది. వైదిక మతం విజృంభించడంతో... జైనులు ప్రాధాన్యాన్ని కోల్పోయారు. ఆలయ అంతరాళ మండపంలో శిథిలమైన శిలాఫలకం మీద సూర్య భగవానుడిని స్తుతించే శ్లోకాలున్నాయి. దీన్నిబట్టి చూస్తే, జైనం మరుగునపడిపోయాక... ఈ క్షేత్రం ఆదిత్యుడి ఆలయంగా మారిపోయి ఉండవచ్చు. వైష్ణవం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాక లక్ష్మీనారాయణుడి ప్రాధాన్యం పెరిగి ఉండవచ్చని చరిత్రకారుల విశ్లేషణ.

ఘనంగా రథోత్సవం

లక్ష్మీనారాయణుడి బ్రహ్మోత్సవాలు ఏటా కార్తిక శుద్ధ ఏకాదశి నాడు మొదలవుతాయి. బహుళ పంచమి రోజు ఘనంగా రథోత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామి పంచవాహనుడై భక్తులకు దర్శనమిస్తాడు. సంతానం లేని మహిళలు కార్తిక శుద్ధ ద్వాదశినాడు... అంటే కల్యాణోత్సవం రోజున స్వామి వారి ప్రసాదాన్ని (గరుడ ముద్ద) స్వీకరిస్తే ఏడాది లోపే సంతానం కలుగుతుందని ప్రతీతి. బ్రహ్మోత్సవాల చివరి రోజు రాత్రి జరిగే నాగవెల్లి కార్యక్రమంలో... భక్తితో పూజించినా స్వామి సంతాన భాగ్యాన్ని ఇస్తాడని అంటారు. ఆదిలాబాద్ పట్టణానికి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలోని జైనథ్ మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉందీ ఆలయం. ఆదిలాబాద్ నుంచి అంతర్రాష్ట్ర రహదారి గుండా బేల, సాంగిడి, దీపాయిగూడ, లక్ష్మీపూర్, మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లే బస్సులు అరగంటకు ఒకటి అందుబాటులో ఉన్నాయి.

– *మంద రామచంద్రం*, ఈనాడు, ఆదిలాబాద్ డెస్కు

ఫొటోలు: రవికుమార్

మరో శబరి...

దాకాతే తానుబాయి స్వామి భక్తురాలు. కడివెడు కష్టాల్ని అనుభవించింది. ‘లక్ష్మీనారాయణుడు తోడుగా ఉన్నంతకాలం సమస్యలు నన్నేమీ చేయలేవు’ అని బలంగా నమ్మింది. ఆ ఆధ్యాత్మిక సాధనను మరింత సానబట్టడానికే అన్నట్టు అవసానదశలోనూ ఏవో ఇబ్బందులు. చేతికొచ్చిన బిడ్డ... వెంకటి కెనడాలో ఆకస్మికంగా మరణించాడు. అతడు పనిచేస్తున్న సంస్థ నష్టపరిహారంగా కొంత డబ్బు ఇచ్చింది. బీమా కింద మరో ఇరవై లక్షలు వచ్చాయి. పైసా పైసా కూడబెట్టి దాచుకున్న సొమ్ము ఐదు లక్షలదాకా తేలింది. మొత్తం డబ్బుతో తనే దగ్గరుండి యాత్రికుల కోసం అతిథి గృహాన్ని నిర్మించిందా భక్తురాలు. పొట్టనింపుకోడానికి కూరగాయల వ్యాపారం చేస్తున్నా... తానుబాయి మనసునిండా జైనథ్ లక్ష్మీనారాయణుడే!

బుల్లి క్యాబేజీతో లాభాలెన్నో!

బుల్లి క్యాబేజీలను తలపించే బ్రస్సెల్‌స్ప్రౌట్లలో విటమిన్లూ ప్రొటీన్లూ ఖనిజాలూ పీచూ యాంటీఆక్సిడెంట్లూ పుష్కలంగా ఉంటాయి. అందుకే వీటిని పోషకాహారంగానే కాదు, ఆరోగ్యకరమైనవిగానూ చెబుతారు. వీటినే మనదగ్గర బెంగళూరు క్యాబేజీ అని కూడా పిలుస్తారు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. వంద గ్రా. బ్రస్సెల్ స్ప్రౌట్స్ నుంచి 45 క్యాలరీలూ, 3.38 గ్రా. ప్రొటీన్లూ, 3.8 గ్రా.పీచూ లభ్యమవుతాయి. బ్రస్సెల్‌స్ప్రౌట్స్ అద్భుతమైన యాంటీఆక్సిడెంట్ల నిల్వలు కూడా. వీటిల్లో థియోసైనేట్లూ, ఇండోల్సూ, ల్యూటెన్, జియా-క్సాంథిన్, సల్ఫోరాఫేన్, ఐసోథియోసైనేట్లు ఉంటాయి. ఇవి ప్రొస్టేట్, కోలన్, ఎండోమెట్రియల్ క్యాన్సర్లు రాకుండా కాపాడతాయి. అంతేకాదు, వీటిల్లోని సినిగ్రిన్ అనే గ్లైకోసైడ్, కోలన్ క్యాన్సర్ రాకుండా చేస్తుందని పరిశోధనల్లో తేలింది. ఇంకా ఇవన్నీ కలిసి హృద్రోగాల్నీ నివారిస్తాయి.

వీటిల్లోని డై-ఇండోలిల్-మీథేన్ అనే పదార్థం రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ ఏజెంట్‌గానూ పనిచేస్తుంది.

బ్రస్సెల్‌స్ప్రౌట్స్‌లో విటమిన్-సి శాతం కూడా చాలా ఎక్కువ. వంద గ్రా. బ్రస్సెల్ స్ప్రౌట్స్‌లో 85 మి.గ్రా. దొరుకుతుంది. ఇది విటమిన్-ఎ, ఇ లతో కలిసి శరీరంలో హానికర ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి కాకుండా చేస్తుంది. ఇందులోని ఎ-విటమిన్ కూడా యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తూ చర్మం, కంటి సమస్యల్ని నివారిస్తుంది. ముఖ్యంగా జియా-క్సాంథిన్ అనే కెరోటినాయిడ్ వయసుతోపాటు వచ్చే కంటిసమస్యలు రాకుండా నివారిస్తుంది.



ఇందులో సమృద్ధిగా దొరికే కె-విటమిన్ మెదడు కణాలు దెబ్బతినకుండా కాపాడుతుంది. అంతేకాదు, అల్జీమర్స్ వంటి వ్యాధుల్నీ అడ్డుకుంటుంది. జీవక్రియకు తోడ్పడే నియాసిన్, పైరిడాక్సిన్, థైమీన్, పాంటోథెనిక్ ఆమ్లం... వంటి బి-కాంప్లెక్స్ విటమిన్లూ ఇందులో పుష్కలంగా దొరుకుతాయి. పొటాషియం, కాపర్, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, మాంగనీస్, ఫాస్ఫరస్... వంటి ఖనిజాలకూ ఇవి సమృద్ధికరమైన నిల్వలే. అన్నింటికన్నా విటమిన్-ఎ, ఐరన్ లోపాలతో బాధపడేవాళ్లకు ఇవి మంచి పోషకాహారం.

పరిశోధన

మెనోపాజ్‌తో మధుమేహం!

మెనోపాజ్ ముందు వచ్చినా లేదా ఆలస్యంగా వచ్చినా డయాబెటిస్-2 వచ్చే అవకాశం ఉందని నార్త్ అమెరికన్ మెనోపాజ్ సొసైటీకి చెందిన పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇందుకోసం వీళ్లు దాదాపు లక్షన్నరమంది మహిళల్ని ఎంపికచేసి పరిశీలించారట. సాధారణంగా 51 సంవత్సరాలను మెనోపాజ్ వయసుగా చెబుతారు. అయితే 46 ఏళ్ల కన్నా ముందు మెనోపాజ్‌కు చేరుకున్నవాళ్లలో మధుమేహం వచ్చే అవకాశం 25 శాతం ఎక్కువగా ఉంది. అలాగే 55 దాటాక మెనోపాజ్ వచ్చిన మహిళల్లో 12 శాతం మంది డయాబెటిస్ బారిన పడుతున్నట్లు తేలిందట. ఎందుకంటే మెనోపాజ్ తరవాత శరీరంలో ఈస్ట్రోజెన్ శాతం తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. శరీరంలో కొవ్వులూ పెరుగుతాయి. జీవక్రియా వేగం తగ్గిపోతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర నిల్వలు పెరుగుతాయి. కాబట్టి ముందుగానూ లేదా ఆలస్యంగానూ మెనోపాజ్‌కు చేరుకున్న మహిళలు తమ శరీరంమీద ఓ కన్నేసి ఉంచాలి. ఊబకాయం పెరగకుండా చూసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తింటూ నిత్యం వ్యాయామం చేయాలి అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నీళ్లు వేడెక్కాయా... అయితే తాగొద్దు!

వాతావరణంలోని వేడి కారణంగా ప్లాస్టిక్ బాటిల్స్‌లో గోరువెచ్చగా ఉన్న నీటిని తాగకపోవడమే ఉత్తమమని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌కు చెందిన పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇందుకోసం వీళ్లు వివిధ రకాల బ్రాండెడ్ వాటర్ బాటిళ్లనే పరిశీలించారు. వేడి వాతావరణంలో సుమారు 158 డిగ్రీల ఫారన్‌హీట్ వద్ద నాలుగు వారాలపాటు ఉన్న బాటిల్స్‌లోని నీళ్లలో ఆంటిమొని, బైసెఫెనాల్ అనే రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా వాటర్‌బాటిళ్లన్నీ పాలీఇథిలీన్ టెరెఫ్తాలేట్‌తో తయారవుతాయి. అవి వేడెక్కినప్పుడు ఆ పదార్థం ఆ నీళ్లలోకి రసాయనాలను విడుదల చేస్తుందనీ అవి క్యాన్సర్‌కారకాలనీ ప్రపంచ ఆరోగ్యసంస్థకు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ విభాగం పేర్కొంటోంది. కాబట్టి, నీళ్లని ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ ఉంచడం మంచిదికాదనీ ఒకవేళ అలా ఉంచాల్సి వచ్చినా అవి చల్లని వాతావరణంలోనే ఉండాలనీ హెచ్చరిస్తున్నారు నిపుణులు.



పీచు తింటున్నారా..?

ఆహారంలోని పీచు ఆరోగ్యంమీద చాలా ప్రభావాన్ని కనబరుస్తుందని ఆస్ట్రేలియాలోని 'ద వెస్ట్‌మీడ్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'కు చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. రోజువారీ ఆహారంలో పీచును సరిగా తీసుకోవడంవల్ల మధుమేహం, హృద్రోగాలు, ఊబకాయం, కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా ఉంటాయనీ, జీర్ణవ్యవస్థ కూడా బాగుంటుందనీ వాళ్లు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా పీచును సరైన పాళ్లలో తీసుకోవడంవల్ల వృద్ధాప్యంలో రకరకాల వ్యాధులు రాకుండా ఉంటాయనీ వాళ్లు ఆరోగ్యంగా జీవించేందుకు తోడ్పడుతుందనీ తేలిందట. ఇందుకోసం వీళ్లు యాభై సంవత్సరాలు దాటిన వాళ్లను పరిశీలించి చూడగా- వాళ్లలో పీచుతో కూడిన పిండిపదార్థాలు సరిగ్గా తీసుకున్నవాళ్లలో వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు లేకుండా ఆరోగ్యంగా చురుగ్గా ఉన్నారని తేలిందట.



టూకీగా...


పండ్లూ కూరగాయలూ గింజలతో కూడిన పోషకాహారం తీసుకునేవాళ్లలో డిప్రెషన్ వచ్చే అవకాశం తక్కువని స్పెయిన్ పరిశోధకులు చెప్పుకొస్తున్నారు.

రోజూ వ్యాయామం చేయకుండా కదలకుండా కూర్చునే మధుమేహుల్లో డయాబెటిక్ రెటినోపతి వచ్చే అవకాశం ఎక్కువని మిసిసిపి యూనివర్సిటీ పరిశోధకులు పేర్కొంటున్నారు.

వృద్ధాప్యంలో కండరాలు దృఢంగా ఉండాలంటే మధ్యవయసులో వ్యాయామం తప్పనిసరి అన్నది అమెరికన్ నిపుణుల ఉవాచ.

ఇప్పటిదాకా బంగారాన్నీ, ఆస్తుల్నీ, హోదాల్నీ, ఎలక్ట్రానిక్ ఉపకరణాల్నీ... చాలాచాలా ప్రేమించి ఉంటారు. ఒక్కసారి కృష్ణుడిని ప్రేమించి చూడండి. ఇక దేన్నీ ప్రేమించాల్సిన అవసరం రాదు. ఎవర్నీ ద్వేషించాల్సిన పరిస్థితి ఉండదు. అంతా కృష్ణమయం అవుతుంది, ప్రేమమయం అవుతుంది (ఆగస్టు 25న కృష్ణాష్టమి).

గోవిందుడు అందరివాడేలే...



ఆనందాల వెన్నముద్దలేమైపోయాయి? ఆత్మీయతల పాలకుండకు చిల్లులెలా పడ్డాయి? దారితప్పిన లేగదూడల్లా, సమూహాల్లోనూ ఒంటరితనాలెందుకు? కాళీయ సర్పం కాటేయడానికొస్తున్నట్టు, బతుకునిండా ఇన్నిన్ని భయాలేమిటి? మధురాధిపతే... అఖిలం విషాదం!

- ఆధునిక జీవితంలోని సర్వ సంక్షోభాలకూ కృష్ణతత్వమే సరైన జవాబు.

అలా అని, ఆ పరిష్కారమేం గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో కనిపించదు. అమెజాన్‌లోనో, ఫ్లిప్‌కార్ట్‌లోనో 'సేమ్ డే డెలివరీ'కి సిద్ధంగా ఉండదు. యశోదమ్మ సువ్వీసువ్వంటూ చల్ల చిలికి వెన్న తీసినట్టు, మనల్ని మనం మట్టికుండల్ని చేసుకుని... శ్రీభాగవతమనే కవ్వంతో అంతర్మథనం చేసుకోవాలి. అంతరంగాన్ని చిలికినకొద్దీ వెన్న, కాచినకొద్దీ మీగడ!


కృష్ణతత్వం ఓపట్టాన ఒంటబట్టదు. అర్థమై కానట్టు ఉంటుంది. పైపైకి ఆ లీలలన్నీ బాల్యచేష్టల్లా అనిపిస్తాయి. అదికాదు, భాగవతాన్ని చూడాల్సిన పద్ధతి. కృష్ణుడిని... యశోదలా ప్రేమించాలి, రాధలా అర్పించుకోవాలి. ద్రౌపదిలా విశ్వసించాలి. గోపబాలకుల్లా స్నేహం చేయాలి. అర్జునుడిలా అహాన్ని వదిలేసుకోవాలి. అప్పుడిక కృష్ణుడు... ఉట్టి కొట్టినా, వెన్న తిన్నా, పాము పడగనెక్కినా... ప్రతీకాత్మకంగానే అనిపిస్తుంది. ప్రతి లీలా ఓ ఉపనిషత్తు వాక్యంలా, గీతా శ్లోకంలా వినిపిస్తుంది. 'కృష్ణుడిని అర్థం చేసుకోనంత కాలం ఈ శరీరం ఓ చెరసాల. వ్యామోహాలు సంకెళ్లు. కామక్రోధాదులు శత్రువులు' అంటారు శుక మహర్షి. ఆ బంధనాల్ని తొలగించే తాళం చెవి... కృష్ణతత్వం!

ఆనందతత్వం!

రవివర్మ చిత్రాల నుంచి బాపు బొమ్మల వరకూ, ఉడుపీ క్షేత్రంలోని బాలకృష్ణుడి నుంచి ఇస్కాన్ ఆలయంలోని చైతన్య కృష్ణుడి వరకూ...ఏ చిత్రాన్ని చూసినా, ఏ శిల్పాన్ని పరికించినా - ఆ సమ్మోహన దరహాసమే. ఉట్టిమీది పాలమీగడలు దొంగిలిస్తున్నప్పుడూ, అంతెత్తు గోవర్ధనగిరిని అమాంతంగా ఎత్తిపట్టుకున్నప్పుడూ, కాళీయుడి తలల మీద తకధిమి తకధిమి నాట్యం చేస్తున్నప్పుడూ, కంస చాణూరాది రాక్షసుల్ని వరుసబెట్టి వధిస్తున్నప్పుడూ, రణక్షేత్రంలో భీతహరిణంలా వణికిపోతున్న అర్జునుడికి గీతాబోధ చేస్తున్నప్పుడూ... అసలెప్పుడూ కృష్ణుడి మొహం మీద చిరునవ్వు చెదరలేదు. వ్యాసమహర్షి శ్రీభాగవతంలో రుతువర్ణన చేస్తూ... 'కృష్ణమేఘం' అన్న మాట వాడారు. ఆ మేఘం వెంట వచ్చే మెరుపు కృష్ణయ్య చిరునవ్వేనట!

ఆనందానికి సంకేతమే చిరునవ్వు. మరి, ఆనందంగా ఎప్పుడుంటాం? 'కష్టనష్టాలు లేనప్పుడే...' అని బల్లగుద్ది మాత్రం చెప్పలేం. ఎందుకంటే... మనిషన్నాక కష్టం ఉంటుంది, నష్టాలూ వాటిల్లుతుంటాయి. వాటన్నిటినీ మనసులోకి తీసుకోకుండా, జీవితాన్ని ఓ ఆటలా ఆడేసుకుంటే ఏ బాధా ఉండదు. బాల్యలీలల ద్వారా కృష్ణయ్య మనకు బోధించింది ఇదే. కృష్ణతత్వ అంతస్సూత్రం కూడా ఇదే. పాపం పసివాడు, పుట్టీపుట్టకముందే పుట్టెడు కష్టాలొచ్చిపడ్డాయి! కఠినాత్ముడైన కంసమామ అమ్మానాన్నల్ని చెరసాలలో పెట్టాడు. తోబుట్టువుల్ని తెగనరికాడు. బకాసురుడు, శకటాసురుడు, తృణావర్తుడు, పూతనాది రాక్షస గణమంతా కట్టకట్టుకుని వచ్చి మరీ కడతేర్చడానికి సిద్ధపడింది. అయినా కృష్ణుడు బిత్తరపోలేదు, తత్తరపడలేదు. ఆట బొమ్మల్ని పుటుక్కున విరిచేసినట్టు, మహామహా రాక్షసుల్ని కూడా చటుక్కున చంపేశాడు. ఇదంతా ఓ జగన్నాటకమన్న ఎరుక ఉంటే... ఎదుటి మనుషుల స్వార్థ స్వభావాలూ, అహంకార ప్రసంగాలూ తోలుబొమ్మలాటలా నవ్వుపుట్టిస్తాయి. ఎవర్నీ ద్వేషించం. మహా అయితే ప్రేమిస్తాం.

మనలోని ఆనందం, మన చుట్టూ ఉన్న మనుషులకూ విస్తరిస్తుంది. పరిసర ప్రకృతిలోనూ ప్రతిధ్వనిస్తుంది. కాబట్టే, ఆనంద స్వరూపుడికి జన్మనిస్తున్న సమయంలో దేవకి ప్రసవ వేదనను భరించలేదు, ప్రసవానందాన్ని పొందింది. సువ్వీసువ్వీ సువ్వాలమ్మా... నవ్వుతు దేవకి నందను గనియె - అంటాడు సంకీర్తనాచార్యుడు. శ్రావణ బహుళాష్టమి అర్ధరాత్రి నాటికి ప్రకృతి మొత్తం పరమ ప్రశాంతంగా మారిపోయింది. రేపల్లెలోని ఆవులు పలుపుతాడు తెంచుకుని వచ్చి మరీ వీధుల్లో నాట్యం చేశాయి. ఆనంద కృష్ణుడు మనతో ఉన్నాడన్న భావన చాలు. ఇక బాధలుండవూ కష్టాలుండవూ. ఉన్నా అవి బాధల్లా కష్టాల్లా అనిపించవు. కృష్...ణ -



చేతవెన్న ముద్ద చెంగల్వపూదండ
బంగారు మొలతాడు పట్టుదట్టి
సందె తావీదులు సరిమువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణ నిన్ను చేరికొలుతు

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వు రా
జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దోచె నో
మల్లియలార! మీ పాదలమాటున లేడు గదమ్మ చెప్పరే!

అన్న రెండక్షరాల్లో సత్, చిత్ ఆనందాలు రెండూ దాగున్నాయంటారు విజ్ఞులు. కృష్ణుడిని పురాణాలు సచ్చిదానంద స్వరూపుడని కొనియాడాయి.

వసుదేవుడు చిమ్మచీకట్లో యమునను దాటొచ్చాడు. నందుడి ఇల్లాలి పక్కన పండంటి పసిబిడ్డను పడుకోబెట్టి మళ్లీ చెరసాలకు వెళ్లిపోయాడు. అంతలోనే తెల్లారిపోయింది. కృష్ణోదయ వార్త పల్లెకంతా పాకిపోయింది. పూల సజ్జెలతో, పండ్ల బుట్టలతో రేపల్లె వాసులంతా నందుడి ఇంటికి బయల్దేరారు. అమ్మ యశోదమ్మ ఆనందానికి హద్దేం ఉంటుంది. జగదేకపతిని తన కన్నబిడ్డే అనుకుంది. గంగాజనకుడికి లాలపోసి మురిసిపోయింది. పాలకడలిలో పవళించేవాడికి పాల బువ్వ తినిపించి పరమానందాన్ని అనుభవించింది. శేషతల్పశాయి ఆడుకోడానికెళ్తుంటే 'పాములుంటాయ్ కన్నా!' అంటూ సకల జాగ్రత్తలూ చెప్పింది. మహామహారాక్షసుల్ని సంహరించినవాడిని 'అదిగో బూచి!' అని భయపెట్టింది. నిరంతర నిర్నిద్రుడికి 'జోజో కమలదళేక్షణ, జోజో మృగరాజ మధ్య, జోజో కృష్ణా' అంటూ జోలపాడింది.

ఆనందతత్వమే కొలువైన చోట ఆనందానికి కొదవేం ఉంటుంది? నందవ్రజం ఆనంద వ్రజమైంది. ఆనందం ఉందంటే సకల ఐశ్వర్యాలూ, సర్వ సుఖాలూ ఉన్నట్టే. పశువులు సమృద్ధిగా పాలిస్తున్నాయి. గోపికలు కృష్ణ లీలలే తలుచుకుంటూ, కృష్ణగీతాలే పాడుకుంటూ ఉత్సాహంగా వెన్న తీస్తున్నారు. మధురానగరికి వెళ్లి పాలూపెరుగూ అమ్ముకుని వస్తున్నారు. చేతినిండా వరహాలు ఆడుతున్నాయి. ఇళ్లలో శుభకార్యాలు జరుగుతున్నాయి. మనసులు మహా ప్రశాంతంగా ఉంటున్నాయి. ఇన్ని మార్పులకూ మూలం... ఆనందమే, కృష్ణానందమే! అందుకే, సుధామాది భక్తులు...చిన్నికృష్ణుడిని చేరి కొలుస్తున్నప్పుడు, మణులో మాణిక్యాలో అడగలేదు. కృష్ణపాద కమలసేవను కోరుకున్నారు, కృష్ణప్రియులతో నేస్తాన్నీ, కృష్ణతత్వమైన భూతదయనూ దయచేయమన్నారు. ఈ మూడూ ఆనంద సోపానాలే. అహంకారి దుర్యోధనుడు మాత్రం పరమాత్మ కంటే పదివేల సైన్యమే ఎక్కువని భ్రమపడ్డాడు, చివరికి భంగపడ్డాడు. 'నువ్వుంటే చాలు బావా!' అంటూ కృష్ణుడి సాన్నిధ్యాన్ని కోరుకున్న అర్జునుడికి...యోగేశ్వరుడి సారధ్యంతో పాటూ విజయమూ వైభోగమూ మహదానందమూ దక్కాయి.


ప్రేమతత్వం!

ఓ ఉప్పు బొమ్మకు సముద్రం లోతులు చూడాలన్న కోరిక కలిగింది. ఆత్రుత కొద్దీ దూకేసింది. నీళ్లలోకి వెళ్లగానే తానెవరో మరచిపోయింది. తనెందుకొచ్చిందీ మరచిపోయింది. కరిగి కరిగి సముద్రంలో భాగమైపోయింది. కృష్ణ ప్రేమా అలాంటిదే. ఎవరు ఏ రూపంలో ఆయనకు తారసపడినా.... చివరికంతా కృష్ణప్రేమాంబుధిలో కలసిపోవాల్సిందే, కరిగిపోవాల్సిందే. కృష్ణ...అన్న మాటకు ఆకర్షించేవాడన్న అర్థమూ ఉంది. గోపికలు వలపు భావనతో దగ్గరయ్యారు. మహర్షులు తపస్సుతో దగ్గరయ్యారు. కంసాది రాక్షసులు శతృత్వంతో దగ్గరయ్యారు. పాండవులు భక్తితో దగ్గరయ్యారు. ఎవరిదారులు వారివే. గమ్యం మాత్రం ఒకటే - కృష్ణుడే.

పూతన రాక్షసి చిన్ని కృష్ణుడిని చంపడానికొచ్చింది. కంసుడే ఆ ఆడబూచిని పంపాడు. రవిక ఒదులు చేసుకుని, 'రారా కృష్ణా!' అని పిలవగానే బిరబిరా వెళ్లాడా బిడ్డడు. 'పాల కుండలనుకుని ఆబగా జుర్రుకుంటున్నాడు. కాలకూట భాండాలని తెలియదు కాబోలు' అనుకుంది పూతన. దేవతలకే అమృతాన్ని పంచి ఇచ్చినవాడికి, పచ్చి విషపు ఆలోచనలు తెలియకుండా ఉంటాయా? నవ్వుకుని ఉంటాడు! ఎంత రాకాసి అయినా అమ్మే కదా! చనుబాలిస్తూ రెప్పపాటు సమయం మాతృత్వ తన్మయత్వాన్ని అనుభవించింది. చాల్చాలు. ఆ కాస్త ప్రేమ చాలు. మహామహా యోగీంద్రులు యజ్ఞయాగాలు చేసి 'కృష్ణార్పణం' అన్నంత ఫలం ఆమె ఖాతాలో జమైపోయింది. కృష్ణప్రేమలోని గొప్పదనమే అది. పూతన ఒంట్లోని విషాన్నంతా సర్రున జుర్రుకున్నాడు. రాక్షసి అంటేనే నిలువెల్లా పాషాణం. కృష్ణయ్య చేదునంతా మింగేశాక... పూతనతోపాటే పూతనలోని రాక్షసత్వమూ చచ్చిపోయింది. శవాన్ని ఊరవతల తగులబెడుతుంటే, అద్భుత పరిమళాలు! కృష్ణ ప్రేమ తాలూకు సువాసనలవి.

మధురాధిపతే అఖిలం మధురం! కృష్ణుడు మధురకే కాదు, ప్రేమ మాధుర్యానికీ అధిపతి. పద్నాలుగేళ్ల పసివాడు...అన్న బలరాముడితో కలసి కంసమామ చేపట్టిన ధనుర్యాగానికి బయల్దేరాడు. రథం దిగి వీధుల్లో నడుస్తుంటే, మధురానగరమంతా 'అధరం మధురం, వదనం మధురం...' అంటూ కృష్ణ సౌందర్యాన్ని కీర్తించింది. ఓ నిరుపేద నేత కళాకారుడిచ్చిన బట్టల్ని ప్రేమగా అందుకున్నాడు. తానే వెళ్లి మాలలు కట్టుకుని బతికే సుధాముడి తలుపుతట్టాడు. కుబ్జ పూసిన మంచిగంధాలకు మురిసిపోయాడు. భక్తి, ముక్తి, అనురక్తి...ఎవరికి ఇవ్వాల్సింది వాళ్లకు ఇచ్చాడు. ఎవర్నుంచి అందుకోవాల్సిన ప్రేమను వాళ్ల నుంచి అందుకున్నాడు.

పరమ రాక్షసుడైన కంసుడు కూడా తనకు తెలియకుండానే కృష్ణప్రేమలో పడిపోయాడు. కృష్ణుడు మధురలో కాలుపెట్టాడని తెలిసిన మరుక్షణమే..భయంతో సగం చచ్చిపోయాడు. అడుగుల సవ్వడి వినిపిస్తే చాలు, కృష్ణుడొస్తున్నట్టు అనిపించేది. పూల సువాసనలు నాసికాన్ని తాకగానే...వైజయంతీమాల పరిమళమేమో అన్న భ్రమ కలిగేది. ఎవర్ని ఎవరు పిలిచినా, 'కృష్ణా' అన్నట్టు చెవినపడేంత చిత్త చాంచల్యం. బాలకృష్ణుడు రానేవచ్చాడు. ముద్దుగారే బాలుడు గుండెల మీద కూర్చుని పిడిగుద్దులు గుద్దుతుంటే, 'చంపొద్దు కృష్ణా.. వదిలిపెట్టు కృష్ణా...' అంటూ మృత్యుభయంతో మెలికలు తిరిగిపోయాడు. కలవరపాటులో అయితేనేం, తలుచుకున్నాడు కదా! ఆ కాస్త స్మరణకే పొంగిపోయి, మేనమామకు ముక్తినిచ్చేశాడు కృష్ణస్వామి.



నీ పాద కమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యము‌ను నితాం
తాపార భూతదయయును
తాపస మందార నాకు దయసేయగదే

ఓయమ్మ నీకుమారుడు
మా యిండ్లను పాలుపెరుగు మననీడమ్మా
పోయెదమెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ

చిక్కడు సిరి కౌగిటిలో
జిక్కడు సనకాదియోగి చిత్తాబ్జములం
జిక్కడు శ్రుతిలతికావలి
జిక్కెనతండు లీల దల్లి చేతన్ రోలన్



ఓసారి బ్రహ్మదేవుడికి కృష్ణుడిని పరీక్షించాలన్న బుద్ధిపుట్టింది. కృష్ణుడి చుట్టూ ఉన్న గోవుల్నీ గోపబాలకుల్నీ మాయం చేసేశాడు. కృష్ణుడు మనిషిగా జన్మించాడు కదా, మనిషి లానే ప్రవర్తిస్తాడని అనుకున్నాడు. 'నా గోవులు...నా గోపకులు' అని గగ్గోలు పెడతాడని భావించాడు. ఆ ఏడుపును ఎనిమిది కళ్లతో చూడాలన్నది బ్రహ్మ ఉబలాటం. ఆయన అనుకున్నట్టేం జరగలేదు. తానొక్కడే... రేపల్లెలోని ప్రతి ఇంటా గోపాలకుల్లా, గోవుల్లా, లేగదూడల్లా కనిపించి...కనికట్టు చేశాడు. బ్రహ్మయ్యకు దిమ్మదిరిగిపోయింది. 'పొట్టలోని పసిబిడ్డ కాళ్లతో తన్నేస్తున్నప్పుడు అమ్మ ఎంత మురిపెంగా క్షమించేస్తుందో, అలా నన్నూ మన్నించు తండ్రీ!' అంటూ కాళ్ల మీద పడ్డాడు బ్రహ్మదేవుడు. 'ఛీఛీ..మనమధ్య క్షమాపణలేమిటి?' అని ప్రేమగా అక్కున చేర్చుకున్నాడు కృష్ణబాబు.

చిటికెడు ప్రేమను కురిపిస్తే, గుప్పెడు వరాల్ని తిరిగిస్తాడు కన్నయ్య. 'ఫలాలో ఫలాలు...' అని అరుచుకుంటూ వీధుల్లో వెళ్తోందో పండ్ల అమ్మి! కృష్ణుడు చూశాడు. రారమ్మని పిలిచాడు. చిన్నికృష్ణుడి బేరమంటే మహా గొప్ప బోణీ కదా! సంతోషంగా బుట్ట దించింది. బిరబిరా లోనికెళ్లి...చిట్టి చేతులతో గాదెలోంచి పిడికెడు ధాన్యం తీసుకువచ్చి ఆమె కొంగులో పోశాడు. ఆశ్చర్యం...ఆ గింజలన్నీ రత్నరాశులై రాలిపడ్డాయి. మహద్భాగ్యమన్నట్టు మూటగట్టుకుని వెళ్లిందా మహిళ. అదీ కృష్ణతత్వంలోని ప్రేమతత్వం.

ఎవరు ఏ ఆలోచనతో దగ్గరవుతున్నారన్నది కృష్ణుడు పట్టించుకోడు. ఎదుటి మనుషుల్లోని లోపాలూ పాపాలూ అస్సలు గుర్తుంచుకోడు. తెలిసి ప్రేమించినా తెలియక ప్రేమించినా అది ప్రేమేనంటాడు. జీవితకాలం ప్రేమించినా క్షణకాలం ప్రేమించినా...అదీ ప్రేమేనని తేల్చి చెబుతాడు. నిజమే, తాను ముట్టుకుంది పరుసవేదిననే విషయం ఇనుప ముక్కకు తెలియాల్సిన పనేముంది! అంతటి అనురాగాన్ని సొంతం చేసుకుంటే...లోపాలూ అహాలూ స్వార్థాలతో సహా ఎదుటివారిని యథాతథంగా ప్రేమించగలిగితే - శత్రువులుండరు, ద్వేషాలుండవు. అంతా ప్రేమమయమే, అంతా కృష్ణమయమే!

స్నేహతత్వం...

స్నేహితుడంటే కృష్ణయ్యే! ఒక్కసారి కృష్ణ మిత్రమండలిలో చోటు సంపాదిస్తే జన్మ ధన్యమైనట్టే. కన్నయ్య కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. ఎప్పట్లానే ఓరోజు గోపాల బాలకులు మందల్ని మేపడానికి అడవులకెళ్లారు. ఓ మడుగులో భయంకర విషసర్పం నోరు తెరుచుకుని కనిపించింది. అదేం చిత్రమో, ఆ పిల్లలకు పాము నోట్లోకి వెళ్లాలన్న కోరిక పుట్టింది. తమకేమీ కాదన్న ధైర్యం. కృష్ణుడున్నాడన్న అభయం. పరుగుపరుగున వెళ్లి పడగలో తలపెట్టారు. అక్కడున్నది సర్పరూపంలోని అఘాసురుడని కృష్ణయ్యకు అర్థమైపోయింది. అయినా సరే, గోపాలకుల్ని కాపాడటం స్నేహధర్మమని భావించాడు. తనూ వెళ్లి పాము నోట్లో తలపెట్టాడు. లోపలికి వెళ్లగానే... ఇంతింతై ఆ సర్పాసురుడిని చీల్చేసి బయటికొచ్చాడు. స్నేహంలోని భరోసా ఎంత బలమైందో కృష్ణుడిలా చాటి చెప్పాడు. ఆ గొల్ల పిల్లలు కృష్ణుడిని చూడకుండా ఒక్క క్షణమైనా ఉండలేకపోయేవారు. అడవిలో చద్దులు తింటున్నప్పుడు కూడా గుండ్రంగానే కూర్చునేవారు. వృత్తాకారంలో కూర్చుంటేనే కదా కృష్ణుడు అందరికీ కనబడేది. మిత్రుడి ఎడబాటును ఆ కాసేపు కూడా భరించలేని, బలమైన అనుబంధమది.


జతగాడైన కుచేలుడిని ఆదుకున్న తీరూ అద్భుతమే! మొహమాట పడుతూ వచ్చిన నేస్తాన్ని నేరుగా తన సౌధానికి తీసుకెళ్లాడు. అడిగిమరీ అటుకుల మూట తీసుకున్నాడు. అడక్కపోయినా సకల సౌభాగ్యాలూ ప్రసాదించాడు. కృష్ణుడి దైవత్వం పూర్తిగా తెలియని రోజుల్లో అర్జునుడు, స్నేహితుడన్న చొరవతో 'వెన్నదొంగా!', 'గొల్ల గోపాలా!' అని ఆటపట్టించేవాడు. ఆతర్వాత, అలా ప్రవర్తించినందుకు పశ్చాత్తాపపడ్డాడు. క్షమించమని వేడుకున్నాడు. కృష్ణుడు చిరునవ్వుతో 'నీ తేరు తోలేవాడిని. అంత పెద్ద మాటలెందుకులే బావా!' అంటూ పెద్ద మనసుతో మన్నించాడు. కృష్ణుడిలాంటి నేస్తం ఒక్కడున్నా చాలు...కష్టాల పాము నోట్లో సుఖంగా తలపెట్టవచ్చు. పేదరికాన్ని కూడా ఐశ్వర్యంలా అనుభవించవచ్చు. జీవన కురుక్షేత్రంలో పార్థుడిలా పోరాడవచ్చు. కృష్ణతత్వాన్ని అర్థం చేసుకున్నవారి 'ఫ్రెండ్ రిక్వెస్ట్'ను కృష్ణయ్య తప్పక ఆమోదిస్తాడు.

ప్రకృతి తత్వం!

వాసనాత్ సర్వభూతానాం వసుత్వాత్ దేవయోనితః ... సమస్త ప్రాణుల్లోనూ నివాసం ఉండడం వల్లా, దేవతలు ఆయనలో కొలువుదీరడం వల్లా - వాసుదేవ అన్న పేరొచ్చిందని వ్యాసభారతం చెబుతోంది. మనిషి కోసం అవతరించిన దేవతలు చాలామందే ఉండవచ్చు. కానీ, కృష్ణుడు ప్రకృతి కోసమూ పుట్టాడు. ఆ మమకారం కొద్దే వైకుంఠాన్ని వదిలిపెట్టి పచ్చని పల్లెకు విచ్చేశాడు. రేపల్లె


నీవే తల్లివి దండ్రివి
నీవే నా తోడు నీడ! నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు! నిజముగ కృష్ణా!

అమ్మా మన్ను దినంగ నే శిశువునో యాకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మాటలు మదిన్ నన్నీవు గొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్య గం
ధ మ్మాఘ్రాణము చేసి నా వచనముల్ దప్పైన దండింపవే



పౌరసత్వం పుచ్చుకున్నాడు. ఆవుల్ని కాచాడు, లేగలతో ఆడుకున్నాడు. కొండలెక్కాడు, గుట్ట లెక్కాడు. ఆ వెన్నదొంగ మన్నుదొంగ కూడా! మట్టిని పరమాన్నంలా తినేస్తూ యశోదమ్మకు దొరికిపోయాడు. 'అమ్మా మన్నుదినంగనే శిశువునో ఆకొంటినో' అంటూ బుకాయించే ప్రయత్నమొకటి. అమ్మకు తెలియవా ఆ దొంగాటలు. నోరుతెరవమంది. ఆ... అనగానే అనంత ప్రకృతి!

ఓసారి కాళింది మడుగులోని నీళ్లు తాగి గోవులు చనిపోయాయి. కాళీయుడనే సర్పం ఆ జలాల్ని విషపూరితం చేసింది. 'నీళ్లంటే అమృతమే. పశువుల పొట్టలు నిండుతాయి. మనుషుల దప్పిక తీరుతుంది. చేపలూ కప్పలూ మడుగునే ఆశ్రయించి బతుకుతాయి. జలాన్ని కలుషితం చేయడం అంటే పంచమహా పాతకాలకు పాల్పడినట్టే' అంటాడు కృష్ణుడు. తనే, మడుగులోకి దూకి. ..శుద్ధి చేయడం మొదలుపెట్టాడు. వాసుకితో పాలసముద్రాన్ని మధించినట్టు కాళిందిని చిలికేశాడు. కాలుష్యపు జాడే లేకుండా శుభ్రం చేసేశాడు. పన్లోపనిగా కాళీయుడి అహాన్ని అణిచేశాడు. కృష్ణుడికి చెట్టూచేమలన్నా మనిషంత ఇష్టం. ఓసారి యశోదమ్మ బిడ్డ కాలు కదపకుండా రోకలికి కట్టేసింది. అల్లరి కృష్ణుడు గమ్మునుంటాడా, ఏకంగా రోటినే



లాక్కుంటూ వెళ్లి తరాలనాటి మద్దిచెట్లకు మోక్షమిచ్చాడు. వృక్షాల్లో అశ్వత్థ వృక్షాన్నని గీతలో ప్రకటించాడు కూడా. కొండలంటే కూడా కొండంత ప్రేమ. పల్లె జనమంతా ఇంద్రుడికి పూజలు చేసి నైవేద్యాలు పెడతామంటే, కృష్ణుడు వద్దేవద్దన్నాడు. 'ఎక్కడో ఉన్న ఇంద్రుడికెందుకు? మన కోసమే, మన పల్లె పక్కనే వెలసిన గోవర్ధనగిరికి పూజలు చేద్దాం పదండి! ఆ కొండ... గోవులకు గడ్డి ఇస్తుంది. పక్ష్యాదులకు నీడనిస్తుంది. మనకు పండ్లూ పూలూ ఇస్తుంది. ప్రాణాలు నిలిపే ఓషధుల్ని అందిస్తుంది. ఇంతకు మించిన వేలుపు ఇంకెక్కడ దొరుకుతుంది?' - అని చెప్పాడు. ఎదురేముంది, అంతా బయల్దేరారు. పూజలు చేశారు. దీంతో ఇంద్రుడికి కోపం వచ్చింది. కుంభవృష్టి కురిపించాడు. కృష్ణుడికి ఆ మాయలు తెలియవా? వేలితో కొండనెత్తి రేపల్లె జనానికంతా నీడనిచ్చాడు. అంతలోనే ఇంద్రుడు తప్పు తెలుసుకుని క్షమాపణ కోరాడు. గోవులకూ గోపాలకులకూ గోపికలకూ అధిపతిగా కృష్ణుడికి గోవింద పట్టాభిషేకం జరిపించాడు. మేని ఛాయ, మెడలోని చెంగల్వపూదండ, తలమీది పింఛం, మొలతాడుకు కట్టుకున్న కొమ్ముబూర... అన్నీ ప్రకృతి ప్రేమకు చిహ్నాలే. కృష్ణుడిని ప్రేమించడమంటే ప్రకృతినీ ప్రేమించడమే. కాదంటే, కన్నయ్య మెచ్చడు.

నాయకత్వం...

భాగవత బాలుడు... అమాయకుడు, సున్నిత స్వభావుడు, గోపీజనవల్లభుడు. అదే కృష్ణుడు మహాభారత ఘట్టానికి వచ్చేసరికి... రాజకీయవేత్త, మేధావి, వ్యూహకర్త, దార్శనికుడు. కృష్ణుడేం చక్రవర్తి కాదు. ఓ చిన్న రాజ్యానికి నాయకుడు. అయితేనేం, మహామహా చక్రవర్తులు సైతం కృష్ణుడికి పాదాభివందనాలు చేసేవారు. ఆ గౌరవం అధికారంతో సొంతం కాలేదు, మేధస్సుతో వచ్చింది. ఎక్కడ నెగ్గాలన్నదే కాదు, ఎక్కడ తగ్గాలో కూడా అతడికి తెలుసు. కాలయవనుడనే రాక్షసుడు అక్షౌహిణుల కొద్దీ సైన్యంతో యుద్ధానికొచ్చినా... కృష్ణుడు నిరాయుధుడై ఎదురు నిలబడ్డాడు. యవనుడు తరుముకొస్తుంటే... పరిగెత్తుకెళ్లాడు. కొండలు దాటి, కోనలు దాటి పాడుబడిన గుహలోకెళ్లాడు. 'పిరికి కృష్ణుడు...' అని ఎగతాళి చేసుకుంటూ గుహలో కాలుపెట్టాడా రాక్షసుడు. చిమ్మచీకట్లో... గాఢనిద్రలో ఉన్న వృద్ధుడిని చూసి కృష్ణుడేనని భ్రమించాడు. తట్టిలేపి ఆ తాపసి ఆగ్రహానికి గురై... బూడిదైపోయాడు. ఆ నేత్రాగ్ని ముచికుంద మహర్షిది. అదీ కృష్ణుడి వ్యూహరచనా నైపుణ్యం.

కృష్ణుడు మంచిని కోరుకున్నాడు. మంచి వైపు నిలబడ్డాడు. పాండవ పక్షపాత అంతరార్థమూ అదే! పాండురాజు మరణం తర్వాత.... ధృతరాష్ట్రుడి కొలువులో వివక్షకు గురవుతున్న మేనత్త పిల్లలకు ఉద్ధవుడి ద్వారా 'నేనున్నా...' అని సందేశం పంపాడు. అప్పటి నుంచి మహాప్రస్థానం దాకా - పాండవులకు కృష్ణుడే బంధువూ సఖుడూ గురువూ... సర్వస్వమూ! అంతిమంగా ధర్మం గెలవాలంటే, ముందు నుంచీ ధర్మబద్ధుల్ని కాపాడుకోవాలి. అందుకే, 'అన్నా...' అని పిలవగానే, పరుగుపరుగున వెళ్లి ద్రౌపదికి వస్త్రాలిచ్చాడు. 'బావా... యుద్ధం చేయలేను' అని అర్జునుడు విల్లంబులు జారవిడవగానే కర్తవ్యోపదేశం చేశాడు. కురుక్షేత్ర సంగ్రామం దాకా శిశుపాలుడూ జరాసంధుడూ బతికుంటే... పాండవుల విజయావకాశాలు దెబ్బతింటాయని ముందే ఊహించి ఆ ఇద్దరి అడ్డూ తొలగించాడు. దీని ద్వారా కౌరవులకూ ఓ పరోక్ష సంకేతం పంపాడు. కర్ణుడి బలాన్ని పరిమితం చేసి అర్జునుడిని శక్తిమంతుడిని చేశాడు. దుర్యోధనుడి బలహీనతను చెరవేసి భీముడికి మనోబలాన్నిచ్చాడు. భీష్ముడిని నిరోధించడానికి శిఖండిని రంగంలోకి దించాడు. ద్రోణుడిని నిలువరించడానికి ధర్మరాజుకో ధర్మ సూక్ష్మం బోధించాడు. అంతిమంగా పాండవులు గెలిచారు. ధర్మసంస్థాపన జరిగింది. కృష్ణుడి లక్ష్యం నెరవేరింది. మానవ జాతికి ఓ మహత్తర సందేశం అందింది -

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచ దుష్కృతాం...
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే!

అప్పుడే, ఓ యుగం గడిచిపోయింది.
మళ్లీ, ఎప్పుడు పుడతావు కృష్ణా!

‘స్వచ్ఛ’ చిత్రానికి పది లక్షలు!

లఘు చిత్రాలు ఈ మధ్య చాలా పెద్ద ట్రెండ్‌నే సృష్టిస్తున్నాయి. సూటిగా సుత్తిలేకుండా సృజనాత్మకతతో వీటిని తీస్తున్నారు దర్శకులు. గంటల నిడివిలో చెప్పే విషయాన్ని కొన్ని నిమిషాల్లోనే ఆకట్టుకునేలా చెప్పడం షార్ట్ ఫిల్మ్స్ ప్రత్యేకత. ఈ విషయాన్ని గమనించిన మోదీ ప్రభుత్వం ‘స్వచ్ఛ భారత్’ కార్యక్రమం కథాంశంతో లఘు చిత్రాల పోటీ పెట్టి లక్షల రూపాయల్ని బహుమతిగా ప్రకటించింది!



‘లైట్స్ కెమెరా యాక్షన్... నేను కాదు ఈ సినిమా తీస్తున్నది, మీరే! అవును, స్వచ్ఛ భారత్‌పైన సందేశాత్మకంగా ఉండే ఓ షార్ట్ ఫిల్మ్ తీయండి! డిజిటల్, మొబైల్... ఏ కెమెరాతో అయినా ఫర్వాలేదు. మీరు తీసిన ఆ ఫిల్మ్ చూశాక దేశమంతా స్వచ్ఛతవైపు కదలాలి. అంతేకాదు, మీ సినిమాల్లో నటించడానికి అవకాశమివ్వమని నాలాంటి నటులు మిమ్మల్ని బతిమాలాలి. మరెందుకు ఆలస్యం, కథ ఆలోచించండి’... ఈ మాటలు చెబుతున్నది ఎవరో కాదు స్వచ్ఛ భారత్ ప్రచారకర్తగా ఉన్న అమితాబ్ బచ్చన్. స్వచ్ఛ భారత్... కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కీలకమైన కార్యక్రమాల్లో ఒకటి. 2014 అక్టోబరు 2న ప్రారంభించినప్పట్నుంచి స్వచ్ఛ భారత్ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంలా నడుస్తోంది. ఆ ఉద్యమ స్ఫూర్తి ప్రతి గడపకీ, ప్రతి వ్యక్తికీ చేరేలా ప్రభుత్వం వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తోంది. ఇప్పటికే స్వచ్ఛ భారత్ మొబైల్ ఆప్‌ని తీసుకొచ్చింది. ప్రత్యేక వెబ్‌సైట్‌నీ ప్రారంభించింది. వీటికితోడు స్వచ్ఛ భారత్ ప్రచారకర్తల్నీ నియమించింది. ఈ కార్యక్రమాన్ని మరింతగా జనాల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో తాజాగా ‘స్వచ్ఛ భారత్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్’ పేరుతో లఘు చిత్రాల పోటీని నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి రెండేళ్లవుతున్న సందర్భంగా ఈ పోటీని ‘నేషనల్ ఫిల్మ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (nfdcindia.com) ఆధ్వర్యంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. అక్టోబరు రెండో తేదీన దిల్లీలోని సిరి ఫోర్ట్ ఆడిటోరియంలో ఈ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి.

3 నిమిషాలు... 10 లక్షలు

స్వచ్ఛ భారత్ పోటీకి పంపే లఘు చిత్రాల నిడివి మూడు నిమిషాలకు మించి ఉండకూడదు. వీటిని హెచ్‌డీ ఫార్మాట్‌లోనే తీయాలి. పోటీలో పాల్గొనే వ్యక్తులకు ఎలాంటి నియమ నిబంధనలూ లేవు. చిత్రాల్ని పంపేందుకు ఎలాంటి రుసుమూ లేదు. ఈ చిత్రాన్ని ఇంగ్లిష్‌లో లేదంటే భారతీయ అధికార భాషలుగా గుర్తించిన ఏ భాషలోనైనా చిత్రీకరించవచ్చు. ఇతర భాషల్లో తీసేవాటికి ఇంగ్లిష్‌లో సబ్‌టైటిల్స్ ఉండాలి. పోటీకి పంపే చిత్రాన్ని 2015 అక్టోబరు 1తర్వాతే చిత్రీకరించి ఉండాలి. లఘు చిత్రాలను ఆన్‌లైన్లో (sbsff@nfdcindia.comకు) పంపడంతోపాటు డీవీడీ లేదా యూఎస్‌బీ డ్రైవ్ రూపంలో నిర్వాహక సంస్థకు పోస్టు చేయాలి. సెప్టెంబరు 10లోగా వీటిని పంపించాలి. పిల్లల్ని స్వచ్ఛ భారత్‌లో భాగం చేయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశం. కాబట్టి వారిని ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని అన్ని వయసులవారినీ ఉద్దేశించి ఉండేలా చిత్రాన్ని తీయాలి. బాగున్నాయనుకుంటే ఈ చిత్రాలను స్వచ్ఛ భారత్ ప్రచారం కోసం ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది. పోటీకి వచ్చిన చిత్రాలకు ఉత్తమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో మొత్తం పది బహుమతులు ఇస్తారు. ఉత్తమ చిత్రానికి రూ.10 లక్షల నగదు బహుమతి ఉంటుంది. ద్వితీయ చిత్రాలుగా మూడింటిని ఎంపిక చేస్తారు. ఈ విభాగంలో ఎంపికైన ఒక్కో చిత్రానికి రూ.5లక్షలు నగదు బహుమతి ఉంటుంది. తృతీయ విభాగంలో ఆరు చిత్రాలను ఎంపిక చేస్తారు. ఈ విభాగంలో ఎంపికైన చిత్రాల్లో ఒక్కో దానికి రూ.2లక్షల నగదు బహుమతి ఉంటుంది.



ఈ చిత్రం చూశారా!

మూడు నిమిషాల్లో దేశాన్ని కదిలించగలిగే లఘు చిత్రమా! అని నిరుత్సాహపడొద్దు... ఇటీవల ‘డోంట్ లెట్ హర్ గో’ పేరుతో స్వచ్ఛ భారత్ నేపథ్యంతో ఒక లఘు చిత్రం వచ్చింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన ఈ లఘు చిత్రం నిడివి ఎంతో తెలుసా? ఒకటిన్నర నిమిషాల లోపే. కానీ సోషల్ మీడియాలో ఈ చిత్రం ఎన్నో ప్రశంసల్ని అందుకుంది. రిలీజైన మూడు రోజుల్లోనే యూట్యూబ్‌లో పదిలక్షలకుపైగా వీక్షణల్ని పొందిందీ చిత్రం. స్వచ్ఛత, శుభ్రత ఉన్నచోటే లక్ష్మీదేవి ఉంటుందన్నది ఈ లఘు చిత్ర కథాంశం. సామాజిక స్పృహ ఉండే లఘు చిత్రాలను తీసే అనీల్ మురార్కా ఈ సినిమాని తీశాడు. పండగ పూట మన ఇంటినీ, ఇంట్లోని వస్తువుల్నీ ఎంత బాగా శుభ్రం చేసుకుంటామో, మన పరిసరాల్నీ అంతే శుభ్రంగా చేయాలి లేకుంటే లక్ష్మీదేవి మన దగ్గర నుంచి వెళ్లిపోతుందని ఈ చిత్రంలో చక్కగా చూపించారు. దీన్లో లక్ష్మీదేవిగా కంగనా నటించింది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ‘కాలా ఘోడా’ సంస్థ ‘స్వచ్ఛ భారత్’ నేపథ్యంలో 2015లో లఘు చిత్రాల పోటీ పెట్టింది కూడా! అంటే ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రజల్లోకి వెళ్లింది. దాన్ని మరింత లోతుగా తీసుకువెళ్లాలి. మరెందుకు ఆలస్యం... కథ రాయండి, కెమెరా పట్టండి, ప్రధానితో శభాష్ అనిపించుకోండి!

ఆ లోటు ఎప్పటికీ తీరదు!

'యువత'... నిఖిల్‌ని హీరోగా నిలబెట్టింది. 'సోలో'... నారా రోహిత్ కెరీర్‌ని మలుపు తిప్పింది. 'ఆంజనేయులు'... రవితేజ ఖాతాలో మరో విజయాన్ని జమచేసింది. 'శ్రీరస్తు శుభమస్తు'... అల్లు శిరీష్‌కి తొలి సూపర్‌హిట్‌ని అందించింది. ఈ సినిమాలన్నింటినీ తీసిన దర్శకుడు పరశురామ్‌కి అనుబంధాలను తెరపైన ఆవిష్కరించడంలో మంచి పట్టుందన్న పేరుంది. తన జీవితంలో తెగిపోయిన బంధాలూ, ఎదురైన పరిణామాలే సినిమాల్లో కుటుంబ విలువలకు ప్రాధాన్యమివ్వడానికి కారణమంటారాయన. అంతలా ఆయన్ని కదిలించిన సంఘటనలు ఏంటంటే...



చిన్నప్పుడంతా ఆకతాయిగా తిరిగే నేను ఎంబీయే పూర్తి చేయడానికి మా అమ్మ మాటలే ప్రేరణ. చదువైపోయాక విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకున్న నేను సినిమాల్లోకి రావడానికి అమ్మ మరణానంతర పరిస్థితులే కారణం. ఎదిగే ప్రతి దశలో అంతలా తను నాపైన ముద్ర వేసింది. నేను పుట్టింది విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంకి దగ్గర్లోని బాపిరాజు కొత్తపల్లి అనే ఊళ్లో అయినా, పెరిగింది మాత్రం చెర్లోపాలెంలో. దర్శకుడు పూరీ జగన్నాథ్, నేనూ అన్నదమ్ముల పిల్లలం. మా నాన్న కో-ఆపరేటివ్ బ్యాంకులో చిన్న ఉద్యోగి. అమ్మకి చదువంటే చాలా ఇష్టం. నన్నూ, అక్కనే కాకుండా తన ఐదుగురు అక్కచెల్లెళ్ల పిల్లలనూ అమ్మే చదివించేది. మాకున్న పౌల్ట్రీ ఫామ్ వ్యవహారాలనూ తనే చూసుకునేది. అల్లరి విషయంలో అమ్మ నన్ను కొట్టని రోజంటూ ఉండేది కాదు. సరిగ్గా చదవకుండానే మంచి మార్కులొస్తున్నప్పుడు, బాగా చదివితే ఇంకా ముందుకెళ్తావు కదా అని అంటుండేది. ఇప్పటికీ మా ఊరికి బస్సులేదు. అలాంటి ప్రాంతం నుంచి వచ్చినా నేనూ, అక్కా, కజిన్స్ అంతా పీజీలు చేశామంటే కారణం అమ్మ వేసిన పునాదులే.

చాలా ఏళ్లు హాస్టల్లోనే

నేను రెండో తరగతి వరకూ చెర్లోపాలెంలో, తరవాత పెదబొడ్డేపల్లిలో ఆరో తరగతిదాకా చదివా. ఆ పైన జవహర్ నవోదయా స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షలో సెలక్ట్ అవడంతో వైజాగ్‌లో హాస్టల్‌కి వెళ్లా. తొమ్మిదో తరగతిలో ఉన్నపుడు ఏదో ఫంక్షన్‌కి ఊరికి వెళ్లినప్పుడు కజిన్స్ అందరం దగ్గర్లోని నేలబావిలో ఈత కొట్టడానికి దిగాం. అలా ఆడుకుంటున్నపుడే ఓ కొబ్బరిమట్ట వచ్చి బావి మధ్యలో వేలాడింది. దాన్ని పట్టుకోవాలని నేనూ మరో పిల్లాడూ పోటీపెట్టుకున్నాం. నాకు ఈత పూర్తిగా రాకపోవడంతో కొబ్బరిమట్టను అందుకునేలోపే మునిగిపోవడం మొదలుపెట్టా. నేను చనిపోవడం ఖాయమని తెలుస్తూ ఉంది. ఒక్కసారిగా అమ్మానాన్నా అక్కా అందరూ గుర్తొచ్చి ఏడుపు తన్నుకొచ్చింది. చివరి నిమిషంలో చిన్నాన్న కొడుకు ఎలాగోలా బయటకి లాగాడు. వెంటనే అమ్మ దగ్గరికి వెళ్లి విషయం చెప్పకుండా చాలాసేపు ఏడ్చేశా. అమ్మకి చెబితే ఎలా స్పందిస్తుందోనని భయమేసి తరవాత కూడా తనకా సంగతి చెప్పలేదు. అలా రోజులు గడుస్తున్న సమయంలో ఓ ఊహించని ఘటన నా జీవితాన్ని కుదిపేసింది.

అమ్మ దూరమైంది!

ఓసారి మా పౌల్ట్రీ ఫామ్‌కి వైరస్ సోకి కోళ్లన్నీ చనిపోయాయి. పెట్టుబడి మొత్తం పోయింది. అప్పటివరకూ అక్కా నేనూ ప్రభుత్వ స్కూళ్లలోనే చదివాం. సరిగ్గా డబ్బు పెట్టి పైచదువులు చదివించాలని అమ్మ ఆశపడ్డ సమయానికి అలా జరిగింది. దాంతో అమ్మ కాస్త డీలా పడింది. నేను ఆంధ్రా యూనివర్సిటీలో ఎంబీయే చదివేప్పుడు ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో పార్ట్‌టైం పని చేసేవాణ్ని. అలా రోజులు గడుస్తుండగా ఓసారి అమ్మకు ఒంట్లో బాలేదని ఫోన్ వస్తే వెళ్లా. డాక్టర్లు హిమోగ్లోబిన్ తక్కువగా ఉందన్నారు. స్నేహితులతో కలిసి రక్తం ఇచ్చి వచ్చా. ఓ పదిరోజుల తరవాత మళ్లీ అమ్మకు నీరసంగా ఉందంటే వెళ్లా. పరీక్షలు చేయిస్తే ఎక్యూట్ బ్లడ్ క్యాన్సరని తేలింది. రెండు మూడు నెలలకు మించి బతకడం కష్టమన్నారు. ఆ మాట వినగానే కాళ్ల కింద భూమి కంపించినట్లయింది. ఏకంగా చనిపోయేంత జబ్బు ఎందుకొచ్చిందో అర్థం కాలేదు. అక్కకు తెలిస్తే తనేదైనా చేసుకుంటుందేమోనన్న భయంతో చెప్పలేదు. నాన్న దగ్గరా ఓ పదిరోజులు దాచిపెట్టా. నటుడు జోగినాయుడు మా పెద్దమ్మ కొడుకు. తన భార్య ఝాన్సీ సాయంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. జబ్బు బయటపడిన ఆర్నెల్లకు అమ్మ చనిపోయింది. నాకే కష్టం వచ్చినా అమ్మ ఉందిగా అనే ధైర్యం ఆ క్షణం దూరమైపోయింది.

అన్నయ్యని చూశాకే...

అమ్మ చనిపోయిన ఏడాదిలోపే ఉన్న కొద్దిపాటి భూముల్ని అమ్మేసి అక్క పెళ్లి చేశాం. తరవాత నాన్న తెలీని నైరాశ్యంలోకి జారిపోయారు. అలానే గడిపితే నేనూ డిప్రెషన్‌లోకి వెళ్తానేమోనని భయమేసి ఏదైనా ఉద్యోగం వెతుక్కుందామని హైదరాబాద్ వచ్చా. అప్పుడే 'ఇడియట్' సినిమా విడుదలైంది. ఊళ్లో ఉన్నప్పుడు జగనన్నయ్య దర్శకుడు అని తెలుసుకానీ, అతడి స్థాయేంటో ఇక్కడికొచ్చాకే అర్థమైంది. నా కళ్లముందు తిరిగిన వ్యక్తి కష్టపడి ఈ స్థాయికొచ్చినప్పుడు నేనెందుకు రాలేనూ అనిపించింది. అన్నయ్యని చూశాక ఆ రంగంలోకి వెళ్లాలన్న కోరిక పెరిగింది. ఓరోజు జోగి నాయుడు పిలిచి 'నువ్వు ఒకప్పుడు సినిమాలు చూసి మా అందరికీ కళ్లకు కట్టినట్టు కథ చెప్పేవాడివి. తరవాత మేమెళ్లి సినిమా చూసినా అంత ఫీల్ వచ్చేది కాదు. ఇక్కడున్న ఎవరికీ నువ్వు తీసిపోవు. నువ్వు పెదనాన్న కాళ్లే పట్టుకుంటావో, ఏం చేస్తావో నీ ఇష్టం కానీ జగన్ దగ్గర అసిస్టెంట్‌గా చేరడమే నీ లక్ష్యంగా పెట్టుకో' అన్నాడు. సినిమాల్లోకి రావాలనుందని జగన్నయ్యకి చెబితే బాగా తిట్టాడు. 'ఎంబీఏ చేశావు, అప్పట్లో విదేశాలకూ వెళ్లాలనుకున్నావు కదా. నేను పంపిస్తా వెళ్లు' అన్నాడు. కానీ నేను మాత్రం అన్నయ్య దగ్గరే చేరతానని కరాఖండీగా చెప్పడంతో కోపంతో కొన్నాళ్లు నాతో మాట్లాడటం మానేశాడు.

అలా ఉండగానే పెళ్లి...

ఓసారి 'అమ్మానాన్నా ఓ తమిళమ్మాయి' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతుంటే నాన్నను తీసుకొని వెళ్లి అడిగించా. నాన్న మాట కాదన లేక అన్నయ్య నన్ను అసిస్టెంట్‌గా చేరమన్నాడు. ఆ తరవాత 'ఆంధ్రావాలా', '143' సినిమాలకూ పనిచేశా. ఎక్కువ కాలం అన్నయ్య దగ్గరే పనిచేస్తే నా సామర్థ్యమేంటో నాకు తెలీదనిపించి వేరే ఎవరి దగ్గరైనా పనిచేస్తానని చెప్పి బయటికొచ్చేశా. తెలిసిన వాళ్ల సాయంతో దర్శకుడు దశరథ్ దగ్గర 'శ్రీ' సినిమాకి అసిస్టెంట్‌గా చేరా. అక్కడే దర్శకుడు చైతన్య దంతులూరి పరిచయమయ్యాడు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా చైతూ దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నా. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడే మా కజిన్ ద్వారా అర్చన అనే అమ్మాయి పరిచయమైంది. ఎందుకో తెలీదు కానీ క్రమంగా తనంటే ఇష్టం పెరిగింది. నేనప్పటికి కాళ్లకు హవాయి చెప్పులే వేసుకుని తిరిగేవాణ్ణి. అలాంటి సమయంలో ప్రేమా పెళ్లి గురించి ఆలోచించడం కరక్టేనా అనిపించేది. కానీ ఆమెకూ నేను నచ్చడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. వాళ్లది చాలా పెద్ద కుటుంబం. నా పరిస్థితేమో అంతంతమాత్రం. దాంతో మా పెళ్లికి వాళ్లింట్లో అంగీకరించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పెద్దలు ఒప్పుకోకుండానే అర్చనా నేనూ ఒక్కటయ్యాం.

అవకాశం వచ్చినట్టే వచ్చి...

దశరథ్ దగ్గర పనిచేసేప్పుడు ఆ ప్రాజెక్టు ఆలస్యం కావడంతో చైతూ సాయంతో వీరూ పోట్ల దగ్గర అసిస్టెంట్‌గా చేరా. వీరూ రాసిచ్చిన కథలూ, డైలాగులన్నీ నేను ఫెయిర్ చేసేవాణ్ణి. అలా తనవల్లే రచన, డైలాగుల పైనా క్రమంగా అవగాహన పెరిగింది. దురదృష్టం కొద్దీ వీరూ ప్రాజెక్టు కూడా ముందుకెళ్లలేదు. 'పరుగు' సినిమాకి స్క్రిప్ట్ డిస్కషన్ కోసం ఎవరైనా కావాలని భాస్కర్ వెతుకుతున్న సమయంలో చైతూ ఆ విషయం చెప్పి అతణ్ణి కలవమన్నాడు. అలా 'పరుగు'కి అడిషనల్ డైలాగ్ రైటర్‌గా, స్క్రిప్ట్ అసిస్టెంట్‌గా పనిచేశా. కథకు కొంత అదనపు వినోదాన్ని జోడించా. నా పనితీరు దిల్ రాజుగారికి నచ్చడంతో నేను చేరిన వారంలోపే మంచి కథ తయారు చేసుకుంటే సినిమా చేద్దామన్నారాయన. 'పరుగు' పూర్తయ్యాక సొంతంగా ఓ స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నా. అల్లు అర్జున్ కథల్ని బన్నీ వాసు వింటాడని తెలీడంతో అతనికే చెప్పా. వాసుకి కథ నచ్చింది కానీ బన్నీ పరిధికి చిన్నదవుతుందని అన్నాడు. తరవాత 'ఆంధ్రావాలా' నిర్మాత గిరిని కలిస్తే ఆ సినిమా చేద్దామన్నారు. కానీ ఏవో ఇబ్బందుల వల్ల అదీ ఆలస్యమైంది.

తొలిసినిమాతో పైపైకి...

సినిమా అలా వెనక్కెళ్తున్న సమయంలో 'మంత్ర' సినిమా తీసిన నిర్మాతలు ముందుకు రావడం, చందూ మొండేటి ద్వారా నిఖిల్ పరిచయమవడంతో నా తొలిసినిమా 'యువత' మొదలైంది. మా కష్టానికి మణిశర్మగారి సంగీతం తోడై సినిమా మంచి మ్యూజికల్ హిట్ అయింది. ఆ సినిమాకు అసిస్టెంట్లుగా పనిచేసిన చందూ, సుధీర్ వర్మ, కృష్ణ చైతన్యలు తరవాత దర్శకులుగా మారారు. నిఖిల్ సోలో హీరోగా నిలదొక్కుకున్నాడు. రాజారవీంద్ర ఓసారి రవితేజకు ఫోన్ చేసి 'యువత' సినిమా బావుందీ, చూడమని చెప్పాడు. రవికి కూడా అది నచ్చడంతో కలిసి సినిమా చేద్దామన్నారు. అలా మా ఇద్దరి కలయికలో 'ఆంజనేయులు' సినిమా విడుదలైంది. నిర్మాతలకు టేబుల్ ప్రాఫిట్‌నీ, దర్శకత్వంతో పాటు డైలాగ్ రైటర్‌గా నాకు మంచి పేరునీ ఆ సినిమా తీసుకొచ్చింది.



సోదరుడు జగన్‌తో...

బన్నీ చెప్పిన మాట!

నా భార్య సినిమాల గురించి పెద్దగా ప్రస్తావించకపోయినా, డబుల్ మీనింగ్ డైలాగులేవీ లేకుండా కుటుంబ విలువలుండే మంచి సినిమాలు చేయమని తొలిసారి నాకు సూచించింది. దాన్ని దృష్టిలో పెట్టుకునే 'సోలో' కథ సిద్ధం చేసుకున్నా. నారా రోహిత్ కెరీర్లో పెద్ద విజయం సాధించిన సినిమా అది. తరవాత రవితేజతో 'సారొచ్చారు' సినిమా తీశా. విడుదలకు నాల్రోజుల ముందే కాపీ చూడగానే అది ఫ్లాపవుతుందని నాకు అర్థమైంది. ఆ వైఫల్యం నుంచి బయటికొచ్చి నాగచైతన్యకు ఓ కథ వినిపించా. తను సినిమా చేద్దామన్నా ఏవో కారణాల వల్ల అది ముందుకెళ్లలేదు. దర్శకుడు క్రిష్ నాకు మంచి స్నేహితుడు. ఆ కథను అతనికీ వినిపించా. అతనే బన్నీకి నా కథ గురించి చెప్పడంతో, బన్నీవాసు పిలిచి కథ చెప్పమన్నాడు. అక్కడా ఓకే కావడంతో ఆ కథపైన దృష్టి పెట్టా. ఈలోగా ఓ రోజు అరవింద్‌గారు పిలిచి 'బన్నీ ఇప్పటికే రెండు సినిమాలు చేస్తున్నాడు. అవి పూర్తయ్యేవరకూ ఎదురు చూడటం కరెక్టు కాదు. శిరీష్‌కి ఏ కథలూ పెద్దగా నచ్చట్లేదు. పోనీ ఎవరితో సినిమా చేస్తావని అడిగితే నీ పేరు చెప్పాడు. శిరీష్‌కి 'సోలో' బాగా నచ్చిందట. సినిమా చేస్తావా మరి?' అని అడిగారు. ఓరోజు బన్నీ పిలిచి ఓ చెక్కు చేతిలో పెట్టి, 'నీ మీద నమ్మకంతో ఉన్నాం, ఏం చేస్తావో తెలీదు' అనడంతో నా బాధ్యత మరింత పెరిగింది. 'శ్రీరస్తు శుభమస్తు' విడుదలవుతూనే హిట్‌టాక్ తెచ్చుకుంది. అరవింద్‌గారు పిలిచి 'మరో కథ సిద్ధం చేసుకో, సినిమా మొదలు పెడదాం' అన్నారు. ఆ మాట చాలు ఆయన నమ్మకం నిలబెట్టుకున్నా అనడానికి. నా తరవాతి సినిమా గీతా ఆర్ట్స్‌లోనే ఉంటుంది.

చిన్నప్పుడోసారి నా కజిన్‌కి టెన్త్‌లో జిల్లా ఫస్ట్ వచ్చిందని పేపర్లో ఫొటో వేశారు. అమ్మ నాకది చూపించి, 'ఇలా పిల్లల ఫొటోలు పేపర్లో చూసుకునే తల్లిదండ్రులది ఎంత అదృష్టమో తెలుసా' అంది. సినిమాల్లోకి వచ్చాక నా ఫొటో చాలాసార్లు పత్రికల్లో వచ్చింది. వాటిని చూసినప్పుడల్లా అమ్మే గుర్తుకొస్తుంది. అందుకే నేను ఏ స్థాయికెళ్లినా అమ్మ లేని ఆ లోటు మాత్రం ఎప్పటికీ తీరదు. ★

సైన్సంటే ఇష్టం!

నాకు ఎలాంటి ఆధారం లేని సమయంలోనే నా భార్య అర్చన తోడుగా నిలిచింది. ఏదో ఒకరోజు నేను మంచి స్థానానికి వెళ్తానని నాకంటే బలంగా తనే నమ్మింది. అమ్మ స్థానాన్ని తను భర్తీ చేయక పోయుంటే నా జీవితం ఎటెళ్లేదా అనిపిస్తుంటుంది. మాకిద్దరు పిల్లలు. పెద్దబ్బాయి రిషిత్. చిన్నోడు అవ్యాన్.

★ దర్శకులు చైతన్య దంతులూరి, ఆనంద్ రంగా, క్రిష్, ఎడిటర్ మార్తాండ్‌లు నాకు మంచి స్నేహితులు. నేను సినిమాలు చేయని సందర్భాల్లోనూ ఎప్పటికప్పుడు ఫోన్ చేసి నా బాగోగులూ, ప్రాజెక్టుల గురించి ఆరా తీస్తుంటారు.

★ సైన్స్‌కి సంబంధించిన కొత్త పరిశోధనల గురించి తెలుసుకోవడం అంటే నాకు ఆసక్తి. మా అమ్మ ఆస్పత్రిలో ఉన్నప్పుడు బ్లడ్ క్యాన్సర్‌కి మందులేమన్నా ఉన్నాయా అన్న ఆశతో లైబ్రరీలకు వెళ్లి పత్రికలు తిరగేసేవాణ్ణి. అప్పట్నుంచీ అలా పరిశోధనల గురించి తెలుసుకోవడం అలవాటైంది.





తొక్కే వాడిదే రిక్షా!

16 సంవత్సరాల పాటు ఒకే రిక్షాకు రోజూ అద్దె కడుతూ... కేవలం ఆరున్నర వేల రూపాయల విలువ చేసే ఆ రిక్షాను సొంతం చేసుకోలేక పోయిన ఓ రిక్షా తొక్కేవ్యక్తి జీవితం ఆయన్ను కదిలించింది. ఇలాంటి శ్రమజీవులకు కనీసం రిక్షాను సొంతం చేయలేమా అన్న ఆలోచన... వేల మంది ఇప్పుడు సొంత రిక్షాలను గర్వంగా నడిపించుకునే దిశగా అడుగులేయించింది. ఆ స్ఫూర్తిదాయక కథనమే ఇది!

మన దగ్గర తక్కువకానీ దిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్, అసోం, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో రిక్షా కార్మికులు చాలా ఎక్కువ. ఒకానొక సందర్భంలో అసోం రాజధాని గువాహటిలోని ఓ రిక్షా కార్మికుడిని కలిశాడు పశువైద్యుడైన ప్రదీప్ కుమార్ శర్మ. అతని కథ విన్న ప్రదీప్ రిక్షా కార్మికులకు సొంత రిక్షాలు ఏర్పాటు చేసేలా ఎంతో కష్టపడి రిక్షా బ్యాంకును స్థాపించాడు. దాని విజయం ఫలితంగా ఇప్పటికి 15 వేల మందికిపైగా కార్మికులకు సొంత రిక్షా కల నెలవేరింది. ఆ విజయం మరి కొన్ని రాష్ట్రాలకూ పాకింది. తన విజయగాథను వినిపించేందుకు హార్వర్డ్, మసాచుసెట్స్ లాంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ఆహ్వానాలు పంపేలా చేసింది.

తొలి ప్రయాణం...

డాక్టర్ ప్రదీప్ కుమార్ శర్మ... ప్రభుత్వ ఆసుపత్రిలో పశువైద్య శస్త్రచికిత్సా నిపుణుడు. తరువాత పశువైద్యశాల అందుబాటులోలేని ఓ ప్రాంతంలో సేవలందించడం కోసం సొంతంగా ఓ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అక్కడ చాలా మందిని జంతువులకు వైద్యం అందించడంలో స్వచ్ఛంద సేవకులుగా మార్చాడు. 2001లో ఓ రోజు ఆయన ఇంటికి వెళ్లేందుకు సదుపాయాలేం లేకపోవడంతో ఓ రిక్షా మాట్లాడుకున్నారు. ఆ క్రమంలోనే ఆ రిక్షావాలాతో మాటలు కలిపారు. అప్పుడే తెలిసింది, ఆ రిక్షా అతని సొంతం కాదని. కానీ 16 సంవత్సరాలుగా రిక్షా తొక్కే అతను జీవిస్తున్నాడనీ, రోజుకు రిక్షా అద్దె 25 రూపాయలు పోగా మిగిలే 50 రూపాయలతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాడనీ. అతని మాటలు శర్మను ఆలోచింపజేశాయి. ఇంత శ్రమపడే రిక్షా కార్మికులు సొంత కాళ్లమీద నిలబడలేకపోతున్నారు. ఎలాగైనా వీళ్ల జీవితాల్లో మార్పు వస్తే బాగుండు అనుకున్నాడు. ఇలా ఇతనొక్కడేనా లేక చాలా మంది ఉన్నారా అని తెలుసుకునేందుకు గువాహటిలోని 300 మంది రిక్షా కార్మికులతో సర్వే నిర్వహించాడు. ఆశ్చర్యంగా వారిలో 90 శాతం మందికిపైగా సొంత రిక్షాలు లేవు. రిక్షా అద్దె కట్టడం మిగిలిన డబ్బుతో తినడం... అవీ చాలక ఎప్పటికీ అప్పుల్లోనే జీవిస్తున్నారు వాళ్లు. వీళ్లకెలాగైనా సొంత రిక్షాలు ఇప్పించ గలిగితే కొంత కాలానికైనా జీవితాల్లో మార్పు వస్తుందనుకున్నాడు. అందుకే చాలా బ్యాంకులకు తిరిగాడు. ఎన్నో అభ్యర్థనలు పెట్టుకున్నాడు. ప్రయోజనం లేదు.

వదల్లేదు...

రిక్షా తొక్కే వాళ్లను చూసినప్పుడు శర్మ గమనించిన మరో విషయం బండి బరువు ఎక్కువగా ఉండటం, తొక్కేవాళ్లు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రిక్షా తొక్కడం. అంటే రిక్షాను రీమోడల్ చేయాలి అనుకున్నాడు. గువాహటి ఐఐటీలోని తన మిత్రులతో ఈ విషయాన్ని పంచుకున్నాడు. ఆయన చెప్పిన రెండు అంశాలనూ కలుపుతూ ఓ కొత్త డిజైన్‌ను రూపొందించి ఇచ్చారు మిత్రులు. ఈ రిక్షాలో ప్రయాణికుల్ని కప్పి ఉంచే పట్టాలాంటి భాగం ముందు రిక్షా తొక్కే వ్యక్తి వరకూ ఉంటుంది. ఈ డిజైన్‌ను చేతిలో పట్టుకుని హిందుస్థాన్ లీవర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ సంస్థలకు తిరిగాడు. తమ రిక్షాల తయారీకి డబ్బులిస్తే ఈ రిక్షాల మీద మూడు సంవత్సరాల పాటు ఆయా సంస్థల ప్రకటనలు ఇస్తామని చెప్పాడు. అలా ఒక్కో సంస్థ నుంచీ ఏడు లక్షల రూపాయల నిధిని సేకరించాడు. మొత్తం 21 లక్షలు పోగుచేసి రిక్షాబ్యాంకును స్థాపించాడు. అయితే ఈ కొత్త రిక్షాను తయారు చేసేందుకు ఏ సంస్థలూ ముందుకు రాలేదు. దాంతో తన మిత్రులైన ఐఐటీ విద్యార్థులతో పాటూ మరికొందరు యువతను పోగేసి వాళ్లకు శిక్షణ ఇచ్చాడు. ఎంసీ పైపులతో తయారయ్యే ఈ రిక్షాలు మునుపటి వాటికన్నా దృఢంగానూ తక్కువ బరువుతోనూ ఉంటాయి. అలా తయారు చేసిన రిక్షాలను రిక్షాబ్యాంకు ద్వారా కార్మికులకు అందజేశాడు. తీసుకొన్న మొదటిరోజే వాటిని సొంత రిక్షాలుగా కార్మికులు నడుపుకోవచ్చు. ఎప్పుడూ అద్దె చెల్లించినట్టే రోజుకు రూ.25 ఈ బ్యాంకుకు చెల్లించాలి. అలా ఏడాదీ, ఏడాదిన్నర కాలం చెల్లిస్తే ఇక ఆ బండి వాళ్ల సొంతమవుతుంది. మొట్టమొదట 2004లో ఇలా తయారు చేసిన 80 రిక్షాలు రోడ్డెక్కాయి. వాళ్లకు లైసెన్సులు ఇప్పించే బాధ్యతా, ఇన్సూరెన్సు బాధ్యతనూ ప్రదీపే చూసుకున్నాడు. రోజూ వచ్చే డబ్బులను మళ్లీ కొత్త రిక్షాల తయారీకి వాడతారు. ఈ పద్ధతిలో ఇప్పటి వరకూ 15 వేలమందికిపైగా రిక్షాలను సొంతం చేసుకున్నారు. అప్పుల ఊబి నుంచీ బయట పడ్డారు.

ఇప్పుడు వారణాసి, అలహాబాద్, లఖ్‌నవూ లాంటి చోట్లా స్థానికులతో కలిసి ఇలాంటి బ్యాంకును నడుపుతున్నారు. దీంతో పాటూ సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(సీఆర్‌డీ) పేరిట మరో సంస్థను స్థాపించారు ప్రదీప్. దీని ద్వారా అసోం, జార్ఖండ్, రాజస్థాన్‌లలో వెజిటబుల్‌కార్ట్, ఫాస్ట్‌ఫుడ్‌కార్ట్, మోమో కార్టులాంటివి ప్రవేశపెట్టి కూరగాయలూ, చిరుతిళ్ల వ్యాపారులకు ఇదే తరహాలో సాయపడుతున్నారు. దుర్గాపూర్ ఇంజినీరింగ్ కాలేజీ వాళ్లు సీఆర్‌డీ కోసం సోలార్ రిక్షానూ తయారుచేసిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన ఇ-రిక్షాను రోడ్డు మీదకు తెచ్చేందుకు ఏర్పడిన కమిటీలోనూ ప్రదీప్ కీలక సభ్యుడు. సమస్యకు స్పందించడమే కాదు అది తీరేవరకూ ప్రతి కష్టాన్నీ దాటుతూ పోరాడే ఇలాంటి వాళ్లే నిజమైన నాయకులు కదూ!





ఇవి కారు చేసిన రాళ్లు!



రకరకాల రాళ్లు మనకు తెలుసు! కానీ భూగర్భంలో ఏర్పడని రాయీ... హరివిల్లులోని వర్ణాలన్నీ పులుముకున్న రాయీ... రకరకాల నగలకు కొత్త సొంపునిచ్చే రాయి గురించి మీరు విన్నారా. ఏమిటో ఆ రాయి అంటారా... దానిపేరే ఫోర్డైట్.

పచ్చలూ కెంపులూ వజ్రాల్లాంటి విలువైన రాళ్లు మొదలు మార్బుల్స్, నాపరాళ్ల దాకా అన్నీ నేలలోనే దొరుకుతాయి. భూమి ఏర్పడటంలో భాగంగానో, భూకంపాలూ అగ్నిపర్వతాల విస్ఫోటనాల్లాంటి ఉపద్రవాల వల్లో ఇవి ఏర్పడతాయి. కానీ భూ చరిత్రలో భాగంగా కాకుండా మానవ చరిత్రలో భాగంగా ఏర్పడ్డ ప్రత్యేక రాయి ఫోర్డైట్. కార్లకు మనుషులే రంగులు వేసే కాలంలో, కింద పడిపోయిన ఎన్నో వర్ణాలు కలగలిసి ఏర్పడ్డ ఈ రాళ్లు నగలూ, కీ చెయిన్ల తయారీలో తమవైన ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

ఆరోజుల్లో...

ఆటోమొబైల్ రంగం అంతగా సాంకేతికతను అందిపుచ్చుకోని సమయంలో మనుషులే స్ప్రింక్లర్ల సాయంతో ఎనామిల్ రంగులను కార్లకు అద్దేవారు. కార్లన్నింటినీ ఓ వరుసలో పెట్టి వాటికి ఈ రంగులేసి వాటిని వేడి వాతావరణంలో ఆరబెట్టేవారు. ఇలాంటప్పుడు కార్లను ముందుకు జరిపేందుకు వాటి కింద కదిలే బెల్టును ఉంచేవారు. రంగులు వేసేప్పుడు కింద ఒలికిపోయిన పెయింటంతా పొరలా తయారయ్యేది... అలా రకరకాల రంగులు ఒకదానిమీద ఒకటి పడీ, ఒకదానితో మరొకటి కలిసీ చిత్రవర్ణాలు ఏర్పడేవి. తయారీలో భాగంగా కార్లతో పాటూ ఈ రంగులూ వేడి ఉష్ణోగ్రతల్లో ఏళ్ల తరబడి ఉండటం వల్ల అచ్చం రాయిలా గట్టిపడిపోయాయి. ఇక, ఆ స్థలాన్ని శుభ్రం చేయడంలో భాగంగా కింది పొరలను తొలగించేందుకు ప్రయత్నించిన సిబ్బంది... ఇలా ఏర్పడ్డ రాయిని చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అవి విభిన్నరంగుల్లో డిజైన్లతో ఉండటమే కాదు అచ్చం రాయిలాగే కోసి మెరుగుపెట్టడానికి అనువుగా ఉన్నాయి. మొదట వాటిని తలాకొన్నీ ఇళ్లకు తీసుకెళ్లారు. తరువాత అవి నగల దుకాణాలకు చేరాయి. ఫోర్డ్ సంస్థకు సంబంధించిన గ్యారేజీల నుంచి ముందుగా కనుగొనడం వల్ల దీన్ని ఫోర్డైట్ అనీ, ఇవి అమెరికాలోని కార్ల తయారీ పరిశ్రమలుండే డెట్రాయిట్ ప్రాంతంలో తయారవడంతో పాటూ దీనిలోని ప్యాట్రన్లు ఎగేట్ రాయిని పోలి ఉండటం వల్ల దీన్ని డెట్రాయిట్ ఎగేట్ అనీ... మోటార్ పరిశ్రమల ఉత్పత్తి కనుక మోటార్ ఎగేట్ అనీ పిలుస్తారు.

రకరకాల రంగులు కలిసి పోవడం వల్ల ఉన్న రంగులతో పాటూ కొత్త రంగులూ ఈ రాళ్లలో ఆవిష్కారమయ్యాయి. వాటిని కోసి, చక్కగా మెరుగుపెట్టి దానిమీద మరో గ్లాస్‌కోట్ వేసి లాకెట్లూ, చెవి దుద్దులూ, లోలాకులూ, ఉంగరాలూ, బ్రేస్‌లెట్లూ, కీచెయిన్లతోపాటు అలంకరణ రాళ్లు గానూ తయారు చేశారు కళాకారులు. దీంతో నగల ఖాన్‌దాన్‌లో మరో కొత్తరాయి వచ్చి చేరినట్లయింది. ఎంతో అందంగానూ ఉండటంతో పెట్టుకునేవాళ్లూ ఎక్కువయ్యారు. ఇంతకీ కార్లకు ఇప్పుడు యంత్రాలే అత్యాధునిక పద్ధతుల్లో రంగులద్దుతుండటంతో కొత్తగా ఈ రాళ్లు ఏర్పడట్లేదు. అయితే ఈ తరహా వస్తువులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా కొన్ని జ్యువెలరీ తయారీ సంస్థల్లాంటివి, పాత పద్ధతుల్లోనే... రకరకాల రంగులను కలిపి, వేడి ఛాంబర్లలో ఉంచి తమ అవసరాలకు తగ్గ రాళ్లను తయారు చేసుకుంటున్నాయి. కానీ వీటికన్నా, ఆ కాలంలో ఏర్పడ్డ అసలైన రాళ్లకు మాత్రం ధర ఎక్కువ. ఆన్‌లైన్‌లో వివిధ సంస్థలు ఎన్నో డిజైన్లలో వీటిని అమ్ముతున్నాయి. మొత్తానికి ఫోర్డైట్... మనిషి తయారు చేసిన రాయి... మరి మనం పెట్టుకోకపోతే ఎలా?!



కొత్తగా...







ఒక్కటే రెండు రంగుల్లో

నెయిల్ ఆర్ట్... అమ్మాయిల ఫ్యాషన్లలో చెరగని ముద్ర వేసిన ట్రెండ్. అందుకే, ఏళ్లు గడుస్తున్నా దానికున్న డిమాండ్ తగ్గడంలేదు. అందులోభాగంగానే ఇప్పుడు ఒక గోళ్లరంగుని వేసుకుంటే రెండు మూడు షేడ్‌లు కనిపించేలా 'కలర్ షిఫ్టింగ్ మల్టీక్రోమ్' నెయిల్ పాలిష్‌లు వస్తున్నాయి. ఈ రంగుల్ని వేసుకుంటే ఒకే గోరు మీద రెండు రకాల గోళ్లరంగును కళాత్మకంగా వేసినట్లే కనిపిస్తుంది. అంతేకాదు, కాంతి పడినపుడు ఇది ప్రకాశవంతంగా మెరవడంతోపాటు, రంగుల్లోని తేడా మరింత బాగా కనిపిస్తుంది. అదీ సంగతి... ఇవుంటే నెయిల్ ఆర్ట్ అవసరం లేకుండానే గోళ్లను అందంగా ముస్తాబు చెయ్యొచ్చు. ఒర్లీ, పాలిష్ మీ సిల్లీ పేర్లతో వస్తున్న వీటిని ఎట్సీ.కామ్‌లో ఆర్డరిచ్చి తెప్పించుకోవచ్చు.



కళ్లజోడుతో వినొచ్చు

చెవిలో ఇయర్ ఫోన్లు పెట్టుకునే పాటలు వినాలా... బ్లూటూత్ పెట్టుకునే ఫోన్ మాట్లాడాలా... కళ్లజోడుతోనే ఆ రెండు పనులూ చెయ్యకూడదా... ఇలాంటి ఆలోచనతో రూపొందిందే 'జంగిల్ పాంథర్' కళ్లజోడు. చెవికి తాకే దీని ఫ్రేములో బోన్ కండక్షన్ స్పీకర్లుంటాయి. ఇవి చెవి ఎముకల్ని తాకేలా ఉంటాయి కాబట్టి, ఫ్రేములో అమర్చిన బ్లూటూత్‌ద్వారా వచ్చే పాటలూ మాటలూ మనకు ఇయర్‌ఫోన్లోలానే వినిపిస్తాయి. ఛార్జింగ్ పెట్టుకునే వీలున్న ఈ కళ్లజోడుకి పక్కభాగంలో ఉండే బటన్ ద్వారా బ్లూటూత్‌ని ఆన్, ఆఫ్ చెయ్యొచ్చు, సౌండ్‌ని తగ్గించి, పెంచుకోవచ్చు. చూశారుగా, ఈ సన్‌గ్లాసెస్ ఉంటే ఇయర్ ఫోన్లు పెట్టుకోవాల్సిన పనీ ఉండదు, వాటి ద్వారా చెవికి కలిగే హాని నుంచి కూడా తప్పించుకోవచ్చు. ఐడియా అదిరింది కదూ!













సింకు పిల్లలక్కూడా

అదేంటో ఎవరింట్లోనూ పిల్లలుండనట్లూ సింకులన్నీ ఎత్తుగానే ఉంటాయి. పిల్లలు చెయ్యి కడుక్కోవాలంటే ఎత్తుపీట వేసుకోవాలి, లేదంటే అమ్మ ఎత్తుకోవాలి. ఇకమీదట, ఈ ఇబ్బంది ఉండదులెండి. స్విట్జర్‌ల్యాండ్‌కు చెందిన విట్రా కంపెనీ రూపొందించిన ఈ 'ఫ్యామిలీ బేసిన్'లో ఒకే సింకుకి వేరువేరు ఎత్తుల్లో రెండు బేసిన్లు ఉంటాయి. పెద్దలకూ పిల్లలక్కూడా సౌకర్యంగా ఉండే దీన్లో కిందున్న బేసిన్ పెడిక్యూర్ లాంటివి చేసుకునేందుకూ పనికొస్తుంది. బాగుంది కదూ!





కుండీల్ని అతికించేద్దాం







మొక్కలు పెంచాలనే ఆసక్తి ఉన్నా అందరికీ కుండీలు పెట్టుకునేంత స్థలం ఇంట్లో ఉండకపోవచ్చు. ఒకవేళ ఏ కొద్దిచోటో ఉన్నా అక్కడ ఎండ పడకపోవచ్చు. అలాంటివారికోసం ప్రత్యేకంగా రూపొందినవే ఈ 'లివి', 'ఈడెన్' సక్షన్ ప్లాంటర్లు. ఈ కుండీల వెనుకభాగంలో ఉండే రబ్బరు నిర్మాణం సహాయంతో వీటిని నునుపుగా ఉండే అద్దాలూ టైల్సూ గోడల్లాంటివాటికి సులభంగా అంటించేయొచ్చు. ఇంకేముందీ, స్థలం లేదన్న సమస్యా ఉండదు, ఎండ ఎక్కడ వస్తే అక్కడే కుండీల్ని పెట్టుకోవచ్చు. అయితే, మాటిమాటికీ అంటించిన కుండీని తీసే పనిలేకుండా అందులో పట్టే మరో చిన్న కుండీలో మొక్కను పెట్టుకుంటే మంచిది. దీనివల్ల నీరు ఎక్కువైనా కింది కుండీలోకి కారే వీలుంటుంది. ఇలాంటివి ఉంటే అలంకరణ మొక్కలే కాదు, వంటగదిలో కూడా ఎండపడే చోట కొత్తిమీర పుదీనాలాంటివాటిని ఎంచక్కా పెంచుకోవచ్చు. ఏమంటారు..?

కనులకూ 'విందు'

రెండు మూడు రకాల పచ్చళ్లతో చిన్న చిన్న జాడీలను డైనింగ్ టేబుల్ మీద పెడుతుంటాం. అయితే, ఆ జాడీలే డైనింగ్ టేబుల్‌కి అలంకరణగా మారితే చూడ్డానికీ బాగుంటుంది కదా... గిఫ్ట్ ప్యాక్, కుక్కపిల్ల, కోడిపుంజు, బర్గర్‌లతో పాటు ఇంకా ఎన్నో ఆకారాల్లో చూడముచ్చటగా వస్తున్న ఈ జాడీలు అలాంటివే. ప్లాస్టిక్‌లిడ్‌లు ఉండే వీటి మూతలు గాలిని చొరబడనివ్వవు. కాబట్టి, ఈ జాడీల్లో పిల్లలకోసం తయారుచేసిన పిండి వంటకాలూ బిస్కెట్లలాంటివాటినీ పెట్టొచ్చు. దాంతో వాళ్లు కూడా ఇష్టంగా తింటారు. 'యూనిక్ కుకీజార్స్' పేరుతో ఆన్‌లైన్ షాపుల్లో వెతికి వీటిని తెప్పించుకోవచ్చు. ఇంకెందుకాలస్యం, వీటితో డైనింగ్ టేబుల్‌నీ వంటగదినీ అలంకరించి అతిథులను ఆకట్టుకోండి మరి.



ఈ లైట్ల రూటే వేరు

స్విచ్ వేస్తే లైటు వెలగడం సాధారణమే. కానీ ఇక్కడున్న లైట్లకు ఓ ప్రత్యేకత ఉంది. చెయ్యిలా ఉన్న 'లైట్ మీ అప్' లైటు వేలును మన వేలుతో ముట్టుకుంటే వెలుగుతుంది. మళ్లీ ముట్టుకుంటే ఆరిపోతుంది. కొవ్వొత్తిలా ఉండే 'బ్లో ఆన్ ఆఫ్ ఎల్ఈడీ లైటు'ను దీపాన్ని ఊదినట్లూ ఊదితే ఆన్, ఆఫ్ అవుతుంది. జెల్లీలా ఉన్న 'జెల్లీ పుడ్డింగ్' ల్యాంపును కూడా పైభాగంలో నొక్కి లైటుని వెయ్యొచ్చు, తియ్యొచ్చు. బ్యాటరీలతోనూ కరెంటుతోనూ పనిచేసే ఈ బెడ్ లైట్లను బహుమతులుగా కూడా ఇవ్వొచ్చు. పిల్లలక్కూడా ఇవి బాగా నచ్చుతాయని ప్రత్యేకంగా చెప్పేదేముందీ..!

మెషీనే మడతపెట్టేస్తుంది

'ఉతికిన బట్టల్ని చిటికెలో ఇస్త్రీ చేసి, మడతలు పెట్టే మెషీన్ వస్తే ఎంత బాగుంటుందో...' అని మనలో చాలామందికి చాలాసార్లు అనిపించే ఉంటుంది. అవును, అదేం చిన్నపని కాదు మరి. ఏం పర్లేదులెండి, త్వరలోనే మన కల నెరవేరబోతోంది. ఈ 'ఫోల్డిమేట్' మెషీన్ నిజంగా అలాంటిదే మరి. చిన్న సైజు కూలర్‌లా ఉండే దీనికి ముందుభాగంలో షర్టులూ కుర్తీల్లాంటి వాటిని తగిలిస్తే మెషీన్ వాటిని లోపలికి తీసుకుని స్టీమ్ ఐరన్ ద్వారా ముడతలు పోగొట్టి, చక్కగా మడతపెట్టి బయటకు పంపిస్తుంది. అంతేకాదు, వాటికి పెర్ఫ్యూమ్‌ని కూడా స్ప్రే చేస్తుంది. ఇలా ఒకేసారి ఇరవై దుస్తుల్ని మెషీన్‌కు తగిలించొచ్చు. మనం వేరే పని చేసేసుకోవచ్చు. భలే ఐడియా కదూ... ఇది 2017లో మార్కెట్లోకి వస్తుందట. కావాలంటే ఫోల్డిమేట్.కామ్‌లోకి వెళ్లి ముందుగానే ఆర్డరివ్వొచ్చు. ధర సుమారు రూ.47వేలు.





కొన్ని రెస్టారెంట్లలో ఐస్‌క్రీమ్ తిన్నా పాప్‌కార్న్ రుచి చూసినా చాట్ చప్పరించినా... నోట్లో నుంచీ ముక్కులో నుంచీ పొగలొచ్చేస్తున్నాయట. దానికి తెగ ఆశ్చర్యపడుతున్న జనం ఆ గమ్మత్తైన అనుభవం కోసం మళ్లీ మళ్లీ ఆ రెస్టారెంట్లకు వెళుతున్నారట. మరి ఆ పొగల వెనుక ఉన్న రహస్యమేంటో మీకు తెలుసా!





పొగలుకక్కే ఐస్‌క్రీమ్, పాప్‌కార్న్!




లిక్విడ్ నైట్రోజన్... ఆహార పదార్థాల తయారీలో దీని వాడకం ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడో ట్రెండ్. అతి శీతల ఉష్ణోగ్రతలు ఉన్న ఈ ద్రవంతో చిటికెలో ఐస్‌క్రీం తయారైపోతుంది, క్షణంలో చాక్లెట్ గట్టిపడిపోతుంది, సెకన్లలో జ్యూస్ చల్లబడిపోతుంది. దీన్ని ఉపయోగించి చేసిన పదార్థాన్ని తయారైన వెంటనే నోట్లో వేసుకున్నామంటే నోట్లో నుంచీ ముక్కు నుంచీ వచ్చే పొగలు తినేవారినే కాదు చూసేవారినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి.

అమ్మో ఎంత చల్లనో...

నైట్రోజన్ బాష్పీభవన స్థానం -196 డిగ్రీల సెల్సియస్. ఈ ఉష్ణోగ్రత వద్ద ద్రవరూపంలో ఉండే నైట్రోజన్‌ని లిక్విడ్ నైట్రోజన్ అని పిలుస్తారు. ప్రపంచంలోనే అత్యంత చల్లని పదార్థాల్లో ఇది ఒకటి. నైట్రోజన్ వాయువును ఒత్తిడికి గురిచేసి చల్లబరచడం ద్వారా దీన్ని తయారుచేస్తారు. సాధారణంగా ప్రయోగశాలల్లోనూ, క్యాన్సర్ కణాలూ, కొన్ని చర్మసంబంధిత చికిత్సల్లాంటి వాటికే పరిమితమైన ఈ లిక్విడ్‌నైట్రోజన్‌ను ఇటీవల ఆహారపదార్థాల తయారీలోనూ ఉపయోగిస్తున్నారు. నిజానికి 1890ల్లోనే ఆగ్నెస్ మార్షల్ రాసిన ఫ్యాన్సీ ఐసెస్ అనే వంటల పుస్తకంలో ఐస్‌క్రీమ్ తయారీలో లిక్విడ్‌నైట్రోజన్ ప్రస్తావన కనిపిస్తుంది. అయితే అదంత ప్రాచుర్యంలోకి రాలేదు. ప్రఖ్యాత షెఫ్ హెస్టన్ బ్లుమెంథల్ ఇంగ్లండ్‌లోని బెర్క్‌షెయిర్లో నెలకొల్పిన తన ఫ్యాట్‌డక్ రెస్టరెంట్‌లో లిక్విడ్ నైట్రోజన్‌తో చేసే స్క్రాంబుల్డ్ ఎగ్ అండ్ బేకాన్ ఐస్‌క్రీమ్‌తోపాటూ కొన్ని రకాల పానీయాలకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. ప్లేట్లో పొగలు చిమ్ముతూ కనిపించే ఈ పదార్థాలు నోటికీ రుచిగా ఉండటంతో ఫ్యాట్‌డక్ పేరు ఇంగ్లండంతా మారుమోగిపోయింది. అతి శీతల ద్రావణమైన ఈ లిక్విడ్ నైట్రోజన్‌ను ఐస్‌క్రీమ్ మిక్స్‌లో పోసి కలపగానే క్షణాల్లో ఐస్‌క్రీం తయారైపోతుంది. అదే పాప్‌కార్న్‌లో ఈ ద్రవాన్ని పోస్తే ఫ్రిజ్‌లో పెట్టిన మంచ్ చాక్లెట్‌లా కరకలాడతాయి. ఇక వీటిని నోట్లో వేసుకుంటే పొగలు పొగలే.

ఫ్యాట్‌డక్ క్లిక్ అవడంతో ప్రపంచంలోని అనేక పెద్ద రెస్టారెంట్లూ, కేఫ్‌లూ లిక్విడ్ నైట్రోజన్‌తో తమ ప్రయోగాలను మొదలుపెట్టాయి. పాప్‌కార్న్, పాప్‌సికల్స్, మాష్‌మెలోస్, చిప్స్, ట్వింకీస్, ఛాట్, సలాడ్, జ్యూసులూ, కాక్‌టెయిల్స్... ఇలా రకరకాల ఆహార పదార్థాలకు ఈ చల్లని ద్రవాన్ని కలిపి వచ్చిన వారికి వింతైన విందును అందిస్తున్నారు. ఈ మధ్యే లాస్ ఏంజెలెస్‌లోని ఓ రెస్టారెంట్ సెరెల్‌బాల్స్‌కు లిక్విడ్ నైట్రోజన్‌ను కలిపి చేసిన ఐస్‌క్రీమ్‌ను 'ద డ్రాగన్‌బ్రీత్' పేరిట అమ్మడం మొదలుపెట్టింది. ఈ ఐస్‌క్రీమ్‌ను నోట్లో వేసుకొని ముక్కుతో గట్టిగా గాలి వదిలితే తెల్లని పొగలు బయటికి వస్తాయన్న మాట! ఇక ప్రఖ్యాత చాక్లెట్ల సంస్థ కిట్‌క్యాట్ త్వరలో 'బిలో ఫ్రీజింగ్ చాకొలేటరీ' పేరిట జపాన్‌లోని దైకన్యామాలో ఓ బొటిక్‌ను తెరవబోతోంది. అందులో -196 డిగ్రీ సెంటీగ్రేడ్ వద్ద కిట్‌క్యాట్ మరింత రుచిగా కరకరలాడుతూ ఉండబోతోందట. అయితే ఈ తరహా పదార్థాల తయారీ, వడ్డన అంతా పూర్తి నిపుణత కలిగిన వారి ద్వారానే జరుగుతోంది. నెట్లోనూ లిక్విడ్ నైట్రోజన్‌తో చేసే రకరకాల రెసిపీలు అందుబాటులో ఉన్నాయి. లిక్విడ్ నైట్రోజన్‌ను ఏ పదార్థంతో ఎంత సేపు కలపాలీ, తయారు చేసిన ఎంతసేపటి తరువాత తినొచ్చూ లాంటివి చాలా ముఖ్యం కనుక ఇలాంటి వాటిని ఇంటి దగ్గర ప్రయత్నించకపోవడమే మంచిది. అధిక మోతాదులో ద్రవ రూప నైట్రోజన్ శరీరానికి తగిలినా, లోపలికి వెళ్లినా ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఇంకొన్నాళ్లలోనే మన కేఫ్‌లూ ఈ తరహా వంటలను అందుబాటులోకి తెస్తాయి లెండి... అప్పుడు మనమూ పొగలూదేయొచ్చు... ఏమంటారు?!







రోడ్డు మీద నడుస్తుంటే నిండిపోయిన చెత్తకుండీ కనిపిస్తుంది... ముక్కు మూసుకొని ముందుకెళ్లిపోతాం. వీధి చివర అక్రమ నిర్మాణమేదో వెలుస్తూ దర్శనమిస్తుంది... చూసీ చూడనట్టు దాటేస్తాం. రాత్రి పని ముగించుకొని ఇంటికెళ్తుంటే ఒక్క వీధి దీపమూ పనిచేయదు... సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో అడుగులేస్తాం. కానీ ఐసీఆర్ఎఫ్ సంస్థ అలా నిర్లిప్తంగా మనకెందుకులే అని చూస్తూ ఊరుకోదు. సమస్య ఎలాంటిదైనా అధికారుల వెంటబడి వాటికి పరిష్కారం చూపిస్తుంది.

సమస్య చెప్పండి... పరిష్కరిస్తాం!





ప్రజలు తెలివిగా ఉంటే మంచి ప్రభుత్వం వస్తుంది. ప్రభుత్వం కఠినంగా ఉంటే అధికారులు బాగా పనిచేస్తారు. అధికారులు సరిగ్గా ఉంటే పాలనా సజావుగా సాగుతుంది. ఈ లంకెలో ఎక్కడ తేడా వచ్చినా అభివృద్ధి కుంటుపడుతుంది. భారత్ ఎప్పటికీ అభివృద్ధి చెందుతోన్న దేశాల జాబితాలోనే కొనసాగుతుంది. అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు. కానీ ఎవరి పనిలో వాళ్లు పడిపోయి రోడ్డు మీద కనిపించే సమస్యలపైన ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అందుకే పొంగుతోన్న డ్రైనేజీలూ, వెలగని వీధిలైట్లూ, గతుకుల రోడ్లూ, నీళ్లురాని నల్లాలూ మొదలైన వార్తలు పత్రికల్లో కనిపించని రోజంటూ ఉండట్లేదు. అదే ప్రజలు మనసు పెడితే, అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగలిగితే సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రభుత్వం ముక్కు పిండి మరీ వసూలు చేసే పన్నులకు న్యాయం జరుగుతుంది. ప్రజల భాగస్వామ్యంతో అదే పనిచేస్తోంది 'ఇన్నొవేటివ్ సిటిజన్ రెడ్రెసల్ ఫోరమ్'(ఐసీఆర్ఎఫ్) అనే సంస్థ. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐసీఆర్ఎఫ్ క్రమంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తోంది. ప్రజల సహకారంతో ప్రభుత్వాధికారులపైన ఒత్తిడి పెంచుతూ అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది.

ఎస్సెమ్మెస్‌ల దాడి

రోడ్డు మీద గుంతలూ, భద్రత లేని ట్రాన్స్‌ఫార్మర్లూ, డ్రైనేజీ సమస్యలూ, అక్రమ నిర్మాణాలూ... సమస్య ఏదైనా ఎవరో ఒకరు దానికి సంబంధించిన ఒక ఫొటో తీసి ఐసీఆర్ఎఫ్ వెబ్‌సైట్లోనైనా, ఆప్‌లోనైనా అప్‌లోడ్ చేయడంతో పరిష్కార ప్రక్రియ మొదలవుతుంది. ఫొటోని పోస్ట్ చేసిన వాళ్లే అది ఏ ప్రాంతానికి చెందిందో, సమస్య ఏ ప్రభుత్వ విభాగం కిందకి వస్తుందో తెలిపే వివరాలు జతచేయాలి. ఆ పోస్టుకు కనీసం పదిమంది మద్దతు లభించినా సంబంధిత అధికారి సెల్‌ఫోన్‌కి ఎస్సెమ్మెస్ రూపంలో ఆ సమస్య వివరాలు చేరతాయి. ఆపైన లైకులూ, కామెంట్లతో ఆ పోస్టుకు ఒక్కొక్కరూ మద్దతు తెలిపినప్పుడల్లా అధికారికి ఒక్కో ఎస్సెమ్మెస్ దానంతటదే వెళ్తూ ఉంటుంది. అలా వంద ఎస్సెమ్మెస్‌లు వెళ్లినా కూడా సమస్య అలానే ఉంటే ఆ తరవాత నుంచి ఎస్సెమ్మెస్‌లు అతడి పైఅధికారికి వెళ్తాయి. ఇలా సమస్య పరిష్కారమయ్యేదాకా ఐసీఆర్ఎఫ్ సంక్షిప్త సందేశాలను సంధిస్తూనే ఉంటుంది. సమస్య తీరాక స్పందించిన అధికారితో పాటు ఎన్ని రోజులకు స్పందించారన్న వివరాలనూ వెబ్‌సైట్, ఆప్‌లలో అందుబాటులో ఉంచుతుంది.

700కు పైగా పరిష్కారాలు

ఒకప్పుడు తనకు ఎదురైన అనుభవాల కారణంగానే ఐసీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశానంటారు సురేష్ పెండ్యాల. 'ఓసారి ఏదో ప్రభుత్వ కార్యాలయంలో పని పడితే ఒక్కడినే ఎంత తిరిగినా చాలారోజుల దాకా అది పూర్తవలేదు. నాలా ఇబ్బంది పడేవాళ్లు చాలామంది ఉంటారు. ఒక్కొక్కరూ ఎంత పోరాడినా ఫలితం ఉండదు. అందరూ కలిస్తే అధికారులపైన ఒత్తిడి పెంచి పని త్వరగా చేయించొచ్చు అనిపించింది. ఐసీఆర్ఎఫ్ ఆలోచనలకు అదే మూలం. ఓ కాలనీలో వెయ్యి మంది ఉంటే, అందులో సామాజిక బాధ్యత ఉన్నవాళ్లు ఓ పదిమందైనా కనిపిస్తారు. వాళ్లు చాలు, సమస్యలను తెలియజేసి పరిష్కార మార్గం చూపించడానికి' అంటారు సురేష్. ప్రారంభమైన ఐదు నెలల్లో ఏడు వందలకు పైగా ప్రజా ఫిర్యాదులను సంస్థ పరిష్కరించింది. అందులో తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలే ఎక్కువ. ఆ తరవాత పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సమాధానం దొరికింది. మూతలేని మ్యాన్‌హోళ్ల నుంచీ అక్రమ భవన నిర్మాణాల వరకూ అన్ని రకాల ఫిర్యాదులకూ అధికారులు స్పందించారు. ప్రస్తుతం మరెన్నో పిటిషన్లు ప్రజల మద్దతు పొందుతూ, అధికారుల స్పందన కోసం ఎదురు చూస్తున్నాయి.

'తెలుగు రాష్ట్రాల్లో ప్రజల స్పందన బావుంది. ఇతర రాష్ట్రాలకూ సంస్థను విస్తరిస్తున్నాం. అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు ఇబ్బంది కలగకుండా పనివేళల్లోనే ఎస్సెమ్మెస్‌లు చేరేలా చూస్తున్నాం. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం ఫిర్యాదు చేసిన వ్యక్తి చూపించే చొరవకు కొన్ని పాయింట్లు కేటాయిస్తున్నాం. వాటి ఆధారంగా కొంత పారితోషికాన్నీ చెల్లిస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి ఈ పద్ధతిలో వీలైనంతగా చెక్ పెట్టొచ్చని నా నమ్మకం. 'ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క' అనే రాజ్యాంగ సూత్రానికీ న్యాయం జరుగుతుంది' అన్నది సురేష్ మాట. అన్నా హజారే, ఐపీఎస్ అధికారి లక్ష్మీ నారాయణ, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్, తనికెళ్ల భరణి, ప్రొ. కోదండరాం లాంటి ప్రముఖులు ఐసీఆర్ఎఫ్‌కు తమవంతు సహాయాన్ని అందిస్తున్నారు. మీ చుట్టుపక్కల అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలేవైనా ఉంటే icrf.org.inలోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు.

– సత్యం మల్యాల, ఈనాడు, హైదరాబాద్

కథ

జ్ఞాపిక

– నందిరాజు పద్మలతాజయరాం

సుధీర్!
ఓ అందమైన కల
ఓ అపురూప అనుభవం
ఓ చల్లటి పలకరింత
ఓ ఆత్మీయ కౌగిలింత

మగాళ్ళనే మురిపించేంత అందగాడు. అల్లరిగా నవ్వే ఆ కళ్ళనిండా చిలిపితనమే! అర క్షణమైనా తనని వదిలి ఉండలేని లవర్ బాయ్. మూడు పదులు దాటాయని తనకు తానుగా చెప్పుకున్నా, ఏ ఒక్కరూ నమ్మలేరు. ఛామనఛాయలో, సొట్ట బుగ్గలతో ఎంతం దంగా ఉంటాడు! తను అతగాడి భుజందాకా కూడా రాదేమో! ఏం చూసి తనని లవ్ చేశాడో! ఎంతమందిని ఎదిరించి తనని పెళ్ళి చేసుకున్నాడో! అయిదేళ్ళు ఎలా గడిచాయో!

టేబుల్ మీద తల ఆన్చిన స్వాతి మరో లోకంలో ఉంది. లంచ్‌టైమ్ అయిన సంగతి తెలీనంత తాదాత్మ్యంలో ఉంది.

ఫోన్ రింగయింది. మొబైల్‌లో పేరు చూసింది స్వాతి. లలిత... లంచ్‌మేట్.

"ఆకల్లేదే! నువ్వు కానీయ్. తలనొప్పిగా ఉంది. రాను."

ఫోన్ పెట్టేశాక ఆమె మనసు గతాన్ని వదిలి వర్తమానంలోకి వచ్చింది.

అవును. సుధీర్ ఇప్పుడు గతం. ఆ నవ్వూ, పలకరింపూ, కౌగిలీ అన్నీ తనకు దూరమే! ఎప్పటికీ దగ్గరకి రాలేనంత దూరానికి ఒంటరిగా ప్రయాణంకట్టాడు సుధీర్. స్వాతిగానీ, మూడేళ్ళ పాప అనన్య కానీ తోడు రాలేనంత క్లిష్టమైన పయనం అతనిది. సుధీర్ చనిపోయాడు.

ఆర్నెల్ల క్రితం...

ఈ సృష్టిలోని ఆనందం అంతా నాదే! ఏ బాధా నన్నంటదు. నేనేది కోరినా దొరుకుతుంది. మంచి మనసున్న సుధీర్‌ని కోరాను. లభించాడు. కాదూ, కూడదూ అన్న పెద్దవాళ్ళ ఆశీర్వచనం కావాలనుకున్నాను. అనన్య పుట్టగానే అందరూ మనసు మార్చుకుని తమను చేరదీశారు. ఇద్దరికీ మంచి ఉద్యోగాలు, ఏ ఇబ్బందీ లేని జీవితం. పూలబాటలో సాగే ఈ జీవితం ఇలాగే కొనసాగుతుంది. నా సుధీర్ గుండెగూటిలో గువ్వలా నేనుంటాను. మా పొదరింట్లో అనన్య కువకువలతో ఏ పొద్దూ శుభోదయమే!

స్వాతి మదినిండిన భావాలవి.

దేవుడికెందుకు కన్నుకుట్టిందో? పన్నీటి జల్లులే కాదు, కన్నీటి బిందువులూ జీవితంలో భాగమే అని నిరూపించదలిచాడేమో. సంసార స్వరధునిలో అపస్వరం పలికింది. ప్రపంచం కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే తరుణంలో, సుధీర్ స్వాతి బతుకు నుంచి వీడ్కోలు పలికి అందని తీరాలకి సాగిపోయాడు.

ఆరోజు...

నూటనాలుగు డిగ్రీల జ్వరంతో ఇల్లు చేరాడు సుధీర్. కంగారుపడిపోయింది స్వాతి.

"మామూలు జ్వరమేలే! కంగారెందుకోయ్, డాక్టరు దగ్గరికెళితే సరి. రెండ్రోజులు విశ్రాంతి, నాలుగైదు రోజుల యాంటీబయాటిక్స్‌తో జ్వరం పారిపోదూ?" నీరసంగా నవ్వాడు సుధీర్.

స్కూటీ మీద డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళింది స్వాతి. మూడు రోజులకి ట్రీట్‌మెంట్ రాశాడు డాక్టర్. వైరల్ ఫీవర్ అని చెప్పాడు.


వారం రోజులు గడిచినా జ్వరం నియంత్రణలోకి రాకపోగా సుధీర్‌కి నీరసం మరింత పెరిగింది. క్లినికల్ పరీక్షలు చేయించమన్నాడు డాక్టర్.

"సాధ్యమైనంత శీఘ్రంగా పెద్దాసుపత్రికి తీసుకెళ్ళండి" రిపోర్ట్సు చూస్తూనే చెప్పాడు డాక్టర్.

"భయపడాల్సిందేమీ లేదు కదూ!"

స్వాతి మాటలకి కాస్త తడబడ్డాడు డాక్టర్.

"మరేంలేదులేమ్మా! రక్తం తక్కువగా ఉంది, ఎక్కించాలి" అంటూ తనే భార్యభర్తలిద్దర్నీ ఆటోలో ఎక్కించి కార్పొరేట్ ఆసుపత్రికి పంపాడు. ఫోన్ చేసి అక్కడవాళ్ళకి సుధీర్‌ని తక్షణం చేర్చుకోమని కూడా చెప్పాడు.



"నువ్వుత్తి బెదురుగొడ్డువి. ఈ డాక్టర్లేమో మరింతగా కంగారు పెట్టి గోరంతల్ని కొండంతలు చేస్తారు. అవసరం లేదు స్వాతీ, మరో డాక్టర్ దగ్గరికెళ్దాం" ఆటోలో చెప్పాడు సుధీర్.

"నువ్వేం మాట్లాడకు ధీరూ, చిన్న పాముని కూడా పెద్ద కర్రతోనే కొట్టాలి. మనకి ఇన్సూరెన్స్ కవరేజీ ఉంది. వర్రీ అవకు."

సుధీర్‌ని ఆసుపత్రిలో చేర్చగానే, ఆ విషయం తనవాళ్ళకీ అత్తామామలకీ ఫోన్ చేసి చెప్పింది స్వాతి. ఒకళ్ళది వరంగల్, మరొకళ్ళది వైజాగ్.

నలుగురైదుగురు డాక్టర్లు సుధీర్ చుట్టూ మూగి మాట్లాడుకోవడం, చకచకా ఏవేవో పరీక్షలు చేయించడం, ఎక్స్‌రేలూ స్కానింగులూ... ఏవిటో అంతా గాభరాగా తోచింది స్వాతికి. సుధీర్ మనసులో ఏముందోగానీ పైకి మాత్రం చిరునవ్వుతోనే వాళ్ళడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్తున్నాడు.

"యానిమల్ ప్లానెట్‌లో జీబ్రానో, జిరాఫీనో చంపగానే, పులులు మూగినట్లు మూగారు కదూ డాక్టర్లు" జోక్ చేశాడు స్వాతితో నెమ్మదిగా సుధీర్.

"ష్! ఏం పోలికది... షటప్" కసిరింది స్వాతి.

"అనన్యని కేర్‌సెంటర్ నుంచి తేవాల్సిన టైమ్ అయినట్లుంది, నువ్వెళ్ళిరా! నాకేం భయం లేదు" అంటూనే ఉన్నాడు సుధీర్, అంతలోనే గొంతు కొరబోయినట్లయి భళ్ళున వాంతయింది.

ఎర్రటి, చిక్కటి నెత్తురు!

ఒక్కసారిగా డాక్టర్లూ నర్సులూ గుమిగూడారు. స్వాతిని దూరంగా పొమ్మన్నారు.

"ఇంతకుముందిలా ఎప్పుడైనా అయిందా? ఇంట్లో ఎవరికైనా క్యాన్సర్ ఉందా?" లాంటి ప్రశ్నలతో సుధీర్‌ని ఉక్కిరిబిక్కిరి చేశారు.

కేవలం వారం జ్వరానికి ఇంత సీరియస్ అవడం ఆశ్చర్యంగా ఉంది సుధీర్‌కి. తనకేమైందో తెలియడం లేదు. 'ఇదేమైనా ప్రాణాంతకం కాబోతోందా? అదే అయితే, ప్రేమించి పెళ్ళి చేసుకున్న స్వాతి గతేంటి? అమ్మానాన్నలెలా తట్టుకుంటారు? చిన్నారి అనన్య తను పక్కన లేకుంటే నిద్ర కూడా పోదే, ఏమిటిది?!'

స్ట్రెచర్ సిద్ధమయింది.

స్వాతితో ఒక్క మాటయినా చెప్పకుండా అత్యవసర విభాగంలోకి సుధీర్‌ని తీసుకెళ్ళిపోతున్నారు.

"ఆగండి" గట్టిగా అరిచింది స్వాతి. "ఆయనకేమైందో చెప్పండి. ఎక్కడికి, ఎందుకు తీసుకెళ్తున్నారు?" ముందుకు ఉరికిన స్వాతిని సెక్యూరిటీ సిబ్బంది ఆపారు.

"ఆవిణ్ణి రానీయండి. అమ్మా, అర్జంటుగా కొన్ని పరీక్షలు చేయాలి. వివరాలు మావాళ్ళు మీకు చెప్తారు" పెద్ద డాక్టర్ అనునయించాడు.

"ధీరూ, నీకేం కాదు ధీరూ! భయపడకు. ఇదంతా అనవసర హంగామా! నువ్వన్నట్లు మరో డాక్టర్ దగ్గరకెళ్తే పోయేది. కంగారుపడకు." భర్త తలను గుండెల్లో పొదువుకుంది స్వాతి.

"నేను కాదురా కంగారుపడేది, నువ్వు. నువ్వుండగా నాకేం భయం?" స్వాతి చుబుకాన్ని ముద్దుపెట్టుకున్నాడు సుధీర్.

ఐసీయూలోకి చేర్చిన వెంటనే మరో రెండు

సార్లు రక్తపు వాంతులయ్యాయి సుధీర్‌కి. కొద్దిగా ఎగరొప్పు మొదలయింది. కళ్ళు మసకబారసాగాయి. శరీరంలోని ప్రతి కీలూ నొప్పిగా ఉంది. కదలలేకపోతున్నాడు. వింత వర్ణాల వలయాలతో నిండిన కుహరాల లోపలికి పయనిస్తున్న అనుభూతి. అతన్ని అపస్మారకం కమ్ముకుంది.

"మీ కాళ్ళు పట్టుకుంటాను. ఏమైంది మా ఆయనకి?" డాక్టర్ని ప్రాధేయపడింది స్వాతి.

"సారీ అమ్మా, అతనికి బ్లడ్ క్యాన్సర్. సైలెంట్‌గా వృద్ధి చెందింది."

"అంటే... ఆయన..."

"పెద్దవాళ్ళెవరైనా ఉంటే పిలవండమ్మా! నర్స్... ఈవిడకి సాయం చేయండి" వెళ్ళిపోయాడు డాక్టర్.

ఆ తర్వాత సంఘటనలేమీ స్వాతికి గుర్తు లేవు. స్మృతి తప్పిన ఆమెని నెలరోజులపాటు కంటిరెప్పలా కాపాడుకున్న బంధువులు, ఆమె కాస్త వాస్తవంలోకి వచ్చాక తిరిగి వెళ్ళిపోయారు. చలనం ఉన్న ప్రతిమలా అనన్య కోసం బతుకుతోంది. ఉద్యోగం చేస్తోంది. అనుక్షణం గుర్తొచ్చే సుధీర్‌తో గతంలోనే బతుకుతోంది.

తలమీదెవరో నిమిరినట్లనిపించి తలెత్తింది స్వాతి.

చైతన్య!

"ఏమిటిది స్వాతీ... ఎన్నాళ్ళిలా? నవ్వు తప్ప కన్నీరు తెలియని స్వాతివేనా నువ్వు?" బాధగా అన్నాడు.

స్వాతి, సుధీర్, చైతన్య ముగ్గురూ డిగ్రీ నుంచి స్నేహితులు. గ్రాడ్యుయేషన్ పూర్త యాక ఎంబీఏ చేసి ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు చైతన్య. స్వాతి, సుధీర్ ఇద్దరికీ ప్రభుత్వోద్యోగాలు వచ్చాయి. వాళ్ళిద్దరి ప్రేమ వివాహానికి సూత్రధారి చైతన్యే.

"కూర్చో చైతూ, నేను ఎలా ఉంటేనేం?"

"అలా అనకు. అనన్య కోసమైనా నవ్వుతూ ఉండాలి. నువ్విలా ఉంటే సుధీర్ సంతోషంగా ఉంటాడా?"

విరక్తిగా నవ్వింది స్వాతి.

"చదువుకున్నదానివి. ఆ పసిదానికి తల్లి ప్రేమని కూడా దూరం చేయకు. నువ్వూ, నేనూ, ఈ ప్రపంచంలోని మనుషులందరికీ తప్పని పరిణామం ఇది. నువ్వెంత ఏడ్చినా గతాన్ని గాలం వేసి తేగలమా? అసాధ్యం కదూ."

"నేనేం చేయను చైతూ. ప్రతి క్షణం..."

"గుర్తొస్తాడు. రానీ! వాడికిష్టమైన స్వాతిలా నువ్వుంటే వాడూ నిన్ను మరవడు. నువ్వు మానసికంగా సిద్ధపడు. నీ ధైర్యం నీకు తోడుగా ఉంటే చాలు స్వాతీ!"

"కానీ, ఎలా?"

పసిపాపలా అడిగిన స్వాతి చేతిని పట్టుకున్న చైతన్య చెప్పాడు. "ఈరోజు నుంచే నువ్వూ, అనన్యా పార్కులకీ సినిమాలకీ వెళ్తారు. నువ్వు ఈ హెయిర్‌స్టయిల్, డ్రెస్ స్టయిల్ అన్నీ మార్చుకుంటావు. నిన్ను నువ్వు మెచ్చుకునేలా కొత్త పనులు ఫొటోగ్రఫీ, పెయింటింగ్ లాంటివి మొదలుపెడతావు. అవును, స్వాతి మరో జన్మెత్తుతుంది. ఈ చైతూ నీకు తోడుంటాడు. అయినా సుధీర్ ఎక్కడి కెళ్ళాడు స్వాతీ... అనన్య రూపంలో అనుక్షణం నీ కొంగు పుచ్చుకునే తిరుగుతున్నాడుగా! వాడు నీకిచ్చిన 'మెమెంటో' అనన్య."

కాసేపయ్యాక వెళ్ళిపోయాడు చైతన్య.

"దిల్‌సుఖ్‌నగరెళ్ళాలమ్మా, స్టేజీ వస్తే చెప్తావా?" నడివయసు స్త్రీ అడిగిన ప్రశ్నకి తల ఊపి, ఆమె వంక చూసింది స్వాతి. బస్‌లో కిటికీ వైపుకి ఒదిగి కూర్చున్న ఆమె ఒళ్ళో ఓ పాప.

"ఎక్కడ్నుంచి వస్తున్నారు?" అడిగింది స్వాతి.

"తెనాలి దగ్గర పల్లెటూరమ్మా మాది. నా ముగ్గురు పిల్లలూ పసివాళ్ళుగా ఉన్నప్పుడే మావారు విషజ్వరంతో పోయారు. ఏదో కష్టపడి పెంచుకొచ్చాను. పెద్దవాడు ఉద్యోగమంటూ దుబాయ్ వెళ్ళి ఏదో గొడవల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. నా దురదృష్టం.



ఆ బాధ సలుపుతూండగానే రెండోవాడికి యాక్సిడెంట్‌లో కాళ్ళు విరిగాయి. ఏడాదిపాటు మంచం మీదే ఉన్నాడు. ఇప్పుడిప్పుడే కొయ్య కాళ్ళతో నడుస్తున్నాడు. హు! అది చాలనట్లు, ఇదిగో ఈ పిల్ల. పదహారేళ్ళు దీనికి. బుద్ధిమాంద్యం. ఇప్పుడు దీనికోసమే వెళ్తున్నాను. ఇక్కడేదో ప్రత్యేక స్కూల్ ఉందట. కనుక్కుందామని వెళ్తున్నాను."

అన్ని కష్టాలనీ నిబ్బరంగా చెప్తున్న ఆవిణ్ణి విస్మయంగా చూసింది స్వాతి.

"మరి మీ బతుకుతెరువు?"

"మా రెండోవాడికి ఎలక్ట్రికల్ పనులొచ్చమ్మా. కావాల్సిన సామాను తెచ్చిస్తే స్విచ్‌బోర్డులూ వగైరాలు తయారుచేస్తాడు. నేను పచ్చళ్ళూ అప్పడాలూ పొళ్ళూ తయారుచేస్తాను. ఏదో జీవితం వెళ్ళిపోతోంది. దేవుడు నా నుదుట రాసినన్నాళ్ళూ వీళ్ళకోసం బతకాలిగా."

పెద్దావిడ మాటలకి గుండె భారమైంది స్వాతికి.

దిల్‌సుఖ్‌నగర్ రాగానే ఆవిడకి చేతిసాయం అందించి బస్టాప్‌లో దింపింది స్వాతి.

ఇంటికి రాగానే తనని చుట్టుకున్న అనన్యని దగ్గరికి తీసుకుని, ఆయాని వెళ్ళిపొమ్మంది స్వాతి. కూతురి ముఖంలోకి తేరిపారా చూసింది. దీపాల్లా వెలిగే దాని కళ్ళూ, బంగారురంగులో మెరిసిపోయే బుగ్గలూ వాడిపోయి ఉన్నాయి. కళావిహీనంగా ఉన్న దాని వర్చస్సు చూసేసరికి ఏడుపొచ్చేసింది స్వాతికి. ఎదురుగా ఉన్న ఫొటోలోని సుధీర్ తనను నిలదీస్తున్నట్లనిపించింది. పాపని దగ్గరకు తీసుకుని ఆపిల్ ముక్కలు తినిపిస్తూ టీవీ ఆన్ చేసింది.

ఏదో న్యూస్ ఛానల్.

టీవీలో చూపిస్తున్న నవయువతి ఎంతో విశ్వాసంతో, పట్టుదలతో తాను సాధించిన విజయాలను వివరిస్తోంది. కొన్నేళ్ళక్రితం సునామీలో తన వాళ్ళందర్నీ పోగొట్టుకున్న అనాథ ఆమె. ఆమెలో ఎక్కడా దైన్యం లేదు-రూపుకట్టిన స్థైర్యం తప్ప.

చైతన్య కిరణమేదో తనను తాకి, తనలో లీనమైనట్లనిపించింది స్వాతికి.

స్వాతిలో వచ్చిన మార్పుని ఆఫీసులోవాళ్ళూ, చుట్టుపక్కలవాళ్ళూ జీర్ణించుకోలేకపోతున్నారు. నిన్నమొన్నటిదాకా ఆమెని అనునయించి, సముదాయించి మామూలుగా ఉండమన్నవాళ్ళే, స్వాతిలోని కొత్తదనాన్నీ చురుకుదనాన్నీ ఆమోదించలేకపోతున్నారు. వాళ్ళ గుసగుసల్లో అనుమానాలు దొర్లుతున్నాయి.

"ఈ లోకం తీరింతే స్వాతీ! ఇలాగే ఉంటుంది. మనం వెంటబడితే పరుగెత్తుతుంది. మనం పరుగుతీస్తే వెంటపడుతుంది. తన సంతృప్తి కోసం సానుభూతి చూపిస్తుంది. ఆ సానుభూతికి తావు లేకపోతే నిరాశపడుతుంది. నిందలు వేస్తుంది. ఇదో కొత్త స్టేజ్ నీకు. అలవాటుపడు. నీకోసం నువ్వు బతుకు. ఈ ప్రపంచానికి ప్రతి నిత్యం ఓ కొత్త విషయం కావాలి. ఇవాళ్టికి నువ్వు, రేపు మరొకరు. అంతేకానీ, వాళ్ళ నిందల్నీ నిష్ఠూరాల్నీ మనసుకు తీసుకుని బాధపడకు. జస్ట్, ఓ మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే సినిమాలాగా చూస్తూ హాయిగా నవ్వుకో!" నవ్వుతూ అన్నాడు చైతన్య.

"అనన్య ఎంత ఆనందంగా ఉందో తెలుసా చైతూ! దాని నవ్వు అచ్చు సుధీర్ నవ్వులాగే ఉంటుంది" బొమ్మలతో ఆడుకుంటున్న పాపని చూస్తూ అంది స్వాతి.

"నిన్నూ, అనన్యనీ ఇలా చూస్తుంటే నాకెంత ఆనందంగా ఉందో ఊహించలేవు స్వాతీ! అన్నట్లు, ఈ ఆదివారం రాధికతో నా నిశ్చితార్థం. నువ్వు రావాలి. పిలవడానికే వచ్చాన్నేను."

సంతోషంగా తలూపింది స్వాతి. తమ ఇరువురి మధ్య లేని బంధాన్ని ఊహించి చెవులు కొరుక్కుంటున్న వాళ్ళ నోళ్ళింక మూతలుపడతాయన్న తృప్తితో నిట్టూర్చింది. దగ్గరికి వచ్చిన అనన్యని గుండెలకు హత్తుకుంటూ ఫొటోలోని సుధీర్‌తో అంది, "ఇది నీ జ్ఞాపిక ధీరూ, భద్రంగా చూసుకుంటున్నా!"

ఊరంతా కంప్యూటర్ వాడేస్తారు!



టెలిఫోన్ సిగ్నళ్లే సరిగ్గా అందని ఆ ఊళ్లో కంప్యూటర్లు సందడి చేస్తున్నాయి. కూలీనాలీ చేసుకుని పొట్టపోసుకునే వాళ్లంతా ఇప్పుడు ఇంటర్నెట్‌ను సునాయసంగా వాడేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఆకోలిని వంద శాతం డిజిటల్ సాక్షరతా గ్రామంగా ప్రకటించింది. ఆ విజయం వెనక నివాల్కర్ గజానన్ అనే ఓ ఔత్సాహకుడి కృషి దాగుంది.



చదువుకున్న వాళ్లే అంతంత మాత్రంగా ఉండే పల్లె టూళ్లలో ప్రతి కుటుంబం కంప్యూటర్ మీద పరిజ్ఞానం సాధించడమంటే మాటలు కాదు. ఆ అరుదైన ఘనతను ఆకోలి వాసులు అందుకున్నారు. ఊళ్లో ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరు రోజువారీ అవసరాల కోసం కంప్యూటర్‌ని వాడటంలో సుశిక్షితులయ్యారు. దాని ఫలితమే సంపూర్ణ ఈ-సాక్షరత. ఊరికి దగ్గర్లో ఓ కామన్ సోర్స్ కంప్యూటర్ కేంద్రాన్ని నడిపించే గజానన్ చొరవకు మరికొందరి సాయం తోడవడంతో ఈ విజయం సాధ్యమైంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ అనే గ్రామం గజానన్‌ది. డిప్లొమా చదివే రోజుల్లోనే అతడు కంప్యూటర్ వాడటం నేర్చుకున్నాడు. చదువు పూర్తయ్యేసరికి తండ్రి చనిపోవడంతో గజానన్ ఇంటి దగ్గరే ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. దాంతో అక్కడే ఆటోడ్రైవర్‌గా పనిచేయడం మొదలుపెట్టాడు.

80 మందితో మొదలు

ఆటోడ్రైవర్‌గా ఉండగానే గజానన్‌కు మీసేవ కేంద్రాల గురించి తెలియడంతో, ఓ కేంద్రం పెట్టడానికి దరఖాస్తు చేసుకున్నాడు. లైసెన్సు దొరకడంతో ఇంటి దగ్గరే ఓ కంప్యూటర్ ఏర్పాటు చేసుకుని ఊళ్లోవాళ్ల కరెంటూ, నల్లా బిల్లుల చెల్లింపులూ, ఇతర పనులూ చేయసాగాడు. ఆ పైన కొన్నాళ్లకు 'కామన్ సర్వీస్ సెంటర్' (సీఎస్‌సీ) పథకం తెలంగాణ ప్రాంత సమన్వయకర్త రాజ కిశోర్ సాయంతో ఓ కేంద్ర నిర్వహణకు లైసెన్సు పొందాడు. దాని ద్వారా గ్రామస్థులు ప్రభుత్వ పథకాలకు అర్జీ పెట్టుకోవడానికీ, ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీలూ, భత్యాలూ పొందడానికీ సహాయ పడేవాడు. అలా చాలా ఏళ్ల పాటు సీఎస్‌సీని నిర్వహించిన గజానన్‌ను గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ లిటరసీ మిషన్ ఆకర్షించింది. కంప్యూటర్ పరిజ్ఞానం సాయంతో గ్రామీణుల జీవన ప్రమాణాల్ని పెంచే ఉద్దేశంతో మొదలైన ఆ కార్యక్రమంలో గజానన్‌కూ భాగమవ్వాలనిపించింది. దాంతో తన కేంద్రానికి వచ్చే కొందరిని ఎంపిక చేసుకుని కంప్యూటర్‌ని ఉపయోగించడంలో శిక్షణ ఇవ్వాలనుకున్నాడు. కొద్దో గొప్పో చదువుకున్న వాళ్లతో పాటు, విద్యా వలంటీర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కార్యకర్తలతో కలిపి 80 మందికి శిక్షణ ఇచ్చాడు. ఆపైన విద్యా, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వాళ్లంతా పిల్లలకు సంబంధించిన వివరాలనూ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంలో పట్టు సాధించారు. అదే గజానన్ తొలి విజయం.

పరీక్షలో పాస్...


తొలి ప్రయత్నం మంచి ఫలితాన్నివడంతో పూర్తిగా ఓ గ్రామంలోని ప్రతి కుటుంబాన్నీ కంప్యూటర్‌ని ఉపయోగించే స్థాయికి తీసుకు రావాలన్న ఆలోచన గజానన్‌కి వచ్చింది. వెంటనే ఆ విషయాన్ని పొరుగూరు ఆకోలిలో సర్పంచ్‌గా ఉన్న స్నేహితుడు కేశవ్‌తో పంచుకున్నాడు. ఆకోలిలో మొత్తం 175 కుటుంబాలున్నాయి. తొలుత గజానన్ ఇంటింటికీ వెళ్లి కంప్యూటర్ నేర్పిస్తానని చెప్పేవాడు. పొలం పనులు చేసుకునే తమకు కంప్యూటర్లు ఎందుకని చాలామంది ఆసక్తి చూపలేదు. అయినా గజానన్ పట్టు వదలకుండా, ఇంటికొకరైనా కంప్యూటర్ నేర్చుకుంటే ఎవరిపైనా ఆధారపడకుండా ఎన్నో రకాల పనులు చేసుకోవచ్చని నచ్చజెప్పి ఒప్పించాడు. ఎక్కువ శాతం ఇళ్లలో ఒక్కరైనా ఏడో తరగతిదాకా చదివిన వాళ్లుండటంతో గజానన్ పని సులువైంది. 20 మంది చొప్పున బ్యాచ్‌లుగా విభజించి మొదట మౌస్ ఉపయోగించడం తెలియడానికి ఎమ్మెస్ పెయింట్ నేర్పించాడు. తరవాత వర్డ్ డాక్యుమెంట్‌లో టైప్ చేయడంలో తర్ఫీదునిచ్చాడు. గ్రామస్థులను ఉత్సాహపరచడానికి టైపింగ్, పెయింటింగ్‌లో పోటీలు పెట్టి బహుమతులు ఇవ్వసాగాడు. ఆపైన తెలుగులో ఇంటర్నెట్‌ని బ్రౌజ్ చేయడం, వ్యవసాయానికి సంబంధించిన వీడియోలు చూడటం, కరెంటు బిల్లులూ, నీళ్ల బిల్లులూ చెల్లించడం తదితర అంశాలపైన శిక్షణ ఇచ్చాడు. చివరికి జాతీయ డిజిటల్ సాక్షరత మిషన్ నిర్వహించిన అధికారిక పరీక్షలో గ్రామంలోని అన్ని కుటుంబాల్లో ఎవరో ఒకరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నట్లు తేలింది. దాంతో దేశంలో సీఎస్‌సీ ఆధ్వర్యంలో నూరు శాతం ఈ-సాక్షరత సాధించిన తొలి గ్రామంగా ఆకోలి ఎంపికైంది.

మరో రెండు గ్రామాల్లోనూ...

గజానన్ సాయంతో కంప్యూటర్ నేర్చుకున్న గణిత అనే అమ్మాయికి ఆకోలిలోనే ఓ కంప్యూటర్ కేంద్రాన్ని నిర్వహించే అవకాశం దొరికింది. ఇంకొందరు కుర్రాళ్లు కంప్యూటర్ ఆపరేటర్లుగా రాణించే ప్రయత్నాల్లో ఉన్నారు. గజానన్ కృషికి గుర్తింపుగా ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 'అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్'నూ అందుకున్నాడు. 'ఆకోలి సర్పంచ్ కేశవ్, గ్రామంలోని ఘాట్ ఆకోలి యూత్ ఆర్గనైజేషన్ సభ్యులూ, తెలంగాణ సీఎస్‌సీ ఏవీపీ రాజ కిశోర్, ఇంటెల్ సంస్థ ప్రతినిధి జితేష్ కుమార్ లాంటి వాళ్ల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైంది' అంటాడు గజానన్. ప్రభుత్వం నుంచి తనకు అందిన రూ.65వేలలో రూ.40వేలను ఆకోలిలో సీఎస్‌సీ కోసం రెండు కంప్యూటర్లు కొనడానికే అందించాడు. ప్రస్తుతం మరో రెండు గ్రామాల్లోనూ కంప్యూటర్ పాఠాలు నేర్పించడంతో పాటు ఓ జాతీయ స్థాయి గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టుకు సేవలందించే పనిలో ఉన్నాడు. ఒకరి చదువు, ఊరందరికీ వెలుగు అనడానికి అచ్చమైన ఉదాహరణ గజానన్ విజయమే.





మట్టి అంటకుండా మొక్కలు పెంచేద్దాం!






కుండీల్లో మట్టి పోసి పెంచడం ఎంత సులభమో అనుకుంటాం. కానీ మట్టి గట్టిపడిపోతే దాన్ని మొత్తంగా తీసి మార్చాలి. ఎప్పటికప్పుడు వేర్లకు ఆక్సిజన్ అందేలా గుల్లగా చేయాలి. అందుకే ఇప్పుడు మట్టి లేకుండానే మొక్కల్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా వస్తున్నవే ఈ హైడ్రోటోన్స్ ఉరఫ్ క్లే పెబల్స్.







మట్టి లేకుండా మొక్కల్ని పెంచలేమా అన్న ఆలోచనలోంచి పుట్టుకొచ్చిన విధానమే హైడ్రోపోనిక్స్. దీనికోసం రకరకాల పదార్థాలను వాడుతున్నారు. పోషకభరితమైన నీళ్లతోబాటు కొబ్బరి పీచూ, పీట్ మాస్, పెర్లైట్... వంటి వాటిల్లోనూ మొక్కల్ని పెంచుతున్నారు.

ఇప్పుడు క్లే పెబల్స్ కూడా వస్తున్నాయి. వీటినే మట్టిరాళ్లు, మట్టి ఉండలూ అనీ అంటున్నారు. అచ్చంగా కుండీల్లో ఈ మట్టిరాళ్లని నింపి పెంచేవాళ్లు కొందరయితే, వీటిని కుండీల్లో అడుగున వేసి ఆ పైన వేరే పదార్థాలను నింపేవాళ్లు ఇంకొందరు. అలాగే ఉద్యానవనం అందంగా ఉండేందుకు వీటిని వాడేవాళ్లు కొందరయితే, మొక్క ఆరోగ్యంగా పెరగడానికి వాడేవాళ్లు మరికొందరు. ఇవి నీటిని కావాల్సినంత మేర పీల్చుకుని కుండీల్లో నీరు నిల్వలేకుండా చేస్తాయి. దాంతో వేళ్లు కుళ్లిపోవు. పైగా ఈ మట్టిఉండలు రంధ్రపూరితంగానూ తేలిగ్గానూ ఉంటాయి. దాంతో మొక్క వేళ్లు చక్కగా గాలి పోసుకుంటాయి. వీటివల్ల మొక్కకు తరచూ నీరు పోయక్కర్లేదు. ఎందుకంటే ఇవి తేలిగ్గానూ రంధ్రపూరితంగానూ ఉండటంతో అవి నీళ్లను బాగా పీల్చుకుని ఆ నీటిని వేళ్లకు అవసరమైనప్పుడు అందిస్తాయి. ఫలితంగా మొక్క వేళ్లు నీటిని వెతుక్కుంటూ కుండీ అడుగుభాగం వరకూ కూడా ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. వర్షాల కారణంగా కుండీలో నీరు ఎక్కువైతే ఆ నీటిని పీల్చుకుని నిల్వ లేకుండా చూస్తాయి. మరీ ఎక్కువయితే వీటి మధ్యలోని ఖాళీలవల్ల కిందకి పోతాయి.

ఎలా తయారుచేస్తారు?

క్లే పెబల్స్... వీటి పేరులోనే మట్టి ఉంది. అంటే వీటినీ మట్టితోనే చేస్తారు. కానీ కాల్చిన మట్టితో తయారవుతాయి. అంటే ఇటుకల్ని కాల్చినట్లుగానే వీటిని కూడా బట్టీల్లోనూ భారీ మెషీన్లలోనూ బాగా ప్రాసెస్ చేసి అత్యధిక ఉష్ణోగ్రత సుమారు 1100 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర తయారుచేస్తారు. వీటిల్లో కొన్ని గుండ్రంగానూ మరికొన్ని పాప్‌కార్న్ మాదిరిగా విచ్చుకున్నట్లూ ఉంటాయి. వేడిచేయడం కారణంగా మట్టి ఉబ్బి రంధ్రపూరితం కావడంతో ఆ మట్టిలో ఆక్సిజన్ ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా మొక్క వేర్లు వేగంగా వాటిల్లో నాటుకుంటాయి. ఒకవేళ తరవాత ఎప్పుడైనా ఈ హైడ్రోటోన్స్‌ని సాధారణ మట్టిలా వాడాలని అనుకుంటే వెడల్పాటి సుత్తిలాంటి పరికరాలతో వాటిని పగులగొట్టాల్సిందే మరి.

అత్యధిక ఉష్ణోగ్రత దగ్గర తయారవడంవల్ల ఈ మట్టిరాళ్ల పీహెచ్ శాతం తటస్థంగా ఉంటుంది. దాంతో అన్ని రకాల మొక్కల పెంపకానికీ ఇవి సరిపోతాయి. పైగా వీటిని మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. ఆ రకంగా ఇవి పర్యావరణప్రియం కూడా. అయితే వీటిని కుండీల్లో వేసేటప్పుడు ఓసారి బాగా కడగాలి. దీనివల్ల ఫ్యాక్టరీలో తయారైనప్పుడు ఏదైనా మట్టి లాంటిది వీటికి అతుక్కుని ఉంటే అది పోతుంది. కిందకి కూడా మురికి రాకుండా ఉంటుంది. అలాగే వీటిలో మొక్కను నాటేముందు సుమారు 6-24 గంటలు నానబెట్టాలి. ఎందుకంటే ఇవి ఎంత నానితే అంతగా ఉబ్బుతాయి. అంటే అంత ఎక్కువగా నీటినీ పోషకాలనీ పీల్చుకుని మొక్కకు అందిస్తాయన్నమాట. అలాగే నీళ్లు పోసేటప్పుడు మొక్క చుట్టూ కనీసం మూడు అంగుళాల మేర ఉన్న మట్టిగుల్లలు పూర్తిగా తడిసేలా చూసుకోవాలి.

మొత్తమ్మీద ఈ క్లే పెబల్స్ అనేవి మొక్క ఆరోగ్యంగా వేగంగా పెరగడానికి దోహదపడతాయి. అందుకే చేతికి మట్టి అంటకుండా ఏ టెర్రస్‌మీదో బాల్కనీల్లోనో ఉద్యానవనాన్ని పెంచాలనుకునేవాళ్లకు ఇవి చూడచక్కని ప్రత్యామ్నాయం.

బాల వినోదిని

బొటనవేలి బొమ్మలివిగో...



పెయింటింగ్‌లను కాన్వాస్ మీద వేస్తారు. లేదా పేపర్ మీద వేస్తారు. కానీ ఇలా బొటనవేలి మీద కూడా వేసే వాళ్లున్నారంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. ఇటలీకి చెందిన డిటొవాన్‌టీజ్ సరికొత్త ప్రయోగం చేస్తూ ఇలా బొమ్మలను చిత్రిస్తు న్నాడు. వాటికి జుట్టూ, టోపీ వంటివి కూడా జోడిస్తున్నాడు. ఏడేళ్ల కిందట ఇతడు బొటనవేలి మీద బొమ్మలు వేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత వాటిని ఫొటో తీసి ఫేస్‌బుక్ ద్వారా తన స్నేహితులూ బంధువులకు పంపేవాడు. అలా పంపిన బొమ్మలకు మంచి స్పందన రావడంతో అంతర్జాతీయంగానూ పేరు సంపాదించాడు. ముఖ్యంగా ఇతడు వేస్తోన్న కార్టూన్ బొమ్మలు పిల్లలకూ ఎంతగానో నచ్చేస్తున్నాయట.


జతపరచండి

కింది విడి భాగాలను జతపరిస్తే ఆరు త్రికోణాకారాలు వస్తాయి. ప్రయత్నించండి.



దాగుడుమూతలు

ఈ బొమ్మలో గొడుగు, పుస్తకం, పక్షి, టీకప్పు, పెన్సిల్, కటింగ్‌ప్లేయర్, నిచ్చెన, అరటిపండు, ఆపిల్, గ్లాసు ఉన్నాయి. కనిపించాయా?



చెప్పగలరా?

ఈ నినాదాలతో కొందరు ప్రముఖులు భారత జాతిని జాగృతం చేశారు. వాళ్లు ఎవరో చెప్పగలరా?

1. క్విట్ ఇండియా
2. **జై హింద్**
3. వందేమాతరం
4. **స్వాతంత్ర్యం నా జన్మహక్కు**
5. జైజవాన్ జైకిసాన్
6. **సత్యమేవ జయతే**
7. ఇంక్విలాబ్ జిందాబాద్

కనిపెట్టండి

1. ఈ బొమ్మలో D అక్షరంతో మొదలయ్యే పదాలు ఎన్ని ఉన్నాయి?
2. ఇందులో మొత్తం ఎన్ని D అక్షరాలు ఉన్నాయి?



తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఉన్న ఎనిమిది తేడాలు చెప్పండి.



విద్యానందుడి గురుకులంలో ప్రవీణుడు అనే శిష్యుడు ఉండేవాడు. అతడు విజ్ఞాన సముపార్జనలోనేకాదు లోకజ్ఞానంలోనూ అందరికంటే ముందుండేవాడు. దాంతో అనతికాలంలోనే గురువుగారికి ప్రియ శిష్యుడయ్యాడు. ఇది తోటి విద్యార్థి వివేకుడికి అసలు నచ్చేదికాదు. తనను చిన్నచూపు చూస్తూ ప్రవీణుడి పట్ల ప్రత్యేకాభిమానం చూపిస్తూ గురువుగారు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని అనుకునేవాడు. ఆ ఆలోచనతోనే ప్రవీణుడు అంటే ఈర్ష్య పెంచుకున్నాడు. ఇదేమీ తెలియని ప్రవీణుడు ఎంత చక్కగా మాట్లాడినా అతడితో ముక్తసరిగా మాట్లేడేవాడు వివేకుడు. విద్యార్థులు అందిరినీ సమానంగా చూడాల్సిన గురువుగారే ప్రవీణుడిని ప్రత్యేకంగా చూడటం నచ్చక ఒకరోజు ధైర్యం చేసి నేరుగా గురువుగారినే అడిగేశాడు.


పరీక్ష



అతడి ఆలోచనా విధానం సరైందికాదని నిరూపించడానికి ఒకరోజు చిన్న పరీక్ష పెట్టాడు విద్యానందుడు. నేల మీద కొంచెం నూనెనూ పాదరసాన్నీ పారబోయించాడు. వాటిని శుభ్రం చేయమని విద్యార్థులను పురమాయించాడు. విద్యార్థులందరూ ఒక వస్త్రంతో నూనెను శుభ్రం చేశారు. కానీ వాళ్లకు పట్టుకుంటే జారిపోయే పాదరసాన్ని ఎలా శుభ్రంచేయాలో తెలియలేదు. వివేకుడు కూడా పాదరసాన్ని శుభ్రం చేయలేకపోయాడు. అందరికంటే చివరిగా వచ్చిన ప్రవీణుడు పెరట్లో నుంచి ఆవుపేడను తీసుకొచ్చి దానికి పాదరసాన్ని అద్ది తుడిచేశాడు. అతడి తెలివితేటలను కళ్లారా చూసిన వివేకుడికే కాదు మిగతావారికీ ప్రవీణుడి పట్ల అప్పటివరకూ ఉన్న అపోహలు తొలగిపోయాయి.

దారి కనుక్కోండి

కింద ఉన్న చిట్టి చిలుకకు పైకి చేరే దారి చూపండి.




గుర్తించండి

కింది ఆధారాలతో ఈ కప్పుల్లో హనీకి ఇష్టమైనది ఏదో గుర్తించండి.

1. కప్పు మీద మూడు పువ్వులు లేవు.
2. కప్పు గులాబీ రంగులో లేదు.
3. కప్పు ఎగుడుదిగుడుగా లేదు.
4. కప్పు పొడవుగా ఉంది కానీ దానిపైన ఒక్క పువ్వు లేదు.





రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. మొదటి అబ్బాయి లాగు రంగు 2. బకెట్లో నీళ్లు 3. జారబడి కూర్చున్న వ్యక్తి కళ్లజోడు 4. బాతులు 5. రెండు పక్షుల దిశ 6. చెట్ల దగ్గరి గొడుగు 7. నీటిలో ఉన్న అమ్మాయి స్థానం 8. అబ్బాయి టోపీమీది డిజైన్.

జతపరచండి: 1-10, 2-11, 3-7, 4-9, 5-8, 6-12.

దాగుడుమూతలు: బూటు ముందు గడ్డిలో కటింగ్ ప్లేయర్, ఎడమవైపు ఉన్న పువ్వులో అరటి పండు, దాని పైన ఆపిల్, ఆపైన నిచ్చెన, బూటు పైకప్పులో పుస్తకం, పొగ గొట్టంలో టీకప్పు, చెట్టు ఆకుల్లో గొడుగు, పక్షి, బూటులేసుల మధ్యలో గ్లాసు ఉన్నాయి.

చెప్పగలరా?: 1. గాంధీజీ 2. సుభాష్‌చంద్రబోస్ 3. బంకించంద్ర ఛటోపాధ్యాయ 4. బాలగంగాధర్ తిలక్ 5. లాల్‌బహదూర్ శాస్త్రి 6. మదన్‌మోహన్ మాలవీయ 7. భగత్‌సింగ్.

గుర్తించండి: మూడో వరుసలో మూడోది.

కనిపెట్టండి: 1. Divider, Dinosaur, Dice, Drum, Doll 2. అయిదు.

చిన్నికృష్ణుడి నైవేద్యం..!

రుచి అభిరుచి

కృష్ణాష్టమి అంటే... అటుకులూ బెల్లం లేదంటే పరమాన్నం వండి నైవేద్యం పెడుతుంటాం. అయితే ఈసారి కొన్ని ప్రాంతాల్లో బాగా ప్రాచుర్యం పొందిన కొన్ని ప్రసాదాలను చేసి చూద్దామా...

ధార్వాడ్ దూధ్ పెడ

కావలసినవి

వెన్నతీయని చిక్కనిపాలు: రెండున్నర లీటర్లు, **నిమ్మరసం:** అరకప్పు, **నెయ్యి:** 6 టీస్పూన్లు, **పంచదార:** కప్పు

తయారుచేసే విధానం

వెడల్పుగా ఉన్న మందపాటి గిన్నెలో రెండు లీటర్ల పాలు పోసి బాగా మరిగించాలి. అవి సగమయ్యాక సిమ్‌లో పెట్టాలి. తెడ్డుతో కలుపుతూనే నిమ్మరసం కొంచెకొంచెంగా వేయాలి. పాలు విరిగినట్లుగా అయి అందులోని నీళ్లు వేరవుతాయి. ఇప్పుడు దీన్ని పలుచని బట్టలో వడగట్టాలి. తరవాత దాన్ని మూటలా కట్టి గట్టిగా పిండితే నీళ్లన్నీ పోతాయి. ఇప్పుడు ఈ పాల విరుగుడులో మూడు టీస్పూన్ల నెయ్యి వేసి స్టవ్ మీద పెట్టి దాన్ని గరిటెతో చిదుముతూ పదిహేను నిమిషాలు ఉడికించాలి.

ఇప్పుడు పాలవిరుగుడు పెద్ద రవ్వ మాదిరిగా అయ్యాక అరకప్పు పాలు, ముప్పావు కప్పు పంచదార వేసి కలిపి మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. తరవాత దీన్ని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని నాన్‌స్టిక్ పాన్‌లో వేసి తిప్పుతూ దగ్గరగా అయ్యేవరకూ ఉడికించాలి. మిశ్రమం కాస్త రంగు మారి కలాఖండ్ పలుకుల్లా పొడిపొడిగా అవుతుంటుంది.



మళ్లీ ఓ అరకప్పు పాలు, నెయ్యి వేసి తిప్పుతూనే ఉడికించాలి. అది మళ్లీ పొడిగా మారుతుండగా మిగిలిన పాలు పోసి మళ్లీ తిప్పుతూ అది ముదురు గోధుమరంగులోకి మారేవరకూ ఉడికించి దించాలి. రవ్వరవ్వగా ఉన్న పెడ మిశ్రమాన్ని చల్లారాక మిక్సీలో వేసి తీసి చిన్న బిళ్లల్లా చేసి, పంచదారలో దొర్లించి తీయాలి.

దనియా కీ పంజీరీ

కావలసినవి

దనియాలు: కప్పు, **నెయ్యి:** 2 టేబుల్‌స్పూన్లు, **బాదం:** ఎనిమిది, **కిస్‌మిస్:** టేబుల్‌స్పూను, **జీడిపప్పు:** 20, **పంచదార పలుకులు:** 2 టేబుల్‌స్పూన్లు



తయారుచేసే విధానం

దనియాల్లో పొట్టు లేకుండా చేసి పాన్‌లో గోధుమ రంగులోకి మారేవరకూ వేయించి చల్లార్చాలి. తరవాత వీటిని మిక్సీలో వేసి పొడిలా చేయాలి.

పంచదారను పొడిలా చేసి పక్కన ఉంచాలి.

బాణలిలో టీస్పూను నెయ్యి వేసి సన్నగా తరిగిన జీడిపప్పు, బాదం వేసి వేయించాలి. చివర్లో కిస్‌మిస్ వేసి తీయాలి. అందులోనే మిగిలిన నెయ్యి వేసి కాగాక దనియాలపొడి వేసి సుమారు ఐదు నిమిషాలు వేయించి దించి చల్లారనివ్వాలి. ఇప్పుడు ఇందులో పొడిచేసిన పంచదార, వేయించిన బాదం, జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి. చివరగా పంచదార పలుకులు వేస్తే ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో చేసే కృష్ణాష్టమి ప్రసాదం రెడీ.

అటుకుల పుట్టు



కావలసినవి

అటుకులు: 2 కప్పులు, **బెల్లం:** కప్పు, **కొబ్బరి తురుము:** అరకప్పు, **జీడిపప్పు:** పది, **యాలకులపొడి:** అరటీస్పూను, **నెయ్యి:** 4 టేబుల్‌స్పూన్లు, **ఉప్పు:** చిటికెడు

తయారుచేసే విధానం

నాన్‌స్టిక్ పాన్‌లో అటుకులు వేసి మంచి వాసన వచ్చేవరకూ వేయించి తీసి చల్లారాక మిక్సీలో వేసి పొడి చేయాలి.

చిన్న బాణలిలో టీస్పూను నెయ్యి వేసి జీడిపప్పు వేయించి తీయాలి.

అటుకుల పొడిలో చిటికెడు ఉప్పు వేసి నీళ్లు చిలకరించి కాస్త తడీపొడీ పిండిలా కలపాలి.

బాణలిలో బెల్లం తురుము అరకప్పు నీళ్లు పోసి మరీ తీగ కాకుండా పాకం నీళ్లలో వేస్తే కరిగిపోకుండా నిలిచి ఉండేంత చిక్కని పాకం రానివ్వాలి. ఇప్పుడు మంట తగ్గించి అందులో అటుకుల పొడి, యాలకులపొడి వేసి కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి రెండు నిమిషాలు ఉడికించాలి. మిశ్రమం మెత్తగా అయ్యాక కొబ్బరితురుము, జీడిపప్పు వేసి కలిపితే తమిళనాట నివేదించే అటుకుల పుట్టు రెడీ.

బెంగాలీ శిన్నీ

కావలసినవి

పచ్చి పాలు: లీటరు, **అరటిపండ్లు:** నాలుగు, **పంచదార లేదా బెల్లం తురుము:** కప్పు, **గోధుమపిండి:** 4 టేబుల్‌స్పూన్లు, **కొబ్బరి తురుము:** కప్పు, **ఆపిల్:** ఒకటి, **ఎండుద్రాక్ష:** పది, **జీడిపప్పు:** పది, **పచ్చకర్పూరం:** కొద్దిగా, **యాలకులపొడి:** టీస్పూను

తయారుచేసే విధానం

పంచదార లేదా బెల్లం మెత్తని పొడిలా చేయాలి.

అరటిపండ్లు తొక్కలు తీసి గుజ్జులా చేసి అందులో పంచదార పొడి వేసి కలపాలి. పాలు కూడా పోసి కలపాలి. పాలు మరీ చల్లగానూ మరీ వేడిగానూ కాకుండా ఉండాలి. అంటే గది ఉష్ణోగ్రత దగ్గర ఉండే వేడి మాత్రమే ఉండాలి. ఇప్పుడు అందులో గోధుమపిండి వేసి బాగా కలపాలి. చేతులతో లేదా కవ్వంతో కూడా చిలికినట్లుగా కలపొచ్చు. తరవాత సన్నని ముక్కలుగా కోసిన ఆపిల్, ఎండుద్రాక్ష, జీడిపప్పు వేసి కలపాలి. ఇష్టమైతే దానిమ్మ, ద్రాక్ష... లాంటి పండ్లు కూడా వేసుకోవచ్చు. చివరగా కర్పూరం, యాలకులపొడి వేసి కలిపితే బెంగాలీ కృష్ణ ప్రసాదం రెడీ.



ఆ రైలెక్కితే అన్నీ కన్నీటి కథలే!



ప్రతిరోజూ మనదేశంలో కొన్ని వేల రైళ్లు నడుస్తున్నాయి. అయితే వేటికీ లేని ప్రత్యేకత అబోహర్- జోధ్‌పూర్ 54703 ప్యాసింజర్ రైలుకి ఉంది. పంజాబ్‌లోని బఠిండా స్టేషన్‌కి రాగానే ఆ రైలు పెట్టెలన్నీ ఒక్కసారిగా క్యాన్సర్ రోగులూ వాళ్ల బంధువులతో నిండిపోతాయి. అక్కడనుంచి ఆ చెమ్మగిల్లిన హృదయాలను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని లాలించి నిద్రపుచ్చుతూ ఆశల్ని చిగురింపజేస్తూ బీకానెర్‌కు చేరుస్తుంది. దాంతో దాని పేరే క్యాన్సర్ ట్రెయిన్‌గా మారిపోయింది.



క్యాన్సర్ రోగులు ఒక ప్రాంతం నుంచి చికిత్స కోసం మరో ప్రాంతానికి వెళ్లడం అనేది సాధారణమే. కానీ ఒకే ప్రాంతం నుంచి ప్రతిరోజూ సుమారు వంద మంది రోగులు ఒకే రైల్లో ఒకే చోటుకు చికిత్స కోసం వెళ్లడమే అసాధారణం. వారాంతాల్లో ఈ సంఖ్య మరీ ఎక్కువ. అందుకే ప్రపంచంలో మరెక్కడా లేని రీతిలో ఈ రైలు క్యాన్సర్ ట్రెయిన్‌గా పేరొందింది.

దీనికి కారణాలు లేకపోలేదు. పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలోని మాన్సా, సంగ్రూర్, బఠిండా, ఫరీద్‌కోట్, మోగా, ముక్త్‌సర్, ఫిరోజ్ పుర్ జిల్లాల్లో దశాబ్ద కాలం నుంచీ క్యాన్సర్ రోగుల సంఖ్య బాగా పెరిగింది. చికిత్స చేయించుకుందామంటే వాళ్లలో ఎక్కువమంది కూలీలూ సన్నకారు రైతులే. చుట్టుపక్కల పట్టణాల్లోని ప్రైవేటు క్యాన్సర్ ఆసుపత్రుల్లో చికిత్స ఎంతమాత్రం అందుబాటులో లేదు. పరీక్షలకే లక్షల రూపాయలు కావాలి. దాంతో వాళ్లంతా బీకానెర్ ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రయాణం కడుతున్నారు.

అక్కడకు వెళ్లడానికి వాళ్లకు ఉన్న సౌకర్యం ఈ ప్యాసింజర్ రైలే. సరిగ్గా రాత్రి 9.20కి కదిలే ఈ రైలెక్కి ఉదయం ఆరు గంటలకు బీకానెర్‌కు చేరుకుంటారు. అక్కడ పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవడం పూర్తయిపోతే తిరిగి రాత్రికి 9.30కి అదే రైలెక్కి ఉదయానికల్లా బఠిండాకు చేరుకో వచ్చు. పైగా ఈ రైలు మొత్తానికి స్లీపర్ కోచ్ ఒక్కటే. కాబట్టి మిగిలిన పెట్టెలకు రిజర్వేషన్‌తో పనిలేదు. అదీగాక చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లి వచ్చేందుకు క్యాన్సర్ రోగులకు రైలు టిక్కెట్టు ఉచితం. వాళ్ల సహా యకులకు కూడా 75 శాతం ఫ్రీనే. దాంతో ఆ చుట్టుపక్కల గ్రామాల నుంచి క్యాన్సర్ బాధితులంతా రాత్రి తొమ్మిది గంటలకే బఠిండా స్టేషనుకి చేరి ఈ రైలు రాక్కై నిరీక్షిస్తుంటారు.

ఆ ఆసుపత్రి కోసమే...

పంజాబ్‌వాసులంతా బీకానెర్ వెళ్లడానికి రైలు సౌకర్యం ఉండటం ఒక్కటే కాదు. అక్కడ 'ఆచార్య తులసి రీజనల్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' సేవాదృక్పథంతో పనిచేయడమూ కారణమే. ఈ ఆసుపత్రి రోగుల ఆర్థికస్థోమతతో పని లేకుండా అందరికీ సమానమైన చికిత్సను ఉచితంగా అందిస్తుంది. ఔషధ తయారీ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని హోల్‌సేల్ ధరకే మందుల్ని విక్రయిస్తోంది. చికిత్స చేయించు కోవడానికి అక్కడ కొన్ని రోజులు ఉండాల్సి వచ్చినా ఖర్చుకి పెద్దగా భయపడాల్సిన పని లేదు. ఆసుపత్రి క్యాంటీన్లో ఐదు రూపాయ లకే భోజనం ఉంటుంది. రోగులకు పాలు ఉచితంగానే ఇస్తారు. ఇతర పట్టణాలతో పోలిస్తే అక్కడి ధర్మశాలలో యాభై రూపా యలకే గది దొరుకుతుంది. అందుకే క్యాన్సర్ వ్యాధి సోకిన బక్క రైతు కుటుంబాలన్నీ బీకానెర్ బాటపడుతున్నాయి. ఆ రైల్లో ఎవరిని మాట్లాడించినా ఇదే విషయం చెబుతారు.

'మా దగ్గర చూపించుకుంటే పరీక్షలకే రెండున్నర లక్షల రూపాయలు ఖర్చయింది. చికిత్స మొదలుకాలేదు. అదే అక్కడైతే మొత్తం 30 వేల రూపాయలకే అయిపోయింది' అంటాడు అబోహర్‌కి చెందిన జనకరాజ్.

'బఠిండాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అన్నీ ఏసీ గదులే. రోజుకి రెండు వేల రూపాయలు అద్దె. చికిత్సకు ఎంతవుతుందో చెప్పలేం. అదే అక్కడయితే నామమాత్రపు రుసుము ఉంటుంది' అంటున్నాడు బీకానెర్‌లో తన తల్లికి గర్భాశయ వ్యాధికి వైద్యం చేయిం చుతోన్న సుర్జిత్ సింగ్. ఫరీద్‌కోట్ జిల్లాలోని మాలాన్ గ్రామానికి చెందిన మదన్‌లాల్ అన్నవాహిక క్యాన్సర్ నివారణకోసం కనీసం 30 సార్లు అయినా ఈ రైలెక్కి ఉంటాడు.

జుల్ కౌర్... డెబ్బై ఏళ్ల వృద్ధురాలు. బఠిండా సమీపంలోని గ్రామానికి చెందిన ఆమెకు ఏడాది క్రితమే గర్భాశయ క్యాన్సర్ వచ్చిందట. చికిత్సకోసం తరచూ ఆమె ఈ రైల్లోనే బీకానెర్‌కు వెళుతుంటుంది. ఆమె కూర్చున్న బోగీలోని ప్రయాణికుల్లో చాలా మంది ఆమెకి సుపరిచితులే. వాళ్లందరిదీ ఒకే ఊరు మరి. ఆ ఊళ్లోని మొత్తం 300 కుటుంబాల్లో 70 కుటుంబాలు క్యాన్సర్ బారిన పడ్డాయట. ఇలా ఈ రైల్లో ఎవరిని కదిలించినా క్యాన్సర్ కథలే... కన్నీటి వెతలే. ఇంకా చెప్పాలంటే ఈ రైలు ప్రయాణికుల్లో 60 శాతం క్యాన్సర్ రోగులే. బీకానెర్ ఆసు పత్రికొచ్చే రోగుల్లోనూ సగంమంది పంజాబీలే కావడం దురదృష్టకరం.

పురుగుమందులే!

దీనికి ప్రధాన కారణం 1960లనాటి హరిత విప్లవమే. దిగుబడికోసం రసాయనాల్ని అధి కంగా వాడటంవల్ల రాష్ట్రం క్యాన్సర్ రోగాల పుట్టగా మారుతోంది. రోజుకి 18 మంది క్యాన్సర్ కారణంగా మృతి చెందుతున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా మాల్వా ప్రాంతంలో పత్తి పంట ఎక్కువ. దాంతో క్రిమికీటకాల్ని నివారించే రసాయన స్ప్రేల వాడకం మరీ ఎక్కువ. ఒక్క మహినంగల్ గ్రామంలోనే ఏటా రెండు కోట్ల రూపాయల ఖరీదు చేసే పురుగుమందులు వాడుతున్నా రంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఫలి తంగా అక్కడి నీటిలోనూ భూమిలోనూ క్యాన్సర్ కారకాలు నిక్షిప్తమైపోయాయి. పైగా సంవత్సరాల తరబడి ఈ మందుల వాడకం వల్ల అవి క్యాన్సర్ కారక జన్యుమార్పులకూ కారణమవుతున్నాయి అంటున్నారు వైద్యులు.

ఏదయితేనేం... తమచుట్టూ ఉన్న పచ్చటి పొలాలే తమ పాలిట యమపాశాలుగా మారు తున్నాయని తెలిసినా వాటిని వదులుకోలేరు మాల్వా వాసులు. కానీ జీవితంలో భాగంగా మారిపోయిన క్యాన్సర్ వ్యాధితో మాత్రం భీకర పోరాటమే చేస్తున్నారు... తమ పాలిట 'జీవన రేఖ'గా మారిన రైలు సాయంతో..!



రాశి ఫలం

గ్రహబలం (ఆగస్టు 21 - 27)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తిచేస్తారు. అదృష్టసిద్ధి ఉంది. విఘ్నాలను అధిగమిస్తారు. ఉద్యోగంలో ఒత్తిడి ఉంటుంది. అధికారులతో విభేదాలు రాకుండా చూసుకోవాలి. వ్యాపారపరంగా ఇబ్బంది లుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో చిక్కులు ఉంటాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త. సూర్యస్తుతి శ్రేయస్సునిస్తుంది.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆస్తి వృద్ధి అవుతుంది. గతంలో చేసిన ప్రయత్నాలు ఇప్పుడు సత్ఫలితాన్నిస్తాయి. సమాజంలో గౌరవం పెరుగుతుంది. ఆర్థికంగా బలపడతారు. అనవసర ఖర్చులు తగ్గించుకోండి. లేకపోతే, మనశ్శాంతిని కోల్పోతారు. ధర్మ చింతన అవసరం. వివాదాలు రాకుండా జాగ్రత్తపడాలి. మీ పనిలో మీరు నిమగ్నం కావాలి. ఆంజనేయస్వామిని దర్శించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

శుభవార్త వింటారు. మీదైన రంగంలో క్రమక్రమంగా ఎదుగుతారు. ఉద్యోగ వ్యాపారాల్లో శుభయోగాలున్నాయి. ఆర్థిక ప్రగతి ఉంది. కొత్త అధికారాలు వస్తాయి. బుద్ధి బలం పనిచేస్తుంది. బంధుమిత్రుల ఆదరణ లభిస్తుంది. అపోహలు తొలగుతాయి. ఆధ్యాత్మిక చింతనతో దైవానుగ్రహం లభిస్తుంది. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. శివారాధన శుభప్రదం.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ధనప్రాప్తి ఉంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఉద్యోగంలో అవరోధాల్ని అధిగమించండి. వృత్తి ఉద్యోగాల్లో ఇబ్బందిపెట్టే వారున్నారు. మనశ్శాంతికి భంగం కలగవచ్చు. ఆలోచించి ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి. మిత్రుల సాయం అందుతుంది. కుటుంబ పెద్ద సూచనలు ఉపయోగపడతాయి. ఆవేశంగా మాట్లాడవద్దు. ఆంజనేయస్వామిని ప్రార్థించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

విజయావకాశాలు ఉన్నాయి. పనుల్లో స్పష్టత వస్తుంది. ఉద్యోగంలో ప్రశంసలు అందుకుంటారు. ఆర్థికంగా అనుకూల కాలం. వ్యయభారం పెరుగుతుంది. ఆశయాలు నెరవేరతాయి. ఒక సంఘటన జ్ఞానోదయాన్నిస్తుంది. బాధ్యతాయుతంగా వ్యవహరించి, సమాజంలో గౌరవాన్ని పొందుతారు. పనుల్ని సకాలంలో పూర్తిచేస్తారు. ఆదిత్య హృదయం పారాయణ చేయండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

అదృష్టం వరిస్తుంది. లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆటంకాలు తొలగుతాయి. అవగాహనా సామర్థ్యాన్ని పెంచుకోవాలి. సమాజంలో విలువ పెరుగుతుంది. ఒత్తిడి లేకుండా పనిచేయండి. కొత్త వస్తువులు కొంటారు. మోసం చేసేవారున్నారు జాగ్రత్త. మీ పరిధుల్లో మీరుంటే ఇబ్బందులు రావు. ప్రయాణం మేలు చేస్తుంది. సుబ్రహ్మణ్యస్తుతి రక్షిస్తుంది.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పరిస్థితులకు అనుగుణంగా పనిచేయండి. మనోబలం కాపాడుతుంది. సంశయాన్ని వీడండి. ఉద్యోగంలో శుభఫలితాలున్నాయి. ఆర్థికంగా పుంజుకుంటారు. మొహమాటంతో ఇబ్బందులు రావచ్చు. చంచల స్వభావం వల్ల అశాంతి పెరుగుతుంది. కుటుంబసభ్యుల మాటలు శక్తినిస్తాయి. ఆరోగ్యం సహకరిస్తుంది. శుభవార్త ఆనందాన్నిస్తుంది. లక్ష్మీస్తుతి శుభప్రదం.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. గతంలో కంటే మేలైన సమయం. ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. ఆశించిన ఫలితం చేతికందుతుంది. అవసరాలకు తగినట్టు ఆలోచించాలి. పట్టుదలతో పనుల్ని పూర్తిచేయండి. మిత్రుల సహకారం లభిస్తుంది. ఇంటా బయటా మీదే పైచేయి. తగిన విశ్రాంతి తీసుకోవాలి. వారాంతంలో అదృష్టం సిద్ధిస్తుంది. ఇష్టదేవతారాధన శక్తినిస్తుంది.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మంచి ఫలితం ఉంది. ఆర్థికబలం పెరుగుతుంది. అనవసర వ్యయాలు లేకుండా జాగ్రత్తపడండి. బంధు మిత్రుల రాకపోకలు పెరుగుతాయి. అంతా శుభప్రదంగానే ఉంటుంది. ఉద్యోగంలో పేరుప్రతిష్ఠలు సంపాదిస్తారు. విందు వినోదాల్లో పాల్గొంటారు. బుద్ధిబలంతో ఓ సమస్య నుంచి బయటపడతారు. కుటుంబ సభ్యుల సూచనలు తీసుకోండి. ఆదిత్య హృదయం చదవాలి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇష్టకార్యసిద్ధి ఉంది. పనుల్లో పురోగతి ఉంటుంది. శత్రువులు మిత్రులవుతారు. ఉద్యోగ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తారు. అధికారుల అండదండలుంటాయి. పనులు పూర్తిచేస్తారు. అపరిచితులను నమ్మవద్దు. ఆర్థిక వ్యవహారాల్లో నష్టం రాకుండా జాగ్రత్తపడండి. ఇంట్లో చెప్పిచేసే పనులు శుభఫలితాన్నిస్తాయి. నిదానంగా మాట్లాడితే ఏ సమస్యా రాదు. విష్ణుస్తుతి మేలు చేస్తుంది.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

విజయం ఉంది. ప్రతి పనీ ఆలోచించి చేయాలి. విఘ్నాలు ఎదురవుతాయి. మిత్రుల సూచనలతో ఆటంకాలు తొలగుతాయి. అన్నివైపుల నుంచీ ఆలోచిస్తే మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మనోబలంతో ముందుకు సాగండి. దైవచింతన గొప్పవారిని చేస్తుంది. అభివృద్ధి పథంలో నడుస్తారు. శుభవార్త శక్తినిస్తుంది. రుద్రాభిషేకం శుభదాయకం.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆత్మస్థైర్యంతో విజయం సాధిస్తారు. దైవబలం కాపాడుతుంది. అవసరానికి డబ్బు చేతికందుతుంది. వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలున్నాయి. మిత్రుల సహకారంతో ఒక పనిలో విజయం లభిస్తుంది. మీరు నమ్మిన సిద్ధాంతమే మిమ్మల్ని కాపాడుతుంది. కలహాలకు దూరంగా ఉండాలి. ప్రయాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యం బావుంటుంది. ఆంజనేయస్వామిని ధ్యానించండి.

సమీక్ష

విలక్షణ కోణం



దేశ విభజన కారణంగా ముంబయి నుంచి అయిష్టంగానే లాహోర్‌కు తరలివెళ్ళిన రచయిత మంటో తీవ్ర వేదనకు ఈ కథలు అక్షర రూపాలు. 'తీత్వాల్ కుక్క' కథలో సరిహద్దు ప్రాంతమైన తీత్వాల్‌కు ఇటూ అటూ తిరిగే కుక్కపిల్ల ఏ దేశానిదో తేలక... చివరికి పాక్ సుబేదార్ హిమ్మత్‌ఖాన్, భారత్ జమేదార్ హర్నాంసింగ్‌ల తుపాకులకు బలి అవుతుంది. 'కొత్త రాజ్యాంగం' కథలో... 1935 భారత ప్రభుత్వచట్టం తమ జీవితాల్లో వెలుగు నింపుతుందని ఆశ పెట్టుకున్న జట్కావాలా మంగుకు నిరాశ ఎదురవుతుంది, చివరికి జైలు పాలవుతాడు. రౌలత్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అమృత్‌సర్‌లో సాగిన నిరసన ప్రదర్శనలో తైలా తర్వాత అతని సోదరీమణులు గాయని షంషాద్, నర్తకి అల్మాస్ అమరవీరులు కావడం 'ఇది 1919లో జరిగింది' కథకు ఇతివృత్తం. అన్ని అనువాదాలూ బాగున్నాయి. పరిణత శిల్పంతో నిశిత భావాల్ని నింపుకున్నాయీ కథలు.

తీత్వాల్ కుక్క - మరికొన్ని కథలు
రచన: సాదత్ హసన్ మంటో; పేజీలు: 110; వెల: రూ.60/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు. – జి.రా.

ఆత్మవిశ్వాస ప్రతీక



ఒక పుస్తకాన్ని చదివి పక్కన పెట్టాక కూడా, అందులోని పాత్రలూ సంఘటనలూ కొన్ని రోజుల వరకూ వెంటాడితే... అది కచ్చితంగా మంచి రచనే. 'అమృతవాహిని' ఆ కోవలోకే వస్తుంది. మారే పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకుంటూ ముందుకు సాగిపోయే మంజరి అనే మహిళ కథ ఇది. భార్య ప్రసవం కోసం అమ్మను అమెరికాకు పిలిపించుకున్న సుపుత్రుడు అవసరం తీరాక వెళ్ళిపొమ్మంటాడు. పాతికేళ్ళకే భర్తను పోగొట్టుకున్నా...బిడ్డ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని బతుకుతున్న మంజరి, ఆ సంఘటనతో కుంగిపోలేదు. ఎందుకిలా ప్రవర్తిస్తున్నావని కన్నబిడ్డను ప్రశ్నించ లేదు. స్వయంకృషితో దేశంకాని దేశంలో ఎంతో ఎత్తుకు ఎదిగి, తానేమిటో ప్రపంచానికి చాటింది. అందం, ఆత్మాభిమానం, నిండైన వ్యక్తిత్వమున్న ఓ మహిళామూర్తిని పాఠకుల ముందు ఉంచడంలో రచయిత్రి విజయం సాధించారు.

అమృతవాహిని; రచన: అనురాధ (సుజల గంటి)
పేజీలు: 208, వెల: రూ.150/-; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు. – నరకుల లక్ష్మి

వేమన పద్యధార



వేమన్న పద్యాలు పామరుడి వేదాలు. ఆ నాలుగు పంక్తుల్లో నలుదిక్కుల విజ్ఞానం ఉంటుంది. అపారమైన జీవితానుభవం తొంగిచూస్తుంది. మూఢ నమ్మకాలకు తలవంచని హేతువు గోచరిస్తుంది. పురుషుల్లో పుణ్యపురుషుల్ని గుర్తించే క్షీర-నీర న్యాయసూత్రాలుంటాయి. మనిషిగా బతకడానికీ, వ్యక్తిగా వికసించడానికీ అవసరమైన సాధన సంపత్తి అంతా ఉంటుంది. ఆ పద్యాల్ని ఏ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం లాంటి మధుర గాయకుడు శ్రావ్యంగా పాడుతుండగా, తెర మీద పద్యభావాన్ని ప్రతిబింబించే యానిమేషన్ దృశ్యాలు కనిపిస్తుంటే... చెవులకు ఇంపు, కనులకు విందు, మనసుకు హాయి! 'విశ్వదాభిరామ వినురవేమ'లో అచ్చంగా అలాంటి ప్రయత్నమే చేశారు సూత్రకర్త కొత్తపల్లి సీతారాము. ఇందులో కార్టూన్ యానిమేషన్‌తో వంద పద్యాల్ని గుదిగుచ్చారు. పుస్తకంతో పాటే డీవీడీ కూడా ఇస్తున్నారు.

విశ్వదాభిరామ వినురవేమ; సూత్రీకరణ: కొత్తపల్లి సీతారాము
పేజీలు: 100; వెల: రూ.220/-; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు. – సుధీంద్ర

సదాలోచనలు

'నీతోనే నీ నీడ'...నీలంరాజు లక్ష్మీ ప్రసాద్ సామాజిక-ఆధ్యాత్మిక వ్యాస సంపుటి. ఇందులో అనేక భావాలూ ఆలోచనలూ విశ్లేషణలూ ఉన్నాయి. కాస్తంత వ్యంగ్యమూ, కాస్తంత హాస్యమూ కలగలిపారు. పుస్తకాలతో వచ్చేది పరోక్ష జ్ఞానమేనంటారు. అలాంటి వాళ్ళంతా 'సెకెండ్‌హ్యాండ్' మేధావులేనని తేల్చేస్తారు. అసలుసిసలు జ్ఞానం అనుభవం తోడైతేనే పండుతుందంటారు. ప్రార్థన ప్రాధాన్యాన్ని వివరిస్తూ అది దైవంతో సంభాషించడమేనని వివరిస్తారు. 'ఆత్మను కనుగొనడానికి మనిషి తాను నేర్చినదంతా విస్మరించాలి' అన్న రమణుల మాటను ఉటంకిస్తూ...మనిషి తనను తాను తెలుసుకునే మార్గాల్ని విశ్లేషిస్తారు. ప్రతి వ్యాసంలోనూ ఒకటో రెండో నీతి కథలో, పిట్టకథలో ఉన్నాయి.



నీతోనే నీ నీడ
రచన: నీలంరాజు లక్ష్మీప్రసాద్
పేజీలు: 137; వెల: రూ.50/-
ప్రతులకు: విద్యార్థి మిత్ర ప్రచురణలు ఫ్రెండ్స్ బుక్ డిపో, షాప్ నం.14 పార్కురోడ్, కర్నూలు.
– జగపతి

బుక్ షెల్ఫ్

శ్రీమదాంధ్రరామాయణములు-శ్రీరామవాణి
రచన: బాబూరావు మహంతి
పేజీలు: 580; వెల: రూ.400/-
ప్రతులకు: రచయిత, విద్యాసాగర్ కమర్షియల్ టైప్ ఇన్‌స్టిట్యూట్ ఎస్.పి. రెసిడెన్సీ ఎదురుగా గాంధీనగర్, రాయగడ-765 001.

స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలపై మతోన్మాదుల దాడి
సంకలనం: గడ్డం కోటేశ్వరరావు
పేజీలు: 133; వెల: రూ.100/-
ప్రతులకు: విశాలాంధ్ర అన్ని శాఖలు.

సాహిత్యానుభూతి (సాహిత్యవ్యాసాలు)
రచన: కోడూరి శ్రీరామమూర్తి
పేజీలు: 109; వెల: రూ.150/-
ప్రతులకు: కోడూరి భారతి డి-5, అఖిల్ అపార్ట్‌మెంట్స్, దానవాయిపేట, రాజమండ్రి-3.

సోమర్సెట్ మామ్ కథలు
అనువాదం: ఎలనాగ
పేజీలు: 166; వెల: రూ.120/-
ప్రతులకు: విశాలాంధ్ర అన్ని శాఖలు.

తెలుగు నాటక రంగం
రచన: ఆచార్య ఎస్. గంగప్ప
పేజీలు: 208; వెల: రూ.150/-
ప్రతులకు: కిన్నెర పబ్లికేషన్స్ 2-2-647/153, ఫ్లాట్ నం.101, 102 మద్దాలి గోల్డెన్ నెస్ట్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ హైదరాబాద్.

గాంధీజీ అంతేవాసి ప్రభాకర్‌జీ
రచన: రావినూతల శ్రీరాములు
పేజీలు: 64; వెల: రూ.40/-
ప్రతులకు: సాహితీ ప్రచురణలు 29-13-53, కాళేశ్వరరావు రోడ్డు సూర్యారావు పేట, విజయవాడ-2.

బువ్వకుండ (దీర్ఘకవిత)
రచన: అన్నవరం దేవేందర్
పేజీలు: 36; వెల: రూ.50/-
ప్రతులకు: ఎదునూరి రాజేశ్వరి ఫ్లాట్‌నం: 406, మారుతి హెవెన్స్ భగత్‌నగర్, కరీంనగర్.

పదవినోదం

కూర్పు: **బాలు**

ఆధారాలు

అడ్డం:

1. చంద్రుడు క్షీణించే పక్షం? (4)
4. కర్మాగారం (3)
7. నవమి తరవాత రెండో తిథి? (4)
9. డమాస్కస్ ఏ దేశ రాజధాని? (3)
10. హేతుబద్ధం కానిది, సహేతుకానికి వ్యతిరేకం (4)
11. స్పృశించగా (2)
13. బండి, శకటం (2)
15. అశ్వత్థ వృక్షం (2)
17. తిలే, నీవే! (2)
19. అదృష్టవశాత్తు వాడుకలో (3)
20. తోడుకో! (3)
22. మహబూబ్‌నగర్ పాతపేరు? (4)
24. నేరగాళ్ల చేసేవి? (3)
26. ఆంగ్ల గవాక్షం (2)
27. రుషిత్వం పొందినవాడు! (2)
28. అడ్డం 11తో జెండా (1)
29. ఆపద, ప్రమాదం (2)
31. క్రిష్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ సినిమా! (2)
33. అడ్డం 28తో శిశువు (1)
34. కేరళలో ఒక నది (2)
35. అసహ్యం (3)
36. తేరు, స్యందనం (2)
37. అక్షరాలా నూరే (2)
39. ఒకచోటునుంచి ఇంకోచోటుకు మారు, సంచరించు (3)
40. స గుణింతంలో బుడ్డి! (2)
42. శ్రీరంగనాథుడు (3)
44. కోయిల (2)
46. పద్ధతిగా (4)
49. '... నాన అహి ... నాన పురే ...నాన భళా ... నాన' (2)
50. ఆస్థానం, సేవ (3)
51. పక్షం అంటే? (2)

1		2			3		4		5		6
				7		8			9		
	10							11			
12				13	14		15			16	
17			18		19				20		21
		22		23			24	25			
26			27			28				29	
		30		31	32		33		34		
	35				36			37			38
39				40			41		42	43	
44			45		46	47		48		49	
		50						51			

నిలువు:

1. దయ, కనికరం వంటిది (2)
2. అమావాస్య నుంచి పౌర్ణమికి ఎన్నిరోజులు? (4)
3. కాహళం, ఒక వాయిద్యం (2)
4. వారణాసి (2)
5. ముక్కు (3)
6. లిఖించాలి! (3)
7. ఎకాయెకి, ఏకమొత్తంగా, టోకున (3)
8. కాగితాల కట్ట! (2)
11. పరిమళం (2)
12. చెవులకు పసందు (5)
14. డీలర్లలో ఒకరు! (3)
15. వచ్చిన వెంటనే (3)
16. స్నేహం, ప్రాప్తి (2)
18. పువ్వు, వికసించు, సంతోషించు ...! (3)
20. పంట పొలాలు (2)
21. విల్లు (3)
23. వినాయకుడి వాహనం (3)
25. రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో రేవతి ముఖ్యపాత్ర పోషించిన 1992 నాటి చిత్రం! (2)
29. తట్ట (2)
30. మత్స్యాలు (3)
32. కారాగారం (4)
34. పంచిపెట్టడం (3)
35. అగడ్త (3)
38. తెలుగు రిలీజ్! (4)
39. స్త్రీ, గోరోజన వర్ణం (3)
41. యుద్ధం (2)
43. ఒకప్పటిది, జరిగిపోయింది (2)
45. బంగాళాదుంప! (2)
47. ఓర్పు (2)
48. మినపప్పు నానబోసి గట్టిగా రుబ్బి అరటి ఆకు మీద వత్తి సలసల కాగుతున్న నూనెలో వేయిస్తే- తింటే ఇదే తినాలనిపించేది! (2)

సుడోకు

2		1		8	6	5	3	
3	9						7	
	5		3		4			
4		9		1	8		6	
5								7
	1		5	7		4		2
			8		1		5	
	2						9	6
	3	5	9	6		2		1

గతవారం సమాధానాలు

పదవినోదం

1 మ	హి	2 మ		3 పో	లి	4 క		5 ఎ	డ్ల	6 బం	డి
ది		7 సి	8 గ	లో		9 ర	10 మో	లా		ది	
11 ర	12 మ		డ		13 వి	వా	దం		14 క	పో	లం
	15 తి	16 రు	ప	17 తి		లం		18 వె		టు	
19 త్రి		మా		20 కో	21 య		22 క	లి	23 మి		24 సం
	25 వ	లు	26 వ		27 ము	ద	రా		28 ష	29 ర	తు
30 హ	ద్దు		31 ల	32 ల	న		33 చీ	34 మ		ట్టు	
	35 తే	36 రా		త		37 మి		38 రు	చి		39 ధా
40 పీ		41 హూ	గ్లీ		42 వే	న	43 వే	లు		44 వి	
45 కే	46 తు	వు		47 క		48 ప	దం		49 పౌ	రు	షం
	మ్మొ		50 హ		51 బొ	ట్టు		52 మి	త్రు	లు	
53 వ	ద	నం		54 కొ	మ్మ		55 ఎ	న్న	డు		56 రి

సుడొకు

7	2	8	3	5	6	9	4	1
1	9	6	7	8	4	5	2	3
5	3	4	1	2	9	7	6	8
3	7	2	5	6	8	1	9	4
9	8	5	4	1	2	3	7	6
4	6	1	9	7	3	8	5	2
8	1	7	6	4	5	2	3	9
2	4	9	8	3	7	6	1	5
6	5	3	2	9	1	4	8	7

బృందావనం చూసొద్దాం రండి



బృందావనం... చిన్ని కృష్ణుడు పెరిగిన చోటు. అందుకే, ఉత్తర ప్రదేశ్‌లోని, వృందావన్‌లో కృష్ణుడికి అయిదువేలకు పైగా ఆలయాలు ఉన్నాయి. ఒక్కో దానిదీ ఒక్కో ప్రత్యేకత. కానీ ఆధ్యాత్మికతతో పాటు అలనాటి బృందావనంలో చిన్ని కృష్ణుడు చేసిన లీలలను చూడాలంటే మాత్రం 'ప్రేమ్ మందిర్'కి వెళ్లాల్సిందే. జగద్గురు శ్రీ కృపాలు జీ మహరాజ్ నిర్మించిన ఈ ఆలయ నిర్మాణ శైలి ఓ అద్భుతమైతే, 54 ఎకరాల విస్తీర్ణంలో మందిరం చుట్టూ ఏర్పాటుచేసిన బృందావన్ పార్కు మరింత అద్భుతం. గోవర్ధన పర్వతం ఎత్తుతున్న దృశ్యమూ గోపికలతో జరిపిన రాసలీలలూ కాళీయ మర్దన ఘట్టం... ఇలా రకరకాల కృష్ణలీలలకు సంబంధించిన అందమైన శిల్పాలెన్నో ఇక్కడ దర్శనమిస్తాయి. జగద్గురు కృపాలు పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రేమ్ మందిర్‌ను రూ.150 కోట్లు ఖర్చుపెట్టి పన్నెండేళ్లు శ్రమించి నిర్మించారు. అందుకే, ఆలయంలోని అణువణువూ భక్తుల్ని సమ్మోహితుల్ని చేస్తుంది.















RAMOJI
GROUP
ఆరోగ్యంగా ఆలోచించండి,
ఆరోగ్యంగా ఉండండి
priya
RICE RICH®
RICE BRAN OIL
Feel good at heart !
● రైస్ రిచ్ ఆయిల్‌లోని సహజ ఒరైజనాల్ చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి, గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది.
● రైస్ రిచ్ ఆయిల్‌లోని SQUALENE చర్మ సౌందర్యాన్ని మెరుగుపరచి ANTIAGING గా పని చేస్తుంది.
● రైస్ రిచ్ ఆయిల్ విటమిన్ "A" & "D" లతో ఫోర్టిఫికేషన్ చేయబడినది. ఇవి మీ ఇంటిల్లి పాదినీ మరింత ఆరోగ్యంగా ఉంచుతాయి.
● గత 35 సంవత్సరాలుగా వినియోగదారుల నమ్మకానికి, నాణ్యతకు ప్రతీకగా నిలుస్తున్న 'ప్రియ ఫుడ్స్' వారి 'విశిష్ట ఉత్పాదన'.
సహజ
ఒరైజనాల్ తో
priya
RICE RICH
Fortified & Refined
Rice Bran Oil
Enriched with vitamins A&D
Feel good at heart!
Improved
priya
RICE RICH
Fortified & Refined
Rice Bran Oil
Enriched with vitamins A&D
Feel good at heart !
1ℓ Net
100% natural